Pubilshed from Tirupathi

PRGI NO : APTEL/25/A2316

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




తిరుపతి | సంపుటి : 01 | సంచిక : 308 | ఆదివారం | జూలై 26, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ

TIRUPATHI | Vol.No : 01 | Issue No : 308 | Sunday | 26 JULY 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana

# గొడ్డలి పార్టీ నేతలు పగటి వేషగాళ్లు

## ఒక్క ఎకరాకు నీరివ్వలేదు... ఒక్క పరిశ్రమ తీసుకురాలేదు

- మీ ఆరోగ్యం..మీ బాధ్యత
- సంజీవనిని సద్వినియోగం చేసుకోండి
- ప్రజారోగ్య భద్రతే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు నుంచి సంజీవని
- ప్రజారోగ్యం-ప్రజా సంక్షేమం-అభివృద్ధి కూటమి ప్రభుత్వ బాధ్యత
- ఆస్పరిలో సంజీవని కార్యక్రమం బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రజాభూమి ప్రతినిధి,కర్నూలు జిల్లా/ఆలూరు: ప్రజారోగ్యం కోసమే సంజీవని పథకాన్ని అందిస్తున్నామని...ఆగస్టు నెల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకాన్ని అమలు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. మీ ఆరోగ్యం... మీ చేతుల్లో ఉంటుందని... ప్రభుత్వం అందించే సంజీవని పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఎం చంద్రబాబు ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలోని ఆస్పరిలో నిర్వహించిన సంజీవని కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం సాంకేతికతను జోడిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్న సంజీవని ప్రాజెక్ట్ ప్రత్యేకతలను సీఎం చంద్రబాబు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... విద్య, వైద్యం మీదే ప్రతి కుటుంబం అత్యధికంగా ఖర్చు చేస్తున్న పరిస్థితుల్లో ప్రజల ఆరోగ్య బాధ్యతను ప్రభుత్వమే తీసుకునేలా సంజీవని ప్రాజెక్టును రూపొందించామని సీఎం తెలిపారు.

ఆగస్టు నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు కానున్న ఈ కార్యక్రమంలో ప్రతి వ్యక్తికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందించి.. కుటుంబ సభ్యులందరికీ ఆభా హెల్త్ ఐడీలు జారీ చేస్తామని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి రాష్ట్ర స్థాయి వరకు మొత్తం ఆరోగ్య సమాచారాన్ని ఒకే వేదికపై అనుసంధానం చేస్తామని వివరించారు.

**ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ ఇదే సంజీవని విధానం :** ప్రజలు అనారోగ్యానికి గురైన తర్వాత చికిత్స ఇవ్వడమే కాదు.. వ్యాధులు రాక ముందే గుర్తించడం, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, అవసరమైనప్పుడు సమర్థవంతమైన వైద్యం అందించడమే సంజీవని లక్ష్యమని సీఎం చెప్పారు. రాష్ట్రంలో 80 లక్షల మంది తీవ్ర వ్యాధులతో బాధపడుతున్నట్లు నివేదికలు వచ్చాయని.. అలాంటి పరిస్థితులను తగ్గించేందుకు ఈ ప్రాజెక్టును తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. నాన్ కమ్యూనికబుల్ వ్యాధులు, మాతా-శిశు ఆరోగ్యం, బాలల ఆరోగ్య పరీక్షలు, 108 అత్యవసర సేవలు, 104 మొబైల్ మెడికల్ యూనిట్లు, ఈ-ఔషధి, ల్యాబ్ సేవలను ఒకే డిజిటల్ వ్యవస్థలోకి తీసుకొస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

2 - పేజీలో..






# ఆగస్టు 1న భారత గౌరవ ప్రధాని చేతుల మీదుగా "అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం" ప్రారంభోత్సవం

- "ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు" పేరుతో ఆరు జిల్లాల్లో జూలై 25 నుండి ఆగస్టు 1 వరకు వారం రోజుల పాటు వేడుకలు..
- విమానాశ్రయ ప్రారంభోత్సవ శుభ సమయాన్ని పంచుకునేలా ఉత్తరాంధ్రలోని అన్ని జిల్లాల ముఖ్య కేంద్రాలలో "కౌంట్‌డౌన్ డిజిటల్ స్క్రీన్లు" ఏర్పాట్లు.
- సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కె ఎస్ విశ్వనాథన్.

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : ఉత్తరాంధ్ర ప్రజాకాంక్షలు, సుదీర్ఘ స్వప్నాన్ని సాకారం చేస్తూ విజయనగరం జిల్లా భోగాపురం వద్ద నూతనంగా నిర్మించిన అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఆగస్టు 01వ తేదీన భారత గౌరవ ప్రధానమంత్రి ఘనంగా ప్రారంభించనున్నారన్నారు.

- మిగతా 2లో..



# నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్రమంత్రి

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

న్యూఢిల్లీ: నీట్ పరీక్ష అవకతవకలకు వ్యతిరేకంగా రెండు నెలలుగా సాగుతున్న యువత ఆందోళనలకు కేంద్ర ప్రభుత్వం తలొగ్గింది. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎట్టకేలకు రాజీనామా చేశారు. ఆయన తన రాజీనామా లేఖను శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి సమర్పించారు. దేశవ్యాప్తంగా విస్తరించిన విద్యార్థి-యువజన ఉద్యమం ఈ రాజీనామాతో చారిత్రాత్మక విజయాన్ని సాధించింది. నీట్ పేపర్ లీక్ వివాదంతో విద్యార్థులు రోడ్డెక్కిన సంగతి విదితమే. బీజేపీ-ఆర్ఎస్ఎస్ నాయకత్వం చివరి నిమిషం వరకు రాజీనామాను నివారించడానికి ప్రయత్నించింది. వారు ప్రధాన్‌ను విద్యా మంత్రిత్వ శాఖ నుండి మరో విభాగానికి బదిలీ చేయాలని కూడా ఆలోచించారు. కానీ ప్రజాగ్రహం పెరగడంతో, వారు ఎటువంటి పురోగతి లేకుండా రాజీనామా దిశగా అడుగులు వేశారు.

- మిగతా 2లో..




# 'మేము గెలిచాం'

## అభిజీత్ దీప్కే

న్యూఢిల్లీ: 50 రోజుల పాటు సాగిన సిజెపి సమ్మె ఎట్టకేలకు విజయవంతమైంది. దేశంలో పరీక్షల అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. దీనిపై స్పందిస్తూ, కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే "మేము దీన్ని సాధించాం" అని అన్నారు. సమ్మెకు మద్దతు ఇచ్చిన వారికి కృతజ్ఞతలు తెలుపుతూ... అభిజీత్ భావోద్వేగంతో మీడియాతో మాట్లాడారు. టైఫాయిడ్‌కు చికిత్స పొందుతున్నప్పటికీ, ఆయన నిరసన ప్రదేశంలో తన నిరసనను కొనసాగించారు. నీట్ పరీక్ష రద్దు కారణంగా ఆత్మహత్య చేసుకున్న 21 మంది విద్యార్థుల ఫోటోలను నిరసన ప్రదేశంలో ప్రదర్శించారు.

- మిగతా 2లో..

# ముగిసిన 'సర్' ఎపిలో 44.71 లక్షల ఓట్ల తొలగింపు ..!

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సర్వే 'సర్' ఎన్యూమరేషన్ ప్రక్రియ ముగిసింది.




2 లో

నిన్న రాత్రి పన్నెండు గంటలతో ఈ ప్రక్రియ ముగిసింది. ఈ సర్వే గడువు ముగిసే సమయానికి రాష్ట్రవ్యాప్తంగా సుమారు 44.71 లక్షల ఓట్లకు సంబంధించిన సమగ్ర వివరాలు నమోదు కాకపోవడం గమనార్హం. క్షేత్రస్థాయి పరిశీలనలో సమాచారం లభించకపోవడంతో ఈ ఓట్లను ఎన్నికల సంఘం 'అన్‌కలెక్టబుల్' (సేకరించలేనివి) వర్గంలో చేర్చింది.



# ఇది ప్రజాస్వామ్య విజయం

## సోనమ్ వాంగ్‌చుక్

న్యూఢిల్లీ: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా 'ప్రజాస్వామ్య విజయం'గా పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ అభివర్ణించారు. వీధుల నుంచి పోరాడి సాధించుకున్న ప్రత్యక్ష ప్రజాస్వామ్యానికి ఇది నిదర్శనమని చెప్పారు. శనివారం ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసినట్లు ప్రకటించిన వెంటనే వాంగ్‌చుక్ 'ఎక్స్' వేదికగా ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు.

2 పేజీలో..

# పొగాకు రైతులను ఆదుకోవాలి..

## సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

- రైతుల సంక్షేమానికి హై ప్రయార్టీ..సమస్య పరిష్కారానికి బయ్యర్లూ సహకరించాలి
- సీఎం చంద్రబాబుతో కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అదనపు సెక్రటరీ, డైరెక్టర్ల భేటీ
- నిరంతర సంప్రదింపులతో వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రతినిధులను రాష్ట్రానికి పంపిన కేంద్రం
- పొగాకు రైతులను ఆదుకునేలా 3 ప్రతిపాదనలు సిద్ధం



ప్రజాభూమి ప్రతినిది,అమరావతి : రాష్ట్రంలోని పొగాకు రైతులను ఆదుకోవాలంటూ కేంద్ర ప్రభుత్వంతో సీఎం చంద్రబాబు చేపడుతున్న నిరంతర సంప్రదింపులతో రాష్ట్రంలోని పొగాకు రైతుల సమస్యలపై కేంద్రం దృష్టి సారించింది. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ నుంచి ఆ శాఖ అదనపు సెక్రుటరీ నితిన్ కుమార్ యాదవ్, డైరెక్టర్ మౌనికా గౌర్ ను రాష్ట్రానికి పంపింది. కర్నూలు జిల్లా పర్యటనకు బయలు దేరే ముందు సీఎం చంద్రబాబుతో వీరు భేటీ అయ్యారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డీబీవీ స్వామి, వ్యవసాయ శాఖ, మార్క్ ఫెడ్ ఉన్నతాధికారులు, టుబాకో బోర్డు ప్రతినిధులు ఈ భేటీలో పాల్గొన్నారు. పొగాకు రైతులను ఆదుకునేలా సిద్ధం చేసిన 3 ప్రతిపాదనలపై సీఎంతో కేంద్ర ప్రతినిధులు చర్చించారు.

2 పేజీలో..

# వెయ్యి ఎకరాల్లో డ్రోన్ల సాయంతో సీడ్ బాల్స్

- మనుషులు అడుగుపెట్టలేని ప్రాంతాల్లో క్షీణించిన అడవుల పునరుద్ధరణ దిశగా అడుగులు
- రాష్ట్రవ్యాప్తంగా 6,500 హెక్టార్ల విస్తీర్ణంలో మానవ వనరుల సాయంతో లక్షల విత్తన బంతులు వెదజల్లే పక్రియ పూర్తి
- 30 వేల హెక్టార్ల లక్ష్యాన్ని నిర్ణీత కాల వ్యవధితో పూర్తి చేయాలన్న పవన్ కళ్యాణ్
- సీడ్ బాల్స్ వెదజల్లడంతోపాటు మొలకలకు రక్షణ కల్పించే బాధ్యత తీసుకోవాలి
- సీడ్ బాల్స్ పంపిణీ, వెదజల్లే కార్యక్రమంపై అటవీశాఖ అధికారులతో సమీక్షించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

2 పేజీలో..








# ఖరీఫ్ సీజన్ పెండింగ్ బీమా బకాయిల విడుదలకు కేంద్రం అనుమతి

## మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాభూమి ప్రతినిధి, న్యూఢిల్లీ : కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో చర్చలు ఫలించినట్లు ఎపి మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. 2024 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పంటల బీమా పెండింగ్ బకాయిల విడుదలకు మార్గం సుగమమైందన్నారు.

- మిగతా 2లో..



# డిఎస్సీపై వైసిపి పదేపదే అసత్య ఆరోపణలు

- మండిపడ్డ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి
- ఆర్టీసిని ప్రైవేట్ పరం చేయబోమని హామీ

ప్రజాభూమి ప్రతినిధి, విశాఖపట్నం : ఏపీలో డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి నారా లోకేశ్‌పై వైసీపీ చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని మంత్రి మండిపడ్డారు. వైసీపీకి ఆరోపణలు చేయడం తప్ప ఆధారాలు చూపించే అలవాటు లేదని విమర్శించారు. తాడేపల్లిలో జగన్ ఇంటి సమీపంలోనే ఉండి లోకేశ్ డీఎస్సీపై సవాల్ విసిరారని, దానిపై స్పందించేందుకు జగన్ ఎందుకు ముందుకు రాలేదని ప్రశ్నించారు.

2 లో..



# ఇది యువత సాధించిన విజయం

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై ప్రియాంక గాంధీ

- నీట్-యూజీ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా
- ఇది యువత సాధించిన విజయమని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ హర్షం
- యువత గొంతును ఎప్పటికీ ఎవరూ అణచివేయలేరని ప్రియాంక వ్యాఖ్య

న్యూఢిల్లీ: నీట్-యూజీ పరీక్షల అవకతవకల వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా హర్షం వ్యక్తం చేశారు.

2 లో

ప్రజాభూమి
ఆదివారం, జూలై 26, 2026 2

# గొడ్డలి పార్టీ నేతలు పగటి వేషగాళ్లు

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఏఐ ఆధారిత వైద్య సహాయం, టెలిమెడిసిన్, రిమోట్ కేర్, ప్రిడిక్టివ్ అనలిటిక్స్, డిజిటల్ నర్వ్ సెంటర్లను సంజీవనిలో భాగం చేస్తామని సీఎం తెలిపారు. సంజీవని సిటిజన్ వెల్‌నెస్ యాప్ ద్వారా ప్రజలు వైద్యుల అపాయింట్‌మెంట్లు బుక్ చేసుకోవడంతో పాటు తమ ఆరోగ్య రికార్డులను ఎప్పుడైనా పరిశీలించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రజారోగ్యాన్ని కాపాడటంలో ప్రభుత్వం కార్యక్రమాలు అమలు చేయడం ఒక్కటే సరిపోదని.. ప్రజల్లో కూడా ఆరోగ్య చైతన్యం పెరగాలని సీఎం సూచించారు. మంచి ఆహారం, యోగా, ధ్యానం, వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన కుటుంబం.. ఆరోగ్యవంతమైన గ్రామం.. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

**సంక్షేమం నుంచి సౌర విద్యుత్ వరకు.. ప్రతీ కుటుంబానికి అండగా ప్రభుత్వం :** ప్రజారోగ్యంతో పాటు సంక్షేమానికీ సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని సీఎం చెప్పారు. ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్లు అందిస్తూ పేదలకు ఆర్థిక భద్రత కల్పిస్తున్నామని.. అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు రూ.20 వేల సాయం అందిస్తున్నామని తెలిపారు. తల్లికి వందనం ద్వారా ప్రతి విద్యార్థికి మద్దతు, స్త్రీశక్తి ద్వారా మహిళల సాధికారత, దీపం-2.0 ద్వారా గ్యాస్ సబ్సిడీ, ప్రతి ఇంటికీ సౌర విద్యుత్ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల్లో గందరగోళం సృష్టించి వివాదాలకు కారణమయ్యారని సీఎం విమర్శించారు. రీసర్వే ద్వారా అన్ని భూ రికార్డులను బ్లాక్‌చైన్ టెక్నాలజీతో భద్రపరుస్తున్నామని తెలిపారు. ప్రతి నెలా 9వ తేదీన పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తూ ప్రజల ఆస్తులకు రక్షణ కల్పిస్తున్నామని.. వచ్చే ఏడాది మార్చి నాటికి రీసర్వే పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. 2028 నాటికి కడప స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని సీఎం చెప్పారు. హీరో మోటార్స్, ఎల్‌జీ, దాల్మియా వంటి అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయని.. రూ.1 లక్ష కోట్ల ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులతో రాయలసీమను ఉద్యాన, పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. కర్నూలు-బళ్లారి రైల్వే లైన్‌కు కేంద్రం ముందుకు రావడం సంతోషకరమన్నారు.

**వేదవతి లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేస్తాం :** ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గిన నేపథ్యంలో రైతులు నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జల ధార కార్యక్రమం ద్వారా భూగర్భ జలాలు పెంచే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. వేదవతి ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంతానికి సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో మూడు ఏళ్లలో 36 సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ఇరిగేషన్ క్యాలెండర్ రూపొందించామని తెలిపారు. కర్నూలు జిల్లాలో రూ.1,768 కోట్లతో వేదవతి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో సాగునీటి ప్రాజెక్టులకు పైసా ఖర్చు పెట్టలేదని.. ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదని సీఎం విమర్శించారు. ఒక్క ఎకరాకు కొత్తగా నీళ్లు ఇవ్వలేదని.. ఉద్యోగాలు కల్పించలేదని ఆరోపించారు. డ్రిప్ సబ్సిడీలు ఎత్తేసినవారే ఇప్పుడు రాయలసీమ అభివృద్ధి గురించి మాట్లాడటం విడ్డూరమన్నారు. అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు అన్నం పెడుతుంటే గత పాలకులు సహించలేక పోయారని... గత పాలకులు రాష్ట్రంలో ప్రతీ వ్యవస్థను ధ్వంసం చేశారని గుర్తు చేశారు. గొడ్డలి పార్టీ నేతలను.. వారు చేసే మోసపూరిత రాజకీయాలను విశ్వసించ వద్దని ముఖ్యమంత్రి కోరారు.

**పరదాలు కట్టడం లేదు... చెట్లు నరకడం లేదు :** సంజీవని కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభ అనంతరం అదే వేదిక మీద నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా అధికార యంత్రాంగం పనితీరును సమీక్షించారు. శాఖల మంచి పనితీరు కనపరిచిన అధికారులకు అభినందనలు తెలిపారు. ప్రజలకు సుపరిపాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం సంకల్పం తీసుకుని పనిచేస్తున్నామని క్షేత్ర స్థాయి వరకూ అంతా సమర్థంగా పనిచేసినప్పుడే ప్రజలకు మేలు చేయగలమని అన్నారు. ఇప్పటి వరకు తాను 50 బహిరంగ సభల్లో ఇదే విధంగా అధికారులు, ఉద్యోగుల పనితీరును ప్రజలకు వివరించానని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా అధికార యంత్రాంగంతో ముఖ్యమంత్రి గ్రూప్ ఫొటో దిగారు. కర్నూలు జిల్లాలోని స్వయం సహాయ సంఘాల మహిళలకు రూ.197 కోట్ల చెక్కును అందజేశారు. ప్రసంగిస్తున్న సమయంలో వినతిపత్రాలు ఇచ్చేందుకు కొందరు ప్రయత్నించటంతో సభ ముగిసిన అనంతరం వాటిని తీసుకుంటానని సీఎం వారికి వివరించారు. తాను ప్రజలందరినీ కలుస్తానని.. గత పాలకుల లాగా పరదాలు కట్టుకుని తిరగటం లేదని, చెట్లను నరికించి సమావేశాలు పెట్టటం లేదని సీఎం వ్యాఖ్యానించారు. సీఎం అంటే సచివాలయంలో కూర్చునే చీఫ్ మినిస్టర్ మాత్రమే కాదని.. ప్రజల మధ్య ఉండే కామన్ మ్యాన్ అని చెప్పారు. అందుకే ప్రతి నెలా ప్రజల మధ్యకు వచ్చి వారి సమస్యలు తెలుసుకుంటూ... వాటికి పరిష్కారంగా ప్రజా విధానాలు రూపొందిస్తున్నామని సీఎం వెల్లడించారు. ఈ సమావేశంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, కర్నూలు జిల్లా ప్రజా ప్రతినిధులు, స్థానిక కూటమి పార్టీల నేతలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీక్‌కు

## బాధ్యత వహిస్తూ కేంద్రమంత్రి

సీజేపీ ఆధ్వర్యంలో జూన్ 6న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రారంభమైన 50 రోజుల తర్వాత కేంద్ర మంత్రి రాజీనామా చేశారు. సీజేపీ, వామపక్ష విద్యార్థి సంఘాల చొరవతో ప్రారంభమైన ఈ ఆందోళన దేశవ్యాప్తంగా వ్యాపించి, దశాబ్ద కాలంలో భారతదేశం చూసిన అత్యంత చారిత్రాత్మక నిరసనగా నిలిచింది. సోనమ్ వాంగ్‌చుక్ గురువారం అర్ధరాత్రి తన 26 రోజుల నిరాహార దీక్షను విరమించారు.కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన ప్రశ్నోత్తరాల కార్యక్రమం అనంతరం ఆత్మహత్య చేసుకున్న పిల్లల కుటుంబాలకు కోటి రూపాయలు అందిస్తామని, నిరసనకారులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోబోమని కేంద్రం హామీ ఇచ్చింది. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్, సీజేపీ అధికార ప్రతినిధులు అశుతోష్ రంగ, సౌరవ్ దాస్‌లతో ఈ చర్చ జరిగింది. 47 మంది ఎన్‌టీఏ అధికారులను తొలగించినట్లు కూడా సమాచారం. ఈ సందర్భంగా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ.. నెల రోజులుగా జరుగుతున్న పరిణామాలు తననెంతో బాధించాయన్నారు.

# ఖరీఫ్ సీజన్ పెండింగ్ బీమా బకాయిల విడుదలకు కేంద్రం అనుమతి

గత ప్రభుత్వం హయాంలో పెండింగ్‌లో ఉన్న 2024-ఖరీఫ్ పంటల బీమా బకాయిలు విడుదల చేసేందుకు కేంద్రం అనుమతినిచ్చిందన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ వైఫల్యాలతో వ్యవసాయ శాఖలో పేరుకుపోయిన సమస్యలకు కూటమి ప్రభుత్వం పరిష్కారం చూపుతోందని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. రైతుల పక్షాన స్పందించి బీమా బకాయిల విడుదలకు సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# పొగాకు రైతులను ఆదుకోవాలి...

వడ్డీ లేకుండా వర్కింగ్ క్యాపిటల్ రుణాల జారీ, ప్రోత్సాహకాలు, ధర లోటు భర్తీ వంటి ప్రతిపాదనలను రూపొందించారు. ఈ ప్రతిపాదనలపై పూర్తి స్థాయిలో చర్చించాలని... ఏ నిర్ణయం తీసుకున్నా పొగాకు రైతులకు నష్టం వాటిల్లకుండా చూడాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఇదే సయయంలో ప్రతేడాది పొగాకు రంగంలో ఇదే సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తాత్కాలిక ఉపశమన చర్యలతో సరిపెట్టకుండా, షార్ట్ టర్మ్, మీడియం టర్మ్, లాంగ్ టర్మ్ వ్యూహాలతో సమగ్ర విధానాన్ని రూపొందించాలని అధికారులకు సూచించారు. కేంద్రం వైపు నుంచి ఏ మేరకు సాయం అందించగలరు... రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి తీసుకోవాల్సిన చర్యల పైనా చర్చించి తుది నిర్ణయానికి రావాలని ముఖ్యమంత్రి చెప్పారు. రైతులు, బయ్యర్లు, టొబాకో బోర్డు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. ఇలా అందరూ స్టేక్‌హోల్డర్లేనని, అందరి బాధ్యతతోనే సమస్యకు పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ పరిస్థితులు, మార్కెట్ డిమాండ్ వంటి అంశాలను కూడా దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పంటను ఒకటి, రెండేళ్లు నిల్వ ఉంచే అవకాశాలున్నాయా..? ధరలు స్థిరపడిన తర్వాత విక్రయించుకోవచ్చా.. అనే అంశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. లో, మీడియం, హై గ్రేడ్ పొగాకును మార్కెట్‌లో ఎలా విక్రయించాలనే దాని పైనా ట్రేడర్లతో మాట్లాడి ఓ కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. పొగాకు రంగంలో భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకుండా సమర్థవంతమైన నియంత్రణ వ్యవస్థ అవసరమన్నారు. సమస్యకు పరిష్కారం చూపే క్రమంలో రైతుల ప్రయోజనాలకు హై ప్రయార్టీ ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇదే సమయంలో ట్రేడర్ల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుని ఓ నిర్ణయానికి వస్తే భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చక్కటి విధానాన్ని రూపొందించవచ్చని సీఎం సూచించారు. ఈ మేరకు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ లీడ్ తీసుకుని చర్చలను కొనసాగించాలని సూచించిన ముఖ్యమంత్రి కర్నూలు జిల్లా పర్యటనకు బయలుదేరారు. ఈ సమావేశం సందర్భంగా మంత్రులు గొట్టిపాటి, డీబీవీ స్వామి, అలాగే ఉమ్మడి ప్రకాశం జిల్లా సహా నరసరావుపేట, రాజానగరం, పోలవరం నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు పొగాకు రైతులు పడుతున్న ఇబ్బందులను కేంద్ర ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. ట్రేడర్లతో కేంద్రం సంప్రదింపులు జరిపి సమస్యను పరిష్కరిస్తే బాగుంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అలాగే ఈ సమావేశానికి వర్చువల్ గా మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, మాగుంట శ్రీనివాసులు రెడ్డి హాజరయ్యారు.

**ట్రేడర్లతో కేంద్ర మంత్రి పెమ్మసాని చర్చలు :**
సీఎం చంద్రబాబు కర్నూలు జిల్లా పర్యటనకు బయలుదేరిన అనంతరం పలువురు ముఖ్యమైన పొగాకు బయ్యర్లతో కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రతినిధులతో కలిసి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వర్చువల్ గా సమావేశమయ్యారు. పొగాకు రైతులను ఆదుకునేందుకు కేంద్ర -రాష్ట్ర ప్రభుత్వాలు, అలాగే టుబాకో బోర్డు ముందుకు వచ్చాయని.. రైతులకు మేలు చేసేలా బయ్యర్లు కూడా ఓ అడుగు ముందుకు వేయాలని పెమ్మసాని సూచించారు. రైతులు నష్టపోకుండా ట్రేడర్ల వైపు నుంచి ఏమేం చేయగలరోననే అంశాన్ని చర్చించుకుని మంచి ప్రతిపాదనలతో రావాలని కోరారు. సోమవారం మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు.

# వెయ్యి ఎకరాల్లో డ్రోన్ల సాయంతో సీడ్ బాల్స్

**ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:** వర్షపాతం, నేలలో తేమ వంటి వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలన చేసుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా సీడ్ బాల్స్ పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఉపముఖ్యమంత్రి అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. అడవులు క్షీణించిన ప్రాంతాల్లో సీడ్ బాల్స్ జారవిడిచే కార్యక్రమాన్ని వేగవంతం చేసేందుకు మరిన్ని డ్రోన్ల సహాయం తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో అటవీ పునరుద్ధరణ, 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యాల్లో సీడ్ బాల్స్ పంపిణీ కార్యక్రమం అత్యంత కీలక ప్రక్రియ అని తెలిపారు. జిల్లాల వారీగా సీడ్ బాల్స్ పంపిణీ, వెదజల్లే కార్యక్రమం, డ్రోన్ సాంకేతికత వినియోగంపై అటవీశాఖ ఉన్నతాధికారులతో శనివారం మధ్యాహ్నం సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు ఎన్ని ఎకరాల్లో సీడ్ బాల్స్ వెదజల్లే ప్రక్రియ పూర్తయ్యింది? డ్రోన్ల సాయంతో ఎంత విస్తీర్ణంలో సీడ్ బాల్స్ జారవిడిచారు? తదుపరి లక్ష్యాలు తదితర అంశాలను ఈ సందర్భంగా అధికారులు పవన్ కళ్యాణ్ కి వివరించారు.
ఉపముఖ్యమంత్రివర్యుల ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 3 కోట్లకు పైగా సీడ్ బాల్స్ సిద్ధం చేయగా, ఇప్పటి వరకు 63 లక్షలకు పైగా సీడ్ బాల్స్ దాదాపు 6,500 హెక్టార్ల విస్తీర్ణంలో వెదజల్లే ప్రక్రియ పూర్తి చేసినట్టు అధికారులు తెలిపారు. అందులో మానవ వనరుల సాయంతో సుమారు 6 వేల హెక్టార్ల పరిధిలో 59 లక్షల సీడ్ బాల్స్ వెదజల్లినట్టు, మొట్టమొదటి సారి డ్రోన్ల సాయంతో అడవుల్లో లోయ ప్రాంతాలకి వెళ్లి సీడ్ బాల్స్ జారవిడిచినట్టు వివరించారు. సుమారు వెయ్యి ఎకరాల్లో డ్రోన్స్ ద్వారా సీడ్ బాల్స్ జార విడిచినట్లు తెలిపారు.అత్యధికంగా రాజమహేంద్రవరం సర్కిల్ పరిధిలో దాదాపు 28 లక్షల సీడ్ బాల్స్ వెదజల్లగా, అందులో డ్రోన్ సాయంతో 2.26 లక్షలు జారవిడిచినట్టు అధికారులు చెప్పారు. విశాఖ అటవీ డివిజన్‌లో 7.50 లక్షలు, కర్నూలు అటవీ ప్రాంతంలో 8.67 లక్షల సీడ్ బాల్స్ పంపిణీ ప్రక్రియ పూర్తి చేసినట్టు వెల్లడించారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల ఆధారంగా చింతూరు, పీటీ ఆత్మకూరు, గిద్దలూరు, మార్కాపురం, వైఎస్ఆర్ కడప డివిజన్లలో డ్రోన్ల ద్వారా సీడ్ బాల్స్ జారవిడిచే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్టు, మానవ వనరులు చేరుకోవడం కష్టంగా ఉండే అటవీ ప్రాంతాలను డ్రోన్ ద్వారా చేరుకోవడం సులభం అవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "ఎల్ నినో వల్ల ఏర్పడిన వర్షాభావ పరిస్థితులు సీడ్ బాల్స్ వెదజల్లే ప్రక్రియకు కొంత మేర ఇబ్బందులు కలిగించవచ్చు. వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో మాత్రం జాప్యానికి తావు లేకుండా సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమాన్ని కొనసాగించాలి. అవసరం అయితే డ్రోన్ల సంఖ్య పెంచే విధంగా చర్యలు తీసుకోండి. అటవీ ప్రాంతాల్లో పచ్చదనం తగ్గిన చోట కచ్చితంగా అడవి పునరుద్ధరణ మొదలవ్వాలి. మానవ వనరులతో సీడ్ బాల్స్ వెదజల్లిన ప్రాంతాల్లో మొలకలు వస్తే, వాటిని సంరక్షించడం కోసం తగిన చర్యలు తీసుకోవాలి. 50 శాతం గ్రీన్ కవర్ సాధించాలన్న కూటమి ప్రభుత్వ లక్ష్యాల్లో సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమం అత్యంత ప్రధానమైనది. ఈ కార్యక్రమ నిర్వహణలో ఎవరూ అలక్ష్యంగా ఉండవద్దు. సీడ్ బాల్స్ చల్లి సరిపుచ్చకుండా, వేడి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో మొక్కల పరిరక్షణ బాధ్యతను కూడా స్వీకరించాల"న్నారు.

### ఆగస్టు 1న భారత గౌరవ ప్రధాని చేతుల మీదుగా

# "అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం" ప్రారంభోత్సవం

ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని పురస్కరించుకుని ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి, పర్యాటక మరియు పారిశ్రామిక రంగాలు పుంజుకోవడమే లక్ష్యంగా "ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు" (ఘుతీఘుఅస్త్రతీఘు ఖుశ్రీఖుశ్రీఘునెబ =వనిఘుశ్రీబ) అనే ప్రత్యేక థీమ్‌తో నేటి నుండి ఆగస్టు 01 వరకు వారం రోజుల పాటు విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి మరియు విశాఖపట్నం జిల్లాల్లో సమాచార పౌర సంబంధాల శాఖ మరియు జిల్లా యంత్రాంగాల ఆధ్వర్యంలో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నామని సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కె.ఎస్ విశ్వనాథన్ తెలిపారు. ?ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఉత్తరాంధ్రలోని అన్ని జిల్లాల ముఖ్య కేంద్రాలలో "కౌంట్‌డౌన్ డిజిటల్ స్క్రీన్లు" ఏర్పాటు చేసి విమానాశ్రయ ప్రారంభోత్సవ శుభ సమయాన్ని పంచుకునేలా ఏర్పాటు చేశా మన్నారు. విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు "మై డిస్ట్రిక్ట్ టేక్స్ ఆఫ్" థీమ్‌తో క్విజ్, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ పోటీల్లో విజేతలకు ఆగస్టు 1న జరిగే ప్రధాని ప్రారంభోత్సవ సభలో విశిష్ట ఆసనాలు (ఎఖ్రా రామ్ఖ్అఅస్త్ర) కేటాయించడం జరుగుతుందని, అలాగే, విమానాశ్రయం విజయవంతంగా ప్రారంభమై ప్రాంతీయ అభివృద్ధికి తోడ్పడాలని కాంక్షిస్తూ ఉత్తరాంధ్రలోని ప్రముఖ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు మరియు ప్రార్థనలు నిర్వహిస్తారన్నారు.
?ఉత్తరాంధ్ర గిరిజన ప్రాంతాల అభివృద్ధికి విమానాశ్రయం ఏ విధంగా తోడ్పడుతుందో వివరిస్తూ, గిరిజన సహకార సంస్థ (+జజ) ఆధ్వర్యంలో అరకు కాఫీ, అరకు పసుపు వంటి స్థానిక ఉత్పత్తుల బ్రాండింగ్, ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆగస్టు 1న ప్రధానమంత్రి ఉత్తరాంధ్ర గిరిజన ప్రత్యేక ఉత్పత్తులను బహుకరిస్తారన్నారు. పర్యాటక రంగానికి ఊతమిచ్చేలా ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో పర్యాటక ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి, విమానాశ్రయం ద్వారా పెరగనున్న పర్యాటక అవకాశాలు మరియు హోమ్‌స్టేల నమోదుపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. జులై 30న సెర్ప్ (రాజు-ౡా) మరియు మెప్మా (వీజూహీూ) ఆధ్వర్యంలో "భోగాపురం - ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు" అంశంపై మహిళలతో బృహత్ రంగోలీ (ముగ్గుల) పోటీలు జరుగుతాయన్నారు. ?క్రీడలు మరియు సాంస్కృతిక రంగాన్ని ప్రోత్సహిస్తూ "భోగాపురం థీమ్"తో క్రికెట్, బీచ్ వాలీబాల్ పోటీలు నిర్వహిస్తారన్నారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జన్మస్థలమైన పాండ్రంగి గ్రామంలో మరియు ప్రధాన కేంద్రాల్లో జానపద రూపకాలు, సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా విప్లవ వీరునికి నివాళులు అర్పిస్తారన్నారు. జులై 31న విశాఖపట్నం ఆర్కే బీచ్ రోడ్‌లో 5ఖ/10ఖ మారథాన్ రన్, సైక్లథాన్, ఫ్లాష్ మాబ్‌లు నిర్వహించడంతో పాటు, రాత్రి వేళ ఉత్తరాంధ్ర వైభవాన్ని, విమానాశ్రయ రూపురేఖలను చాటేలా కంటిపాపగా నిలిచే భారీ "డ్రోన్ షో" నిర్వహించనున్నామన్నారు.

- ఈ ప్రచార ప్రణాళికలో భాగంగా ఒక్కో రోజు ఒక్కో జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు.
- ఆయా జిల్లాల కలెక్టర్లు శాఖల సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. దీనిలో భాగంగా జులై - 25న విజయనగరంలో ప్రచార ప్రారంభం మరియు ప్లెడ్జ్ వాల్ ఆవిష్కరణ,
- జులై 26న శ్రీకాకుళంలో జెఎస్డబ్ల్యు / పైడి భీమవరం వద్ద 45,000 ఉద్యోగాల కల్పనపై పారిశ్రామిక సదస్సు మరియు అరసవల్లి ఆలయ ప్రచారం,
- జులై 28న పార్వతీపురం మన్యంలో అరకు పసుపు కియోస్క్ మరియు
- ఎంఎస్ఎంఇ పార్కుల ఎక్స్‌పో,
- జులై 29న అల్లూరి సీతారామరాజు జిల్లాలో కాఫీ రైతుల సదస్సు,
- జులై 30న అనకాపల్లిలో ఎన్నారై మరియు పారిశ్రామికవేత్తల కలయిక,
- జులై 31న విశాఖపట్నంలో ఐటీ కెరీర్ ఎక్స్‌పో మరియు గ్రాండ్ డ్రోన్ షో నిర్వహిస్తారన్నారు.

ఈ చారిత్రాత్మక వేడుకల్లో భాగంగా జులై 31న ఉత్తరాంధ్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించనున్నారన్నారు. ఉత్తరాంధ్రలో పెట్టుబడులు పెడుతున్న పారిశ్రామికవేత్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలుపవలసిందిగా కోరుచున్నామన్నారు. ఉత్తరాంధ్ర ప్రగతికి సరికొత్త బాటలు వేస్తున్న ఈ సువర్ణ ఘట్టంలో ప్రజలందరూ విశేష సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కె. ఎస్. విశ్వనాథన్ పిలుపునిచ్చారు.

# డిఎస్సీపై వైసిపి పదేపదే అసత్య ఆరోపణలు

మొదటి పేజీ తరువాయి

డీఎస్సీ నియామకాలపై ఎలాంటి అనుమానాలు ఉన్నా చట్టబద్ధంగా విచారణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం నుంచి అధికారికంగా వివరాలు ఇచ్చినప్పటికీ వైసీపీ రాజకీయ దివాళాకోరుతనంతో విమర్శలు చేస్తోందని మంత్రి మండిపల్లి అన్నారు. తప్పుడు ప్రచారాలతో యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను వెంటనే మానుకోవాలని సూచించారు. నిరాధార ఆరోపణలతో ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీయడమే వైసీపీ లక్ష్యమని ఆరోపించారు. డీఎస్సీ నియామకాలు చేపట్టలేని వారు రాజకీయ రంగు పులిమి విమర్శలు చేయడం సరికాదని, ప్రజా సమస్యలపై చర్చించకుండా తప్పుడు ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఉన్నంతవరకు ఏపీఎస్ఆర్టీసీని ప్రైవేటుపరం చేయబోమని.. అపోహలకు తావు లేదని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. విశాఖలో సింహపురి ఈ-బస్సు డిపో పవర్ రూమ్‌ను మంత్రి ప్రారంభించారు. రవాణా రంగంలో పీఎం ఈ-బస్ సేవతో నూతనశకం మొదలైందన్నారు. మరో రెండు నెలల్లో తొలి దశలో 750 ఈ- బస్సులు రానున్నాయని, అందులో విశాఖకు 100 బస్సులు కేటాయించనున్నట్టు చెప్పారు. ప్రస్తుత బస్సులతో పాటు, కొత్త ఈ-బస్సులతో ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలందిస్తామన్నారు. పర్యావరణ హిత, ఆధునిక ప్రజారవాణా వ్యవస్థ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.




### ముగిసిన 'సర్' ఏపిలో 44.71 లక్షల

# ఓట్ల తొలగింపు ..!

దీని ప్రభావంతో ఈ నెల 30న ఈసీ అధికారికంగా విడుదల చేయనున్న ప్రాథమిక ఓటర్ల ముసాయిదా (డ్రాఫ్ట్) జాబితాలో ఈ 44.71 లక్షల ఓట్లు కనిపించవు. సరైన ఆధారాలు లేకపోవడం, చిరునామాల మార్పు లేదా ఓటర్ల గైర్హాజరీ వంటి కారణాల వల్ల ఈ ఓట్లు తొలగింపునకు గురయ్యాయని అధికారులు భావిస్తున్నారు.

**క్లైమ్స్, అభ్యంతరాలకు అవకాశం.. అక్టోబర్ 3న తుది జాబితా..** ముసాయిదా జాబితాలో పేర్లు లేని ఓటర్లు కలవరపడాల్సిన అవసరం లేదని, తమ ఓట్లను సరిచేసుకునేందుకు సమయం ఉందని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈ నెల 30 నుండి ఆగస్టు 30 వరకు నెల రోజుల పాటు ఈసీకి అభ్యంతరాలు, ఫిర్యాదులు తెలిపేందుకు అవకాశం కల్పించారు. తమ ఓటు అనుమానాస్పదంగా తొలగించబడిందని భావించేవారు లేదా మార్పులు చేయాలనుకునేవారు ఈ వ్యవధిలో తగిన ఆధారాలతో దరఖాస్తు చేసుకోవచ్చు. అందిన దరఖాస్తులపై ఎన్నికల అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి, అన్ని సరిచూసుకున్న తర్వాత అక్టోబర్ 3 న ఓటర్ల తుది (ఫైనల్) జాబితాను విడుదల చేయనున్నారు.

**అత్యధికంగా నెల్లూరు జిల్లాలోనే..** అత్యధికంగా నెల్లూరు జిల్లాలోనే ఓట్లు తొలగించాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలోనే అత్యధికంగా నెల్లూరు జిల్లాలో 2,90,579, తిరుపతి 2,87,759, కడప 2,44,879, విశాఖపట్నం 2,39,146, గుంటూరు 2,37,789 ఓట్లు తొలగించాల్సిన జాబితాలో ఉన్నాయి. తొలగించాల్సిన జాబితాలో ఉన్న 44,71,523 ఓట్లలో 13,00,152 (29.07%) ఈ 5 జిల్లాల్లోనే ఉన్నాయి. ఇవి కాకుండా మరో 18 జిల్లాల్లో లక్షకు పైగానే ఓట్లు తొలగించాల్సిన జాబితాలో ఉన్నాయని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు.

## 'ఇది ప్రజాస్వామ్య విజయం

శాంతి, ఓపిక, పట్టుదలకు దక్కిన ప్రతిఫలమిదని వాంగ్‌చుక్ ఆనందం వ్యక్తం చేశారు. "దేశంలోని ప్రతీ మూల నుంచి భయాన్ని వీడి, గళమెత్తిన పౌరులకు, జెన్-జీ యువతకు, సీజేపీకి నా అభినందనలు. బాధ్యతాయుత పాలన డిమాండ్ నుంచి మొదలైన ఈ పోరాటం, ఇప్పుడు విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణల దిశగా అడుగులు వేయాలి" అని పేర్కొన్నారు. పరీక్షల అక్రమాలు, ప్రశ్న పత్రాల లీక్‌లపై చర్యలు తీసుకోవాలని, ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ వాంగ్‌చుక్ 26 రోజుల పాటు నిరాహార దీక్ష చేసిన సంగతి తెలిసిందే. ప్రధాన్ రాజీనామా చేసిన సందర్భంగా .... ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. ప్రజలు ఐక్యంగా ప్రశ్నిస్తే ఎంతటి ప్రభుత్వమైనా దిగిరాక తప్పదని విద్యార్థి నాయకులు స్పష్టం చేశారు.

## ఇది యువత సాధించిన విజయం

ఇది దేశ యువత సాధించిన విజయమని, వారి గొంతును ఎవరూ, ఎప్పటికీ అణచివేయలేరని ఆమె స్పష్టం చేశారు.శనివారం తన లోక్‌సభ నియోజకవర్గమైన కేరళలోని వయనాడ్‌లో విలేకరులతో మాట్లాడిన ప్రియాంక గాంధీ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వార్త తనను కొంత భావోద్వేగానికి గురిచేసిందని తెలిపారు. "గత పది, పన్నెండేళ్లుగా మన యువత ఎప్పుడు చైతన్యవంతమవుతుందా అని నేను అనేకసార్లు నన్ను నేను ప్రశ్నించుకున్నాను. నేడు దేశ యువత గళం విప్పింది, వారి గొంతు వినిపించింది. ఇది ఎంతో సంతోషకరమైన విషయం" అని ఆమె పేర్కొన్నారు.ప్రభుత్వం తీరుపై విమర్శలు గుప్పిస్తూ, "ఆర్ఎస్ఎస్ తన భావజాలంతో మొత్తం విద్యా వ్యవస్థను నింపేస్తోంది. మన పూర్వీకుల సిద్ధాంతాలను ప్రణాళికాబద్ధంగా నాశనం చేస్తున్నారు. నిరసన తెలిపిన వారిపై అధికార బలాన్ని ప్రయోగించారు. అయితే, ప్రజలే అత్యంత శక్తివంతులని ప్రతి పాలకుడూ ఈ ఘటన ద్వారా గుణపాఠం నేర్చుకోవాలి. ఈ రోజు మన దేశాన్ని మనం తిరిగి నిలబెట్టుకుంటున్నాం" అని ఆమె వ్యాఖ్యానించారు. నీట్-యూజీ పేపర్ లీక్ ఆరోపణలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ), పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ మద్దతుతో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలు ఉద్ధృతంగా జరిగాయి. కేంద్ర మంత్రి రాజీనామా చేయాలన్నది వారి ప్రధాన డిమాండ్‌గా ఉంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను ప్రజాస్వామ్య విజయంగా సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, సోనమ్ వాంగ్‌చుక్ అభివర్ణించారు.

## 'మేము గెలిచాం'

"చివరకు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. ప్రజల ముందు ఈ ప్రభుత్వం తలవంచక తప్పలేదనడానికి ఈ రాజీనామాయే నిదర్శనం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎవరూ భయపడకూడదనేది దీని ద్వారా లభించే సందేశం," అని అభిజీత్ దీప్కే అన్నారు.

# కూటమి ప్రభుత్వంలో విద్యకు అత్యధిక ప్రాధాన్యత :ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



ప్రజాభూమి ప్రతినిధి / అవనిగడ్డ

విద్యతోనే పేదరిక విముక్తి సాధ్యమని గుర్తించిన కూటమి ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్ర సాద్ అన్నారు. శనివారం అవనిగడ్డలోని సాంఘీ క సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతి గృహం లో సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 90 మంది విద్యార్థినులకు కార్పెట్లు, బెడ్ షీట్లు, రగ్గులు, టవళ్లు, నైట్ వేర్లు, స్వెటర్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా విచ్చేసి విద్యార్థినులకు అందచేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వసతి గృహ బాలికలు క్రమశిక్షణతో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించటం అభినందనీయం అన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి సార్ధకత కల్పించి అద్వితీయులుగా నిలిచారన్నారు. క్రమశిక్షణ లేని జీవితం వ్యర్థం అన్నారు. వసతి గృహ బాలికలు ఏకాగ్రత, క్రమశిక్షణ, ఐకమత్యం, పరస్పర సహకారంతో ప్రతి ఒక్కరూ ఉత్తమ ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. పూర్వం ఆడపిల్లలు ఇంటికి, వంటకు పరిమితమైన రోజుల్లో నాటి దురాచారాలపై అనేక మంది సంఘ సంస్కర్తల పోరాట ఫలితంగా ఆడపిల్లలు విద్యావంతులయ్యారని తెలిపారు. నేడు విద్యార్థినులు విద్యారంగాన్ని కైవసం చేసుకుని అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. దేశ తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ సాహసోపేత ప్రధానిగా నేటికీ ఖ్యాతి పొందారన్నారు. గొప్ప స్థాయికి చేరుకున్న వారిని ప్రతి విద్యార్థిని ఆదర్శంగా తీసుకొని విద్యతో ఎదిగి కుటుంబానికి పేరు తేవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, చెన్ను బాబూరావు, ఏ.ఎస్.డబ్ల్యూ.ఓ ఎం.విజయ, హెచ్.డబ్ల్యూ.ఓ ఎం.మంగమ్మ, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



## కమ్యూనికేషన్ యుగంలో ముందుండండి

### 4 ఏళ్ల ECE తో ఐటీ, టెలికాం, ఎంబెడెడ్, వీఎల్ఎస్ఐ, ఏఐ, IoT రంగాల్లో సూపర్ కెరీర్..

మచిలీపట్నం/ రూరల్
ప్రజాభూమి ప్రతినిధి



ఆధునిక సాంకేతిక విప్లవంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ECE) పాత్ర అత్యంత కీలకమైనది. స్మార్ట్‌ఫోన్ నుంచి స్మార్ట్ సిటీ వరకు, 5G నుంచి ఉపగ్రహాల వరకు, రోబోటిక్స్ నుంచి ఆర్టిఫిషియల్ ఇంటె లిజెన్స్ (AI) వరకు విస్తరించిన సాంకేతికతపై అవగాహన కల్పిస్తూ.. మచిలీపట్నంలోని ప్రతిష్ఠా త్మక యలమంచిలి జనార్ధనరావు - దైతా మధుసూదన శాస్త్రి (YJRDMS) ఇంజినీ రింగ్ కళాశాల 4-సంవత్సరాల B.Tech-ECE ప్రోగ్రామ్ ద్వారా యువతకు అద్భుతమైన కెరీర్ అవకాశాలను అందిస్తోంది.

**ECE అంటే ఏమిటి?** ఎలక్ట్రానిక్స్ + కమ్యూనికేషన్ = కెరీర్ సూపర్ హైవేECE అంటే కేవలం సర్క్యూట్లు మాత్రమే కాదు. ఎనలాగ్-డిజిటల్ ఎలక్ట్రానిక్స్, సిగ్నల్ ప్రాసెసింగ్, ఎంబెడెడ్ సిస్టమ్స్, వీఎల్ఎస్ఐ (VLSI) డిజైన్, కమ్యూనికేషన్ సిస్టమ్స్, IoT, రోబోటిక్స్, మైక్రోవేవ్ ఇంజినీరింగ్ వంటి అత్యాధునిక పాఠ్యాంశాల సమాహారం.

**ECE ప్రాముఖ్యత – ముఖ్యాంశాలు కమ్యూనికేషన్ విప్లవం:** 5G, 6G మరియు శాటిలైట్ ఇంటర్నెట్ (స్టార్‌లింక్) ద్వారా మారుమూల ప్రాంతాలకు కూడా హై-స్పీడ్ నెట్‌వర్క్‌ను చేరువ చేయడంలో ECE ఇంజనీర్లే కీలకం.సెమీకండక్టర్ హబ్: భారతదేశం గ్లోబల్ చిప్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారుతున్న తరుణంలో, వీఎల్ఎస్ఐ డిజైన్ మరియు చిప్ తయారీలో విపరీతమైన అవకాశాలు ఉన్నాయి.హార్డ్‌వేర్ & సాఫ్ట్‌వేర్ సమన్వయం: CS కేవలం సాఫ్ట్‌వేర్‌పై దృష్టి పెడితే, ECE విద్యార్థులు హార్డ్‌వేర్ మరియు సాఫ్ట్‌వేర్ రెండింటిపై పట్టు సాధిస్తారు.ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (IoT): చేతి గడియారాలు, గృహోపకరణాలు, కార్లను ఇంటర్నెట్‌తో అనుసంధానించే స్మార్ట్ పరికరాల రూప కల్పన. ఎలక్ట్రిక్ వాహనాలు (EVs): వీల్స్‌పై నడిచే కంప్యూటర్లలాంటి EVలలో బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ (BMS), పవర్ ఎలక్ట్రానిక్స్‌ను డిజైన్ చేయడం.వైద్య & రక్షణ రంగం: MRI మిషన్లు, రోబోటిక్ సర్జరీ పరికరాల నుండి ISRO/DRDO ఉపయోగించే రాడార్లు, క్షిపణి వ్యవస్థల వరకు ECEనే మూలాధారం.



డా.బి.నాగ జ్యోతి M.S., M.Tech., Ph.D.వైస్ ప్రిన్సిపాల్ మరియు ECE విభాగాధిపతి (30 ఏళ్ల బోధనా అనుభవం మరియు ISRO ఆటోమాటిక్ వెదర్ స్టేషన్లు, MBLM వంటి 5 జాతీయ ప్రాజెక్టుల ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్)

**ఉద్యోగ అవకాశాలు & వేతనాలు** ECE పూర్తి చేసిన విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేట్, కోర్ మరియు సాఫ్ట్‌వేర్ రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయి.ప్రముఖ సంస్థలు / అవకాశాలు - ప్రభుత్వ రంగం (PSUs) ISRO, DRDO, BARC, BEL, ECIL, BSNL, భారతీయ రైల్వేలు,కోర్ & టెలికాం, MNCలు - Qualcomm, Texas Instruments, Intel, Samsung, Broadcom, Nokia, Ciscoసాఫ్ట్‌వేర్ & IT - Google, Microsoft, Amazon, TCS, Infosys, Wipro, Bosch, Continental...

**డిమాండ్ ఉన్న పోస్టులు** VLSI డిజైన్ ఇంజనీర్, ఎంబెడెడ్ / ఫర్మ్‌వేర్ ఇంజనీర్, PCB డిజైనర్, RF ఇంజనీర్, IoT & AI ఇంజనీర్.. వేతన వివరాలు :ఫ్రెషర్ స్థాయి: ప్రారంభ వేతనం సగటున ₹4 లక్షల నుంచి ₹10 లక్షలు పరానమ్.అనుభవజ్ఞులకు: సెమీకండక్టర్ డిజైన్, VLSI, ఎంబెడెడ్ రంగాల్లో ₹15 లక్షల నుంచి ₹30+ లక్షల వరకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు లభిస్తాయి.

**వై.జే.ఆర్.డి.ఎమ్.ఎస్. కాలేజ్ ECE విభాగం ప్రత్యేకతలు అడ్వాన్స్‌డ్ ల్యాబ్‌లు:** VLSI, ఎంబెడెడ్ సిస్టమ్స్, IoT & సెన్సార్ ల్యాబ్, మైక్రోవేవ్ & కమ్యూనికేషన్ ల్యాబ్‌లు.ఇండస్ట్రీ టూల్స్ శిక్షణ: MAT-LAB, Cadence Virtuoso, Xilinx ISE, Keil, Arduino IDE, Python for IoT.పరిశ్రమల సందర్శన: Bharat Electronics (BEL), టెలికాం సైట్లు, సోలార్ ప్రాజెక్ట్‌లు మరియు ఇంటర్న్‌షిప్‌లు. పూర్వ విద్యార్థుల ఘనత: ISRO, AMD, Intel, Google వంటి దిగ్గజ సంస్థల్లో కీలక హోదాల్లో స్థిరపడిన విద్యార్థులు. (ఉదాహరణకు: 1986-90 ECE విద్యార్థి Dr. సి.హెచ్. విశ్వనాధం ప్రస్తుతం BEL హైదరాబాద్ EWLS SBU యూనిట్ జనరల్ మేనేజర్‌గా ఉన్నారు). విభాగాధిపతి (HOD) మాట "ECE అనేది కేవలం ఒక బ్రాంచ్ కాదు – ఇది డిజిటల్ యుగానికి వెన్నెముక.""సాఫ్ట్‌వేర్ రంగానికి AI వల్ల ఎన్ని మార్పులు వచ్చినా, ఆ సాఫ్ట్‌వేర్ రన్ అవ్వడానికి కావాల్సిన భౌతిక హార్డ్‌వేర్, సెన్సార్లు, నెట్‌వర్క్‌లను సృష్టించేది ECE ఇంజనీర్లే. మా కళాశాలలో విద్యార్థులకు బలమైన ఫండమెంటల్స్, ప్రయోగాత్మక ప్రాజెక్టులు మరియు ప్లేస్‌మెంట్ స్కిల్స్ అందించి, గ్లోబల్ ఇంజనీర్లుగా తీర్చిదిద్దుతున్నాం."— డా. బి. నాగ జ్యోతి M.S., M.Tech., Ph.D.వైస్ ప్రిన్సిపాల్ మరియు ECE విభాగాధిపతి (30 ఏళ్ల బోధనా అనుభవం మరియు ISRO ఆటోమాటిక్ వెదర్ స్టేషన్లు, MBLM వంటి 5 జాతీయ ప్రాజెక్టుల ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్) సాంకేతికతతో కూడిన భవిష్యత్తును నిర్మించాలనుకునే విద్యార్థులకు ECE ఒక అద్భుతమైన మార్గం. వై. జె.ఆర్.డి.ఎమ్.ఎస్. కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, మచిలీపట్నం ECE విభాగం విద్యార్థులను భావి భారత సాంకేతిక నేతలుగా తీర్చిదిద్దడానికి నిరంతరం కృషి చేస్తోంది

## రైతు బజార్ లో మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వం లక్ష్యం

### అకస్మాత్తుగా రైతు బజార్‌ను తనిఖీ చేసిన మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచే నాని



మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలోని స్వర్ణ వార్డు 45 రైతు బజార్‌ను శనివారం మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచే నాని అకస్మికంగా తనిఖీ చేశారు. రైతు బజార్‌లోని ప్రతి షాపుకు సంబంధించిన పత్రాలను క్షుణ్ణంగా వెరిఫై చేసిన ఆయన, వినియోగదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు:ప్రజా సంక్షేమమే ధ్యేయం:నాణ్యమైన ఉత్పత్తులు: వినియోగదారులకు నాణ్యమైన, తాజా ఉత్పత్తులను సరసమైన ధరలకు అందించడమే రైతు బజార్ల ముఖ్య ఉద్దేశం.రైతులకు ప్రోత్సాహం: రైతు బజార్ల ద్వారా రైతుల ఆదాయం పెరగడమే కాకుండా, ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తోంది.పారదర్శకమైన ధరలు: ధరలు పారదర్శకంగా ఉండటం వల్ల కొనుగోలుదారులకు రైతు బజార్లపై పూర్తి నమ్మకం కలుగుతుంది. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించడంలో రైతు బజార్లు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి."ఎవరైనా ఇష్టారా జ్యంగా అధిక రేట్లకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు!".అధికారులకు కఠిన ఆదేశాలు:రైతు బజార్ ప్రాంగణంలో ప్రతినిత్యం పారిశుద్ధ్యాన్ని పరిశుభ్రంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వినియోగదారుల నుంచి ధరలపై ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. మంత్రి కొల్లు రవీంద్ర సారధ్యంలో మచిలీపట్నం రైతు బజార్‌ను మోడల్‌గా మరింత తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు.కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు:ఈ తనిఖీ కార్యక్రమంలో:పి. వి. ఫణి కుమార్ (బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, 45వ డివిజన్ TDP ఇన్‌చార్జ్)పడమట నాగరాజు (50వ డివిజన్ TDP ఇన్‌చార్జ్)పుప్పాల ప్రసాద్ (మచిలీపట్నం కార్పొరేషన్ లీగల్ అడ్వైజర్)బలి చక్రవర్తి (రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్) మరియు ఇతర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల జీవితాలతో బిజెపి ప్రభుత్వం చెలగాటం

### నీట్ అభ్యర్థులపై పోలీసుల దాడికి నిరసనగా కాంగ్రెస్ పార్టీ భారీ ర్యాలీ

### కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిసిసి డిమాండ్

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

ఏఐసీసీ పిలుపు, పిసిసి ఆదేశాల మేరకు కృష్ణాజిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీ ఆధ్వర్యంలో మచిలీపట్నంలోని పట్టాభి భవన్ వద్ద శనివారం తీవ్ర నిరసన వ్యక్తమైంది. జిల్లా అధ్యక్షుడు అందే శ్రీరామ్ మూర్తి నేతృత్వంలో పట్టాభి భవన్ నుంచి కోనేరు సెంటర్ వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ బహిరంగ ర్యాలీ నిర్వహించారు.ఈ నెల 22న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 'నీట్' (NEET) పరీక్ష పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా వచ్చిన విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు చేపట్టిన శాంతియుత నిరసనపై పోలీసులు జరిపిన దాడిని నాయకులు తీవ్రంగా ఖండించారు.ముఖ్య నేతల ధ్వజమెత్తు:విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలు: ర్యాలీ అనంతరం డిసిసి అధ్యక్షుడు అందే శ్రీరామ్ మూర్తి మాట్లాడుతూ... కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటోందని మండిపడ్డారు. పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.అరెస్టులు, దాడులు హేయమైన చర్య: ఐ ఎన్ టి యు సి వర్కింగ్ ప్రెసిడెంట్, గుడివాడ కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ రాజశేఖర్ మాట్లాడుతూ... శాంతియుతంగా ధర్నా చేపట్టిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడం, ఇతర నాయకులపై పోలీసులు పైశాచికంగా ప్రవర్తించడం హేయమైన చర్య అని ధ్వజమెత్తారు. యూనిఫామ్ లేకుండా విద్యార్థులపై దాడులకు పాల్పడిన బిజెపి, ఆర్ఎస్ఎస్ గుండాలపై వెంటనే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.కొత్త బాధ్యతల నియామక పత్రాల అందజేత:ర్యాలీ అనంతరం పట్టాభి భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కృష్ణాజిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ వింగ్ చైర్మన్‌గా సయ్యద్ నూరుద్దీన్, వైస్ ప్రెసిడెంట్‌గా గౌస్ ల నియామక పత్రాలను జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ మూర్తి అందజేశారు.ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి రాష్ట్ర నాయకులు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, వివిధ మండలాల అధ్యక్షులు, జిల్లా మైనారిటీ, ఎస్సీ సెల్ నాయకులు, పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.





## బాలకృష్ణ త్వరగా కోలుకోవాలని పెదప్రోలులో నాగ మల్లేశ్వర స్వామి వారికి అభిమానుల పూజలు



ప్రజా భూమి ప్రతినిధి / అవనిగడ్డ

ఆంధ్రుల అభిమాన నటుడు.. హిందూ పురం శాసనసభ్యులు, పద్మభూషణ్ నంద మూరి బాలకృష్ణ త్వరగా కోలు కోవాలి అంటూ మోపిదేవి మండలం లోని పెదప్రోలు గ్రామానికి చెందిన బాలకృష్ణ అభిమానులు శ్రీ దుర్గా సమేత నాగమల్లేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు శనివారం ఉదయం గ్రామంలోని నాగమల్లేశ్వర స్వామి వారి కి బాలకృష్ణ పేరున ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడులు చెల్లించారు. బాలకృష్ణ త్వరగా కోలుకొని యధావిధిగా అభిమానులకు సందడి చేయాలని వారు ఆకాంక్షించారు కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, అవనిగడ్డ నియోజకవర్గం తెలుగు మహిళ కార్యదర్శి మోర్ల జయ లక్ష్మి, బాలకృష్ణ అభిమానులు మోర్ల చిదంబరం , వాకా స్వామి మోర్ల శ్రీనివాసరావు ,మోర్ల రమేష్, ఆదినారాయణ, రోషన్ బాబు, బబ్లూ, పాండు, అర్జున్ రావు జయశంకర్, రామమూర్తి, వీర రాఘవులు, మోర్ల బాలకృష్ణ, మార్ల గణేష్, కొండేటి వెంకటేశ్వరరావు, బొర్రా నాగరాజు తదితరులు పూజలు నిర్వహించారు.

## టిడిపి ఇన్చార్జిగా విక్కుర్తి నియమకంపై టిడిపి శ్రేణుల హర్షం



ప్రజాభూమి ప్రతినిధి / అవనిగడ్డ

తెలుగుదేశం పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ ఇన్చార్జిగా, ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాసరావును జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రకటించడం పై మండల తెలుగుదేశం పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మాజీ ఎంపీటీసీ బడే వీరబాబు, మాజీ తెలుగు యువత మండల అధ్యక్షులు బడే గాంధీ ఆధ్వర్యంలో కోడూరు ప్రధాన సెంటర్లో భారీ బాణాసంచగకాల్చి ప్రజలకు స్వీట్లు పెంచారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు పెద్ది భాస్కరరావు, మాచర్ల భీమయ్య, సుంకర లక్ష్మి, తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యనిర్వాహక మాజీ కార్యదర్శి పరిసే నాగమల్లేశ్వరరావు, నాగం బాపయ్య తో పాటు పెద్ద సంఖ్యలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## లేడీ యాంప్తుల్ కళాశాల భోజనశాలకు ₹3 లక్షల విరాళం

### బండి రామకృష్ణ ఉదారత

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

కృష్ణా జిల్లాలోనే ఏకైక ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల అయిన 'లేడీ యాంప్తుల్ బాలికల జూనియర్ కళాశాల' విద్యార్థినుల కష్టాలు త్వరలోనే తీరనున్నాయి. కళాశాలలో శాశ్వత భోజనశాల (డైనింగ్ హాల్) నిర్మాణ నిమిత్తం కృష్ణా జిల్లా డీసీఎంఎస్ చైర్మన్, మచిలీపట్నం జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండి రామకృష్ణ స్పందించారు. డీసీఎంఎస్ నిధులతో పాటు తన సొంత నిధులను కలిపి రూ. 3 లక్షలు మంజూరు చేశారు. శనివారం కూటమి నాయకులు, అధికారులతో కలిసి ఆయన ఈ భోజనశాల నిర్మాణ పనులకు వైభవంగా శంకుస్థాపన చేశారు.సమస్యపై తక్షణ స్పందన.. శంకుస్థాపన!ఇన్నాళ్లూ కళాశాలలో సరైన భోజనశాల లేకపోవడంతో విద్యార్థినులు, సిబ్బంది తీవ్ర ఎండలోనే వంటలు చేసుకుంటూ, భోజనాలు చేస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల జరిగిన పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌లో రాష్ట్ర టీడీపీ నాయకులు కొనకళ్ల బుల్లయ్య ఈ సమస్యను బండి రామకృష్ణ దృష్టికి తీసుకురాగా.. ఆయన తక్షణమే స్పందించి నిధులు కేటాయించారు."సాధ్యమైనంత త్వరగా భోజనశాల నిర్మాణాన్ని పూర్తి చేసి, విద్యార్థినులకు అందుబా టులోకి తీసుకువస్తాం.అని బండి రామకృష్ణ, డీసీఎంఎస్ చైర్మన్ అన్నారు. మరిన్ని మౌలిక వసతులకు హామీఈ సందర్భంగా బండి రామకృష్ణ మాట్లాడుతూ:అగ్రస్థానంలో కళాశాల: జిల్లాలోనే లేడీ యాంప్తుల్ కళాశాల విద్యా ప్రమాణాల్లో అగ్రగామిగా నిలవడం అభినందనీయం. అదనపు తరగతి గదులు: పెరిగిన విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా అదనపు తరగతి గదుల అవసరం ఉంది.ప్రత్యేక నిధులు: ప్రభుత్వం నుంచి మరియు ఎంపీ ఫండ్స్ నుంచి ప్రత్యేక నిధులు రప్పించి కళాశాల అభివృద్ధికి కృషి చేస్తాం.కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులుఈ శంకుస్థాపన మహోత్సవంలో పలువురు కూటమి నాయకులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు:కూటమి నాయకులు: గొర్రెపాటి గోపీచంద్, కొనకళ్ల బుల్లయ్య (టీడీపీ సీనియర్ నాయకులు), కొట్టే వెంకట్రావు, గడ్డం రాజు, శివయ్య, పినిశెట్టి వేణు, కొండ మేస్త్రి, చంటి, చిరంజీవి, రమేష్, గంపల కృష్ణ, గంపల గంగాభవాని (జనసేన నాయకులు).అధికారులు & అధ్యాపకులు: ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా అధికారి సరళ కుమారి, కళాశాల ప్రిన్సిపాల్ పి. లక్ష్మి, ఎన్ఎస్ఎస్ అధికారి లంకిశెట్టి హరనాథ్ బాబు తదితరులు పాల్గొన్నారు.



## విద్యే అభివృద్ధికి పునాది..చదువును మళ్లీ కొనసాగిద్దాం... బంగారు భవితను నిర్మించుకుందాం

### ఆంధ్రప్రదేశ్ సారస్వతిక విద్యాపీఠం ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా సమన్వయంతో పనిచేయాలి : డీఆర్వో



మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ సారస్వతిక విద్యాపీఠం (దూర విద్యా విధానం) ద్వారా 2026–27 విద్యా సంవత్సరానికి నిర్వహిస్తున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాల్లో కృష్ణా జిల్లాను రాష్ట్రంలోనే అత్యధిక నమోదు సాధించిన జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్‌లోని డీఆర్వో ఛాంబర్ లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో విద్యాభ్యాసానికి దూరమైన విద్యార్థులను గుర్తించి తిరిగి విద్యా ప్రవా హంలోకి తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు, ఐసీడీఎస్ లబ్ధిదారులు, స్వయం సహాయక సంఘాల సభ్యుల కుటుంబాల్లోని పాఠశాల మానేసిన విద్యార్థులను గుర్తించి, వారికి ఆంధ్రప్రదేశ్ సారస్వతిక విద్యాపీఠంలో ప్రవేశాలు కల్పించేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, పంచా యతీ కార్యదర్శులు, మహి ళా పోలీసు సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్ వాడీ కార్యకర్తలు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, స్వయం సహాయక సంఘాల కమ్యూనిటీ రిసో ర్స్ పర్సన్లు తదితర గ్రామ స్థాయి సిబ్బంది సమి ష్టిగా పనిచేసి అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించి ప్రవేశాలు కల్పించేందుకు కృషి చేయాలని డీఆర్వో ఆదేశించారు.సమగ్ర శిక్ష అభియాన్, జిల్లా విద్యాశాఖ గ్రామాల వారీగా పాఠశాల మా నేసిన విద్యార్థుల జాబితాలను సిద్ధం చేసి సంబం ధిత శాఖలకు అందజేయాలని సూచిం చారు. ఆ జాబి తాల ఆధారంగా క్షేత్రస్థాయిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ప్రతి అర్హుడికి ప్రవేశం కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథ కా ల లబ్ధిదారుల కుటుంబాల్లో విద్యను మధ్యలో నిలిపివేసిన వారు ఎవరూ మిగలకుండా గుర్తించి, వారికి తిరిగి విద్యను కొనసాగించే అవకాశం కల్పించడం ద్వారా అక్షరాస్యతను పెంపొందించడంతో పాటు వారి వ్యక్తిగత, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని డీఆర్వో పేర్కొ న్నారు. ఎవరికైనా సందేహాలున్నయెడల ఓపెన్ స్కూల్స్ హెల్ప్-లైన్ నెం.8008403506 సంప్ర దించవలసినదిగా కోరారు.ఆంధ్రప్రదేశ్ సార్వత్రి క విద్యాపీఠం, గుంటూరు వారి ద్వారా నడుపబడుచున్న పదవతరగతి, ఇంటర్మీడియట్ తరగతులలో 2026-27 విద్యా సంవత్సరములో ప్రవేశాల కు సంబందించిన గోడ పత్రికలను, కరపత్రికలను డీఆర్వో ఆవిష్కరించారు.ఈ సమావే శంలో జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష అభియాన్, డ్వామా, ఐసీడీఎస్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ శాఖతో పాటు ఇతర అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### తొలి ఏకాదశి వేళ చిన్న వెంకన్న సన్నిధిలో

## గడ్డమణుగు, కరాటం సాయి ప్రత్యేక పూజలు



**ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి**

తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ ద్వారకాతిరుమల చిన్న వెంకన్న స్వామివారిని జనసేన జిల్లా కార్యదర్శి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, శ్రీ ద్వారకాతిరుమల దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితుడు గడ్డమణుగు రవికుమార్, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి తమ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకుని ఆశీర్వాదాలు పొందారు. అనంతరం వారు మాట్లాడుతూ, తొలి ఏకాదశి రోజున వేలాది మంది భక్తులతో కలిసి చిన్న వెంకన్నను దర్శించుకోవడం జీవితంలో మరపురాని ఆధ్యాత్మిక అనుభూతిగా నిలిచిందన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, పోలవరం నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, రైతులకు సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని, యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా లభించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఏకాదశి పర్వదినం సందర్భంగా సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించు కున్నారని, భక్తుల రద్దీకి అనుగుణంగా దేవస్థానం తగిన ఏర్పాట్లు చేశారని చెప్పారు.

## చింతలపూడిలో బస్సు టైమింగ్ బోర్డులు లేక ఇబ్బందులు.

-ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారా అంటున్న ప్రయాణికులు.





**ప్రజా భూమి ప్రతినిధి-చింతలపూడి.**

ఏలూరు జిల్లా చింతలపూడిలో బస్సు టైమింగ్ బోర్డులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సు ఏ సమయంలో వస్తుందో తెలియక విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు గంటల తరబడి బస్ స్టాప్‌ల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో మాదిరిగా పాత బస్ స్టాండ్, జీబీజీ రోడ్ బస్ స్టాప్, ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఉన్న బస్ స్టాప్, ఫైర్ స్టేషన్ సెంటర్ సమీప బస్ స్టాప్ వంటి ప్రధాన ప్రాంతాల్లో బస్సుల రాకపోకల సమయాలను తెలిపే టైమింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రస్తుతం బస్సు టైమింగ్ తెలుసుకోవాలంటే కొత్త బస్ స్టాండ్‌కు వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన టైమ్ షీట్‌ను చూసి తెలుసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీంతో ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ప్రధాన బస్ స్టాప్‌ల వద్ద బస్సు టైమింగ్ బోర్డులు ఏర్పాటు చేసి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని వారు అధికారులను కోరుతున్నారు.

## ఎన్‌క్యూఏఎస్ తనిఖీలకు ముస్తాబవుతున్న ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పెద్ద ఐరన్ రూఫ్ ఏర్పాటు.. వైద్య సేవల మెరుగుదలతో సుందరీకరణ పనులు వేగవంతం

డాక్టర్ టీనా, డాక్టర్ మహిత



**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**

ఈ నెల 29న జరగనున్న ఎన్‌క్యూఏఎస్ (జాతీ య నాణ్యత హామీ ప్రమాణాల) తనిఖీలను దృష్టిలో ఉంచుకుని ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అభివృద్ధి, సుందరీకరణ పనులను విస్తృతంగా చేపట్టినట్లు వైద్యులు డాక్టర్ టీనా, డాక్టర్ మహిత తెలిపారు. ఆసుపత్రి భవనం మధ్య భాగంలో రోగులు, వారి సహాయకులు ఎండ, వర్షాలకు ఇబ్బంది పడకుండా ఉండేందుకు పెద్ద ఐరన్ రేకులతో విశాలమైన రూఫ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే ప్రయోగశాల బలోపేతం, థియేటర్ గదుల అభివృద్ధి, వార్డులు, ఇంజెక్షన్ గది, ఓపీ, ఐపీ విభాగాల మెరుగుదల, క్లినికల్, శస్త్రచికిత్స సేవల విస్తరణ, ఆసుపత్రి ప్రాంగణ పరిశుభ్రత, సమావేశ మందిరం మరమ్మతులు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ యూనిట్ల ఏర్పాటు, కార్యాలయం, ఫార్మసీ బలోపేతం, అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు, ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సేవలు, మందుల జాబితా, ఆర్‌టీఐ నోడల్ వివరాలు, ఫిర్యా దు పెట్టె తదితర సమాచారాన్ని స్పష్టంగా ప్రదర్శించే ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. నాణ్య మైన వైద్య సేవలు అందించి ఎన్‌క్యూఏఎస్ ప్రమాణాలను సాధించడమే లక్ష్యంగా అన్ని విభాగా ల్లో అవసరమైన మార్పులు చేపడుతున్నామని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో ఆసుపత్రి సిబ్బంది, మధ్యస్థాయి వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు చురుకుగా పాల్గొన్నారు.



# ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)- 2026 విజయవంతం

- గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు సహకారం అభినందనీయం.
- భవిష్యత్తులో ఇదే సహకారం అందించి, ఏలూరు జిల్లాను ఆదర్శంగా నిలుపుదాము.
- జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి



**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా**

ఏలూరు జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో శనివారం ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)- 2026 విజయవంతం-రాజకీయ పార్టీలు సహకారం అభినందనీయం, భవిష్యత్తులో కూడా వివిధ రాజకీయ పార్టీలు ప్రతినిధులు ఇదే సహకారం అందించాలని కోరారు. మిగతా ప్రక్రియపై గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీలు ప్రతినిధులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీలు ప్రతినిధులు లేవనెత్తిన అంశాలుపై జిల్లా కలెక్టరు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ భారత ఎన్నికలు సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)-2026 కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించి, రాష్ట్రంలో ముందు వరసలో నిలిచామని, వివిధ రాజకీయ పార్టీలు ప్రతినిధులు సహకారం అభినందనీయం అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో రాజకీయ పార్టీలు, ఎన్నికలు యంత్రాంగం పరస్పర సమన్వయంతో పనిచేయడం ఎంతో అవసరమని అన్నారు. జూన్ 15 నుంచి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) ఇంటింటి సర్వేని విజయవంతంగా నిర్వహించి, ఏలూరు జిల్లాలో ప్రత్యేక విస్తృత పునశ్చరణ (ఎస్ ఐ ఆర్)-2026 సంతృప్తికరంగా జరిగి, మొదటి స్థానంలో నిలిచామన్నారు. జిల్లాలో 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో మేల్ ఓటర్లు 8,01,955, ఫిమేల్ ఓటర్లు 8,42,110, థర్డ్ జెండర్ 128,మొత్తం 16,44,193 మంది ఓటర్లు అని అన్నారు. ఏలూరు జిల్లాలో 1,744 పోలింగు స్టేషన్లు ఉన్నాయన్నారు. నియోజకవర్గాలు వారీగా నం.63 ఉంగుటూరు 2,07,346, నం.64. దెందులూరు 2,25, 615, నం.65 ఏలూరు 2,34,948, నం. 67 పోలవరం 2,55,122, నం.68 చింతలపూడి 2,74,003, నం. 70 నూజివీడు 2,40,581, నం.73 కైకలూరు 2,06,578 తెలిపారు. ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ ఐ ఆర్) సవరించిన షెడ్యూల్ నువివరించారు. 15.06.2026 నుండి 24.07.2026 వరకు బిఎల్వోలు ఇంటింటి వెళ్ళే కార్యక్రమాలు విజయవంతంగా జరిగిందని తెలిపారు. 24.07. 2026 నాటికి పోలింగు కేంద్రాలు హేతుబద్ధీకరణ పూర్తిచేసు కున్నామని, 31.07. 2026 నాటికి ముసాయిదా ఎన్నికల ప్రచురణ అని తెలిపారు. 31.07. 2026 నుండి 30.08. 2026 వరకు క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాలు దాఖలు చేసే కాల వ్యవధి ఉన్నదని, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు పరిశీలన చేసుకోవాలని అన్నారు. 31.07.2026 నుండి 28.09.2026 వరకు నోటీసు దశ/క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాలు, పరిష్కారాలు ఉంటాయని,03.10.2026 తుది ఓటర్ల జాబితా ప్రచురణ అని జిల్లా కలెక్టరు తెలిపారు. ఈ సమావేశంలో ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి యల్.దేవకీదేవి, ఎలక్షన్ కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపర్డెంటు వై.వి. లక్ష్మీకుమారి, వివిధ రాజకీయ పార్టీలు ప్రతినిధులు ఆర్.రామ మోహన్ రావు ఐయన్‌సి, వి.స్టాన్లీబాబు, ఎల్.వి. సుభాష్ వైఎస్ఆర్సిపి, యం.వెంకట నాగరాజు జనసేన, ఏ.రతన్ కాంత్ బిఎస్పీ, యస్. అచ్యుత బాబు టిడిపి, కె.శ్రీనివాసు, డి.యన్.వి.డి. ప్రసాదు, సిపిఐ(యం), నెరుసు నెలరాజ బిజెపి, తదితర ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఫోన్‌పే పొరపాటు లావాదేవీ ఏలూరు సైబర్ పోలీసుల చొరవతో

## రూ.48,000 బాధితునికి అందచేసిన ఏలూరు సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ దాసు

**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా**

ఫోన్‌పే ద్వారా పొరపాటున వేరేవారి ఖాతాలోకి బదిలీ అయిన డబ్బులను ఏలూరు సైబర్ క్రైమ్ పోలీసులు అధునాతన సాంకేతికతను ఉపయోగించి విజయవంతంగా రాబట్టారు. బాధితునికి ఆ డబ్బును స్వయంగా అంద చేసిన ఏలూరు జిల్లా సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ దాసు.





**సంఘటన వివరాలు**

ఏలూరు రూరల్ పరిధిలోని చింతపర్రు రోడ్డు, బాలాజీ నగర్‌కు చెందిన తంగ్రాని రాజేష్ తండ్రి రంగనాయకులు తాను పంపవలసిన డబ్బులను పొరపాటున మరొకరి ఖాతాకు రూ. 48,000/- ఆన్‌లైన్‌లో బదిలీ చేశారు. తాము మోసపోయామని, డబ్బులు పొరపాటున వేరేవారికి వెళ్లాయని గుర్తించిన బాధితుడు వెంటనే అప్రమత్తమై జాతీయ సైబర్ పోర్టల్ సైబర్ క్రైమ్. గో.ఇన్.లో ఫిర్యాదు నమోదు చేశారు. బాధితుడి ఫిర్యాదును సీరియస్‌గా తీసుకున్న ఏలూరు సైబర్ సెల్ సీఐ జి. దాసు, వారి సిబ్బంది వెంటనే రంగంలోకి దిగారు. టెక్నాలజీని ఉపయోగించి లావాదేవీలను నిశితంగా పరిశీలించి, సాంకేతిక పరిజ్ఞానంతో ఆ డబ్బును ఫ్రీజ్ చేయించి బాధితుడికి రావాల్సిన రూ. 48,000 నగదును పూర్తిగా రాబట్టారు. రికవరీ చేసిన ఆ మొత్తాన్ని సైబర్ సెల్ సీఐ జి. దాసు, సిబ్బంది స్వయంగా బాధితుడు తంగ్రాని రాజేష్‌కు అంద చేసినారు. పొరపాటున డబ్బులు పోగొట్టుకుని దిక్కుతోచని స్థితిలో ఉన్న తమకు క్షణాల వ్యవధిలో సాంకేతికతను ఉపయోగించి న్యాయం చేసిన సైబర్ సెల్ సీఐ జి. దాసుకి మరియు వారి సిబ్బందికి బాధితుడు రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఆన్‌లైన్ లేదా ఫోన్‌పే లావాదేవీల్లో పొరపాట్లు జరిగినప్పుడు వెంటనే 1930 నంబర్‌కు లేదా సైబర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే తక్షణ స్పందన లభిస్తుందని ఏలూరు జిల్లా సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ దాసు ఈ సందర్భంగా సూచించారు.

## తొలి ఏకాదశి వేళ భక్తిరసంలో మునిగిన ఆగిరిపల్లి

శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామికి వైభవంగా విశేష పూజలు



**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**


తొలి ఏకాదశి పర్వదినాన్ని ఆగిరిపల్లి మండల ప్రజలు శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భక్తులు తెల్లవారుజామునే తలస్నానం ఆచరించి సమీప దేవాలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి దేవతలను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామివారికి అత్యంత వైభవంగా విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదాంతం శేషుబాబు, అనంతకృష్ణ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, విశేష అర్చన, నవకలశ పంచామృత సహిత ఫలరస స్నపన, విశేష అలంకరణ, సహస్రనామార్చన, నారసింహ మూలమంత్ర హోమం, పూర్ణాహుతి, నీరాజనం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలు కార్యనిర్వాహణాధికారి పర్యవేక్షణలో నిర్వహించబడినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి సి.హెచ్. సాయి తెలిపారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆలయ ప్రాంగణం గోవిందనామస్మరణలు, వేదమంత్రోచ్చారణలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకోగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలు పొందారు.

# పోలవరం జనసేనలో అనేక మలుపులు

### ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు భేటీ

**ప్రజాభూమి ప్రతినిధి-జీలుగుమిల్లి**

పోలవరం నియోజకవర్గంలో గత కొంత కాలం నుండి అనేక సమస్యలు చుట్టుముట్టుతున్న నేపథ్యంలో పోలవరం శాసనసభ్యులు ఒక అడుగు ముందుకు వేసి నేరుగా చంద్రబాబుతో మంతనాలు జరపడం అభివృద్ధికి నిధులు కేటాయించమని అడగడం ఏ వైపుకు దారితీస్తుంది వేచి చూడాలి. తన అనుచర గణంతో ఇప్పటికే ఏడు మండలాలలో అనేక కమిటీలు వేసి తన ఇమేజ్కి డామేజ్ లేకుండా చర్యలు చేపట్టారు. ఈ రోజు ఉదయం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాసంలో పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పోలవరం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా పోలవరం నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని, పునరావాసం మరియు పునరుద్ధరణ కార్యక్రమాలను వేగవంతం చేయాలని కోరారు. అదేవిధంగా, నియోజకవర్గంలోని దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టడంతో పాటు కొత్త రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాన రహదారులు, గ్రామీణ ప్రాంతాలను అనుసంధానించే లింక్ రోడ్ల అభివృద్ధికి తక్షణమే పరిపాలనా అనుమతులు, నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. పోలవరం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అవసరమైన సహకారం అందించాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అభ్యర్థించారు.



# రొయ్యల్లో శాస్త్రీయ పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు

**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.**

రొయ్యల రైతులు శాస్త్రీయ పద్ధతులను అవలంబించడం ద్వారా అధిక దిగుబడులతో పాటు నాణ్యమైన ఉత్పత్తిని సాధించవచ్చని ఉండి ఫిషరీస్ రీసెర్చ్ స్టేషన్ ప్రిన్సిపల్ సైంటిస్ట్, హెడ్ ఏ.చంద్రశేఖర్ తెలిపారు. రాష్ట్ర మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థ (సిఫ్ట్) కాకినాడ ప్రిన్సిపాల్ డా. ఎస్. అంజలి ఆదేశాల మేరకు మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏలూరులోని ఆక్వాల్యాబ్‌లో శనివారం రొయ్యల సాగులో ఆరోగ్య నిర్వహణ అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఏలూరు జిల్లా మత్స్యశాఖ అధికారి జి.వి.ఎం.పి ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏ.చంద్ర శేఖర్ మాట్లాడుతూ... రొయ్యల సాగులో నీటి నాణ్యత నిర్వహణ, నీటి పారామీటర్ల ప్రాధాన్యతపై సాంకేతిక వివరాలను వివరించారు. రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ డా. రామ్మోహన్ రావు మాట్లాడుతూ..వివిధ కాలాల్లో రొయ్యలకు వచ్చే వ్యాధులు, వాటి నివారణ చర్యలు, సమయానుకూల నిర్వహణపై రైతులకు సూచనలు చేశారు. భీమవరం ఆక్వాజెనిక్స్‌ప్రో ప్రైవేట్ లిమిటెడ్ ఎస్. గోపీకృష్ణ మాట్లాడుతూ..ఆధునిక సంకేతిక ఆధారిత స్మార్ట్ ఫార్మింగ్ పద్ధతులను వివరించారు. ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, ఎన్.ఎస్.ఎస్. పి.ఏ.ఏ.ప ప్రాజెక్ట్ కో-నోడల్ అధికారిపి దత్తాత్రేయ మాట్లాడుతూ..రొయ్యల సాగులో బయోసెక్యూరిటీ చర్యల ప్రాముఖ్యతను వివరించి, వ్యాధుల నివారణలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. సాంకేతిక సమావేశాల అనంతరం రైతులతో సందేహ నివృత్తి కార్యక్రమం నిర్వహించారు. నిపుణులు రైతుల ప్రశ్నలకు సమగ్ర సమాధానాలు అందించారు. ప్రగతిశీల ఆక్వా రైతు కుమార్ రాజు మాట్లాడుతూ. చెరువుల నిర్వహణలో నాణ్యమైన సీడ్ ఎంపిక, సరైన స్టాకింగ్ విధానాలపై అవగాహన కల్పించారు. అనంతరం పాల్గొన్న రైతులకు రొయ్యల సాగులో ఆరోగ్య యాజమాన్య కరపత్రాన్ని అందజేసి కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమాన్ని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ పి.కిరణ్ కుమార్ సమన్వయం చేయగా, ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పి.దత్తాత్రేయ, సహాయ సమన్వయకర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఏ.డి బి.రాజ్ కుమార్, రామ్మోహనరావు సిఎఫ్ ఏ.డి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు



# వర్షాభావంతో రైతుల అవస్థలు...

### చెరువులు ఖాళీ అవ్వడం వల్ల పశువులకు నీటికీ దూరం.

**ప్రజాభూమి ప్రతినిధి-చింతలపూడి**

చింతలపూడి మండలంలో ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాగు చేసిన పంటలు ఎండిపోతుండగా, పశువులకు పశుగ్రాసం, తాగునీరు లేక దయనీయ పరిస్థితి నెలకొంది. ఇదే సమయంలో చేపల వేట పేరుతో పలు చెరువులను పూర్తిగా ఖాళీ చేయించడంతో పశువులకు తాగడానికి నీరు కూడా లేక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువుల లీజులు ఎవరికిచ్చారు? లీజు ద్వారా వచ్చిన నిధులు ఏమయ్యాయి? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.



# రొయ్యల దాణా ధర పెంచితే రొయ్యల ధర కూడా పెంచాల్సిందే

- 30వ తేదీన పాలకొల్లులో రాష్ట్ర సమావేశం
- ఏపీ రాష్ట్ర ఆక్వా రైతు సంఘం అధ్యక్షుడు గాంధీ భగవాన్ రాజు

ప్రజా భూమి ప్రతినిధి-పాలకొల్లు

రొయ్యల దాణా ధరలు గనుక పెంచితే రొయ్యలకు గిట్టుబాటు ధర కు కొనుగోలు చేయాల్సిందేనని, ఆ మేరకు ప్రభుత్వం కలుగజేసుకుని చర్యలకు ఆదేశించాలని ఏపీ రాష్ట్ర ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు డిమాండ్ చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గాంధీ భగవాన్ రాజు మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి అచ్చం నాయుడు ఫీడ్ కంపెనీ యాజమాన్యాలకు మేత ధరలు పెంచొద్దని ఆదేశించిన ఖాతరు చేయక పోవడం దురదృష్టకరమని ఆయన అన్నారు. యూఎస్, ఈక్విడార్ దేశాల సాకు ను చూపి జూమ్ మీటింగ్లో ఫార్ములా ప్రకారం మేత ధరలు పెంచుతామని చెప్పడం సమంజసం కాదన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో వేల కోట్లు విదేశీ మారకద్రవ్యంకు మూలమైనప్పటికీ ఆక్వా రైతు మాత్రం తీవ్ర నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నారని ఆయన తెలిపారు.రొయ్యలు



కొనుగోలుదరల్లో కిలోకి రూ. 50 నుంచి 60 రూపాయలు వరకు రైతులు నష్టపోతున్నారని, ఒకవేళ మేత ధరలు పెంచిన పక్షంలో ఆ మేరకు నష్ట పోతున్న ధరలకు రొయ్యలను కూడా ధర పెంచి కొనుగోలు చేయాలని గాంధీ భగవాన్ రాజు కోరారు. ఏ దామసాలో మేత రేట్లు పెంచాలనుకున్నారో అదే దామసాలో రైతులు విక్రయించే రొయ్యల ధరలను కూడా పెంచి న్యాయం చేయాలని ఆయన కోరారు. లేదంటే ఈ నెల 30వ తేదీన ఉదయం 10 గంటలకు పాలకొల్లులో రాష్ట్ర ఆక్వా రైతు సంఘం సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక నిర్ణయించుకుంటామని గాంధీ భగవాన్ రాజు తెలిపారు. సమావేశంలో జయభారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు బోనం వెంకట నరసయ్య, సజ్జ వీర వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# క్వాయర్ రంగ పరిశ్రమలను మరింత బలోపేతం చేయాలి

## జిల్లా కలెక్టర్: ఆర్. మహేష్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం

క్వాయర్ రంగ పరిశ్రమలను ప్రోత్సహించి, ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ జిల్లా అధికారులకు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కలెక్టర్ ఛాంబర్ నందు ఉద్యాన శాఖ బ్యాంకర్లతో క్వాయర్ పరిశ్రమల అభివృద్ధి రూపకల్పన మరియు ప్రభుత్వ కొనుగోలు వంటి అంశాల పురోగతిపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కోయిర్ (తేనెపీచు) రంగాన్ని మరింత అభివృద్ధి చేయడానికి, ప్రభుత్వ రంగంలో కోయిర్ ఉత్పత్తుల వినియోగాన్ని పెంచడానికి మరియు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని కలెక్టర్ తెలిపారు. రోడ్లు, ఇరిగేషన్, మరియు ఇంజనీరింగ్ విభాగాలలో ప్లాస్టిక్ లేదా ఇతర పదార్థాలకు బదులుగా పర్యావరణ హితమైన కోయిర్ ఉత్పత్తులను (జియో-టెక్స్టైల్స్ వంటివి) పెద్దఎత్తున ఉపయోగించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఇందుకు సంబంధించి ప్రతి నెలా లేదా త్రైమాసికానికి ఒకసారి అన్ని శాఖలతో సమన్వయ సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. కోయిర్ రంగం యొక్క సమగ్ర అభివృద్ధికి మార్కెటింగ్, టెక్నాలజీ, మరియు పాలసీ/ఇన్ఫ్రాస్ట్రక్చర్ విభాగాలపై ప్రత్యేక నిపుణుల కమిటీలను ఏర్పాటు చేసి, నిరంతర చర్చలు మరియు కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందుబాటులో ఉన్న వివిధ సబ్సిడీ పథకాలను అర్హులైన పారిశ్రామిక వేత్తలకు మరియు మహిళలకు చేరవేయడానికి



ప్రత్యేక కార్యాచరణ రూపొందించబడింది. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు మైక్రో ఎంటర్ప్రెన్యూర్షిప్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ద్వారా ప్రత్యేక శిబిరాలు నిర్వహించి, వారికి బ్యాంకింగ్, జిఎస్టి మరియు మార్కెటింగ్ అంశాలపై అవగాహన కల్పించనున్నారు. అంతర్జాతీయ మార్కెట్లలో మన కోయిర్ ఉత్పత్తులకు ఉన్న డిమాండ్ను దృష్టిలో ఉంచుకొని, ఎగుమతులను పెంచడానికి అవసరమైన సాంకేతికత మరియు నాణ్యతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించబడుతుంది. జిల్లాలో పర్యావరణ పరిరక్షణతో పాటు ఉపాధి కల్పనకు కోయిర్ రంగం ఎంతగానో దోహదపడుతుందని, పారిశ్రామికవేత్తలు మరియు యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలియజేసారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నైడియా దేవి ,ఉద్యాన శాఖ అధికారి బి వి రమణ, లీడ్ బ్యాంకు మేనేజర్ కుమార్ వర్మ, సిడిబి బ్యాంక్ పి.ఓ టీఎస్ రావు, నాబార్డ్ బ్యాంకు ఏజీఎం వైయస్ నాయుడు పాల్గొన్నారు.

### రైతులకు పంటల బీమా సౌకర్యం అందేలా

# క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్


ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం

రైతులకు పంటల బీమా సౌకర్యం అందేలా క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ శనివారం స్థానిక కలెక్టర్ ఛాంబర్ నందు వ్యవసాయ శాఖ,ఉద్యాన శాఖ, సహకార,బ్యాంకర్లతో కలిసి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన , రీస్ట్రక్చర్డ్ వెదర్ బేస్డ్ క్రాప్ ఇన్సూరెన్స్ స్కీమ్ పథకాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పులు, ఎల్నినో వంటి ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో రైతులు పంట నష్టాలతో ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా రక్షించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఖరీఫ్-2026 సీజన్ లో పంటల బీమా నమోదును అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. పంట రుణాలు తీసుకున్న రైతులతో పాటు రుణాలు తీసుకోని రైతులు కూడా బీమా పథకాల్లో నమోదు అయ్యేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. వరి పంటకు ఎకరాకు రూ.76 ప్రీమియంతో రూ.38 వేల బీమా రక్ష- అరటి పంటకు ఎకరాకు రూ.60 వేల బీమా - జూలై 31 వరకు నమోదు అవకాశం ఉందని ఈ సందర్భంగా తెలిపారు. ఎల్నినో ప్రభావం, అధిక వర్షాలు, వర్షాభావం, తుఫానులు, గాలి వానలు వంటి ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులకు నష్టం కలిగే అవకాశాలు ఉన్నందున



పంటల బీమా రైతులకు అత్యంత కీలకమైన ఆర్థిక రక్షణగా నిలుస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. స్వల్ప మొత్తంలో రైతు వాటా ప్రీమియం చెల్లించడం ద్వారా భారీ మొత్తంలో బీమా రక్షణ పొందవచ్చని వివరించారు. పంట రుణాలు తీసుకోని రైతులు మొబైల్ యాప్ ద్వారా స్వయంగా నమోదు చేసుకోవచ్చు. అదనంగా బ్యాంకులు, కామన్ సర్వీస్ సెంటర్లు , నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్, గ్రామ సచివాలయాలు, తపాలా కార్యాలయాల ద్వారా కూడా బీమా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. పంట రుణాలు తీసుకోని రైతులు స్వయ ధృవీకరణ పత్రం సమర్పించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యాన శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు , రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, గ్రామ సచివాలయాల సిబ్బంది గ్రామ స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, అర్హులైన ప్రతి రైతు నిర్ణీత గడువులోగా పంటల బీమా పథకాల్లో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయ ఉధ్యాన శాఖ డీఏవోలు ఎం.వెంకట రామారావు, బివి రమణ, , రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## చందనోత్సవ అలంకారంలో అభయ కోదండరాముడి దివ్య దర్శనం



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆషాఢ మాస తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆగిరిపల్లి గ్రామంలోని విజయవాడ రహదారి సమీపంలో ఉన్న శ్రీ సీతా లక్ష్మణ సమేత శ్రీ అభయ కోదండరామస్వామి ఆలయంలో చందనోత్సవం భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వైభవంతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు సుగంధభరితమైన చందన అలంకారంలో భక్తులకు దివ్య దర్శనమిచ్చి అందరినీ భక్తి పారవశ్యంలో ముంచెత్తారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పంచామృతాభిషేకం, ఫలరసాభిషేకం, స్నపన తిరుమంజనం, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. శనివారం విశేష చందనోత్సవ అలంకరణ, అష్టోత్తర శతనామావళి అర్చన, మంగళ హారతులతో పాటు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య వైదిక సంప్రదాయానుసారం పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు చందనోత్సవ అలంకారంలో కొలువుదీరిన అభయ కోదండరాముడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించి స్వామివారి అనుగ్రహాన్ని పొందారు. ఆలయ ప్రాంగణం అంతా గోవింద నామస్మరణలు, శ్రీరామ నామసంకీర్తనలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

# జీవో 396 ఉపసంహరణకు డిమాండ్

- దస్తావేజు లేఖర్ల పోరాటానికి వైఎస్సార్సీపీ మద్దతు
- రావులపాలెంలో నిరసనలో పాల్గొన్న చిర్ల జగ్గిరెడ్డి, జక్కంపూడి విజయలక్ష్మి.

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు, లేఖర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రావులపాలెంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, అమలాపురం పార్లమెంటరీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జీవో నెం.396ను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ, శతాబ్దకాలంగా ప్రజల ఆస్తుల రక్షణలో, రిజిస్ట్రేషన్ వ్యవస్థలో విశ్వసనీయ సేవలు అందిస్తున్న దస్తావేజు లేఖర్లను పక్కనపెట్టి రిజిస్ట్రేషన్ వ్యవస్థను ప్రైవేటీకరించే ప్రయత్నం చేయడం ఆందోళనకరమన్నారు. ఆర్ఎస్కే కేంద్రాల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి



అప్పగించడం వల్ల ప్రజల ఆస్తుల భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని పేర్కొన్నారు. గతంలో రిజిస్ట్రేషన్ వ్యవస్థలో చిన్న మార్పులపైనా విమర్శలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇప్పుడు పూర్తిస్థాయిలో ప్రైవేటీకరణకు ప్రయత్నించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఆరోపించారు. ఇటీవల రిజిస్ట్రేషన్ శాఖ ఐజీతో జరిగిన సమావేశంలో దస్తావేజు లేఖర్ల భవిష్యత్తుపై స్పష్టమైన హామీ ఇవ్వకపోవడం వల్ల ప్రభుత్వం జీవో అమలుపై ముందుకెళ్తోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ప్రభుత్వం వెంటనే దస్తావేజు లేఖర్లకు స్పష్టమైన హామీ ఇవ్వాలని, అవసరమైతే అధికారిక లైసెన్సులు మంజూరు చేసి ప్రస్తుతం అందిస్తున్న సేవలను కొనసాగించే అవకాశం కల్పించాలని కోరారు. ఈ నిర్ణయం వల్ల వేలాది మంది దస్తావేజు లేఖర్లతో పాటు డీటీపీ ఆపరేటర్లు, టైపిస్టులు, స్టాంపు విక్రేతలు, డాక్యుమెంట్ తయారీ సిబ్బంది సహా సుమారు 20 వేల మందికి పైగా ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దస్తావేజు లేఖర్ల న్యాయబద్ధమైన డిమాండ్లకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని, వారి సమస్యలను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తామని చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు. ప్రజల ఆస్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం జీవో నెం.396ను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## నేల ఆరోగ్యం మరియు భూసార పరీక్షల అవశ్యకతపై విద్యార్థులకు అవగాహన సదస్సు

ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం

మండలంలోని జగ్గవరం పంచాయతీ కోతుల గుట్ట గ్రామంలో గల ఏపీ టి డబ్ల్యు ఆర్ స్కూల్ నందు 8వ తరగతి విద్యార్థులు కు నేల ఆరోగ్యం భూసార పరీక్షల అవశ్యకత పై మండల వ్యవసాయ అధికారిని సి హెచ్. దేవి అవగాహన కల్పించారు,ఈ యొక్క కార్యక్రమంలో విద్యార్థులకు భూమిలో ఉండే పోషకాలు వాటి ప్రాముఖ్యత అదేవిధంగా మట్టి నమూనా సేకరణ పరీక్షలపై విద్యార్థులకు సవివరంగా వివరించడం జరిగింది,ఈ



భూసార పరీక్షలో ఆధారంగా భూమిలోని పోషకాలు వాటి లభ్యత తెలుస్తుందని తద్వారా వాటి ఆధారంగా ఎరువులు వినియోగించినట్లయితే రైతుకి పెట్టుబడి వ్యయం తగ్గుతుందని వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సిబ్బంది పాఠశాల ఉపాధ్యాయులు పిల్లలు పాల్గొన్నారు.

## ఇది నిర్వహణలో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుల్ కు ప్రశంసలు వెల్లువ



ప్రజా భూమి ప్రతినిధి-చింతలపూడి

ఏలూరు జిల్లాచింతలపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ నాటు తుపాకుల స్వాధీనం కేసులో సమర్థవంతంగా పనిచేసి విశేష ప్రతిభ కనబరిచిన కానిస్టేబుల్ ఎం. నాగాంజనేయులను చింతలపూడి ఎస్ఐ కే. సతీష్ కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ఆయన చూపిన నిబద్ధత, అప్రమత్తతను ప్రశంసిస్తూ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఇలాంటి పనితీరు పోలీసు శాఖకు మంచి పేరు తీసుకువస్తుందని ఎస్ఐ పేర్కొంటూ, ఇదే స్ఫూర్తితో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏకాదశి అఖండ మౌన ధ్యానానికి తరలిరండి




ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

బ్రహ్మర్షి పితామహ పత్రిజీ దివ్య స్ఫూర్తితో నిర్వహిస్తున్న ఏకాదశి అఖండ మౌన ధ్యానం ఈ నెల 26వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 27వ తేదీ ఉదయం 9 గంటల వరకు గరికపాటి ధ్యాన మందిరం, ఆగిరిపల్లిలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ధ్యాన కార్యక్రమంలో భక్తులు, ధ్యాన సాధకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. మౌన ధ్యానం వల్ల మనస్సు ప్రశాంతంగా మారడంతో పాటు ఒత్తిడి, ఆందోళన తగ్గి ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. అలాగే ఆత్మవిశ్వాసం, మానసిక స్థైర్యం పెంపొందడంతో అంతరంగ శాంతి, సానుకూల ఆలోచనలు కలుగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

## 28న ఢిల్లీలో తెలుగు వెలుగు సంబరాలు

### -ముఖ్య అతిధులుగా హాజరు కానున్న కేంద్ర మంత్రులు



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జూలై 28 న్యూఢిల్లీలోని ఆంధ్ర అసోసియేషన్ హాల్లో సాయంకాలం నాలుగు గంటలకు అత్యంత వైభవంగా తెలుగు వెలుగు సంబరాలు మరియు జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి గారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్టు జాతీయ తెలుగు సారస్వత పరిషత్ సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షులు కేశిరాజు రాంప్రసాద్ తెలిపారు. కార్యక్రమానికి కేంద్ర ఉక్కు మరియు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ అధ్యక్షత వహిస్తున్నారని, కేంద్ర మంత్రులు గౌరవనీయులు కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రివర్యులు జి కిషన్ రెడ్డి, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రివర్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రివర్యులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ముఖ్య అతిథులుగా ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు. విశిష్ట అతిథులుగా రాజ్యసభ సభ్యులు కే లక్ష్మణ్, బి మస్తాన్ రావు ,ఆర్ కృష్ణయ్య, సానా సతీష్ బాబు, పాకా వెంకట సత్యనారాయణ, విజయ్ చింతకాయల, భాష్యం రామకృష్ణ, లింగంనేని రమేష్ హాజరవుతున్నారని,ఇంకా అనేకమంది తెలుగు పార్లమెంటు సభ్యులు హాజరవుతున్నారని జాతీయ తెలుగు సారస్వత పరిషత్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేశిరాజు రాంప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా 70 మంది కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు సాయంకాలం నాలుగు గంటల నుంచి నిర్వహించబడుతున్నాయని తదుపరి డాక్టర్ సి.నారాయణరెడ్డి పేరు మీద కవి సమ్మేళనం జరుగుతున్నదని దానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఎంతోమంది కవులు విచ్చేసారని తెలిపారు అంతేకాకుండా ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన ప్రముఖులకు జాతీయ వాగ్దేవి జీవిత సాఫల్య పురస్కారాలు అందజేస్తున్నారని తెలిపారు ఈ పురస్కారాలు అందుకుంటున్న వారిలో ప్రముఖులు పీతాని సత్యనారాయణ, శాసనసభ్యులు ఆచంట, ఉద్దరాజు కాశీ విశ్వనాథ రాజు, ఆక్వా పితామహులు, శ్రీ చైతన్య రాజు చాన్స లర్ గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ, సీజే వేణుగోపాల్ రిటైర్డ్ ఎడిషనల్ చీఫ్ సెక్రటరీ ఒడిశా, తిరుమల తిరుపతి దేవస్థానానికి సంబంధించిన ప్రవచనకారులు ఆకెళ్ళ విభీషణ శర్మ, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్ .బాలాచారి, ప్రముఖ సినీ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి ఈ వాగ్దేవి జీవిత సాఫల్య పురస్కారాలు అందుకుంటున్నారు. ఈ సందర్భంగా జాతీయ వాగ్దేవి విశేష ప్రతిభ పురస్కారాలను అందజేస్తున్నారు ఈ అందుకున్న వారిలో ప్రముఖులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు, కంతేటి వెంకట్ రాజు, ముత్యాల శ్రీనివాస్, ఈతకోట భీమశంకర్ రావు, జక్కంపూడి లక్ష్మీ నరసింహ నాగేంద్ర కుమార్, సుమన్ మచ్చ , పద్మా వర్మ అల్లూరి, కొట్టే సాయి ప్రసాద్, పి బడే సాబ్, ఢిల్లీ వసంత్ ,కాగిత వెంకటరమణారావు, పెనుమత్స అర్జున్ రాజు , అల్లూరి రవివర్మ, కే సుధీరమణ, ఎస్ రాజశేఖర్ రెడ్డి, చంద్రాబట్ల శ్రీనివాస్, బొల్లు రామ్మోహన్ నాయుడు మరి కొందరు ఈ అవార్డ్ తీసుకొంటున్నారు. ఢిల్లీ కి చెందిన మరో 30 కి జాతీయ వాగ్దేవి పురస్కారాల ఇస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని కేశిరాజు రాంప్రసాద్, ముత్యాల శ్రీనివాస్, డాక్టర్ కే వర్మ, సుధీర్, కార్యక్రమ ఛైర్మెన్ కంతేటి వెంకటరాజ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

ఆదివారం 26 జూలై 2026

## అనంతపురం రాంనగర్ మంత్రి పయ్యావుల క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహణ



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం
అనంతపురంలోని రామ్‌నగర్‌లో ఉన్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మధ్యాహ్నం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అందిన ప్రతి వినతిని మంత్రి స్వయంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

## ఘనంగా ఏకలవ్య జయంతి

### -ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి ఆర్థిక సహకారం

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం పట్టణంలోని యల్లమాంబ దేవాలయం వద్ద ఏకలవ్య జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఆంధ్రప్రదేశ్ ఎరుకల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కేబీ.శంకరయ్య ఆధ్వర్యంలో ఎరుకల జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఏకలవ్య జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి ఇంటర్మీడియట్ లో 986/1000 మార్కులు సాధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి షైనింగ్ స్టార్ అవార్డ్ గ్రహిత ఎరుకల మలోజ్ శ్రావణికి ఎరుకల హక్కుల పరిరక్షణ సమితి తరుపున ఏకలవ్య ప్రతిభ అవార్డ్ అందించి రూ.10 వేల నగదు ప్రోత్సహం ఇచ్చి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన వసతి గృహం ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆంజనేయులు, పార్లమెంట్ అధ్యక్షులు వెంకటేష్, ఎస్సీ సెల్ జిల్లా కార్యవర్గ సభ్యులు మేళాపురం రవి, కార్యదర్శి కొత్తపల్లి హనుమంతరాయప్ప, ఉపాధ్యక్షులు మొలోజ్ హనుమంతప్ప, మాజీ కౌన్సిలర్ అశ్వర్థప్ప, 20 వార్డ్ ఇంచార్జ్ ఆంజనేయులు, నారాయణ, సయువత మంజు, రంగనాథ్, బెల్పాటం మంజు, యోగి, మారుతి, రవి మహిళలు అలివేలమ్మ, బవాణమ్మ, మంజమ్మ, నీరజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థినిలకు ఆర్థిక సహాయం

### -కళాశాల ఫీజులు చెల్లించిన ఉప్పర సంఘం



ప్రజాభూమి, హిందూపురం టౌన్
ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఫీజులు చెల్లించలేని ఇద్దరు విద్యార్థినిలకు ఉప్పర సంఘం ప్రతినిధులు కళాశాల ఫీజులు చెల్లించారు. ఉప్పర బిందు, ఉప్పర వైష్ణవి అనే ఇద్దరు పేద బాలికలు చదువు కొనసాగించడానికి భగీరథ విద్యా సేవా సంఘం శనివారం ఆర్థిక సాయం అందించారు. సప్తగిరి జూనియర్, డిగ్రీ కళాశాలల్లో బిందు, వైష్ణవి చదువుతుండగా ఈ మేరకు ఆయా విద్యార్థినిల ఫీజులను సంఘం నాయకులు కళాశాలకు చెల్లించారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాల్ పి. శ్రీనాథ్ రెడ్డి, పరిపాలనాధికారి బి.గంగిరెడ్డి, ఎంబీఏ, ఎంసీఏ ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, భగీరథ విద్యా సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## వైభవంగా పాండురంగ స్వామి రథోత్సవం



ప్రజాభూమి, హిందూపురం టౌన్
హిందూపురం మున్సిపల్ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లిలో వెలసిన రుక్మిణి పాండురంగ స్వామి బ్రహ్మరథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం సుప్రభాత సేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మూలవిరాట్ రుక్మిణి పాండురంగ స్వామిని వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం దేవాలయ ఆవరణలో వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ హోమాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు అభిషేకముల నిర్వహించి వివిధ పూలతో అలంకరించారు. విగ్రహాలను ఉదయం 11 గంటలకు మడితేరులో ఉంచి ఊరేగించి ఊరేగించారు. అనంతరం మహా రథంలో రుక్మిణి పాండురంగ స్వామి విగ్రహాలను ఉంచి వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ అశేష భక్తుల సమక్షంలో జై పాండురంగ, జై జై పాండురంగ అంటూ నినాదాలు చేస్తూ గ్రామ వీధుల్లో ఘనంగా ఊరేగించారు. భక్తులు తమ కోరికలను తీర్చుకోవడానికి రథంలో ఉన్న స్వామి వారిపై మిరియాలు, బొరుగులుల ధవనం, అరటిపండు విసిరి తమ భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలకృష్ణ పిఏలు వీరయ్య, బాలాజీ, ఎన్.బి.కె ఫ్యాన్స్ అధ్యక్షులు బండారు, బాలాజీ, మాజీ మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మద్దన జయరాములు, పాండురంగ స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు పల్లా లక్ష్మి కుమార్, ధర్మకర్త గోపాలకృష్ణ, ప్రతినిధులు రంగనాయకులు, చింతా రామాంజనేయులు, సురువు రామాంజనేయులు, పల్లా చంద్రమోహన్, పురుషోత్తం, విజయభాస్కర్, మంచాల భాస్కర్, నరసింహ చారి, పామిశెట్టి గోపాల్, మునిరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఏకలవ్యుడి స్ఫూర్తితో ముందుకెళదాం -విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



ప్రజాభూమి, హిందూపురం టౌన్
ఏకలవ్యుడి పట్టుదలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళదామని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పావులూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఏకలవ్యుడి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి బాలాజీలు మాట్లాడుతూ, ఏకలవ్యుడు చూపిన భక్తి, పట్టుదల ప్రతి ఒక్క విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కష్టపడే తత్వం ఉంటే ఎంతటి ఉన్నత శిఖరాలనైనా అధిరోహించవచ్చని తెలిపారు. ?అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు, విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గంగప్ప, మాజీ మున్సిపల్ చైర్మన్ జెవి అనిల్ కుమార్ గారు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నాగరాజు, షఫీవుల్లా, అమర్నాథ్, డైమండ్ బాబా, అన్వర్, బీసీ సెల్ అధ్యక్షులు రాజు, పాఠశాల విద్యా కమిటి చైర్మన్ సమీవుల్లా, జహంగీర్, శ్రీధర్, బద్రీ, బాబురెడ్డి, మల్లికార్జున అబూబకర్, బాషా, మూర్తి, కలీమ్, మహబూబ్ బాషా, ఐటీడీపీ నవీన్, మహబూబ్ బాషా, ముస్తఫా, అజర్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### మాదకద్రవ్యాల నివారణపై పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన కల్పించాలి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం
అనంతపురం జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో మాదకద్రవ్యాల నియంత్రణ చర్యలు, ఎన్కోఆర్డీ నార్కో కోఆర్డినేషన్ సెంటర్ జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఎస్పీ పి.జగదీష్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను డ్రగ్ ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యాసంస్థల్లో వారానికొకసారి అవగాహన కార్యక్రమాలు డిఈఓ, ఆర్ఐఓ, ఆర్జెడిలు పాఠశాలలు, కళాశాలల్లో డ్రగ్స్, గంజాయి దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మాదకద్రవ్యాల అవగాహన కార్యక్రమాలు అన్ని విద్యాసంస్థలు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు, చర్చించిన అంశాలు, ఇతర వివరాలను తప్పనిసరిగా గూగుల్ ఫారంలో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రైవేట్ పాఠశాలల ఈగల్ క్లబ్ వివరాలు జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన ఈగల్ క్లబ్ వివరాల ఫిజికల్ కాపీలను డీసీఆర్‌బీకి పంపించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు.

హాట్‌స్పాట్ ప్రాంతాల పరిశుభ్రత

కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న చెరువుకట్ట దిగువనున్న పార్కును పూర్తిగా శుభ్రపరచాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశించారు. పార్కు పరిసరాల్లో ఉన్న నిరుపయోగ ప్రదేశాలు హాట్‌స్పాట్ ప్రాంతాలను గుర్తించి వెంటనే క్లియర్ చేయాలన్నారు.'పల్లెబాటలో ఈగల్' కార్యక్రమం వ్యవసాయ శాఖ, అటవీ శాఖ, పోలీసు శాఖ, ఈగల్ సెల్ సమన్వయంతో జిల్లాలోని గుర్తించిన గ్రామాలు, అన్ని పోలీస్ స్టేషన్ పరిధుల్లో గంజాయి సాగు నివారణ, మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జీఎస్టీ/కమర్షియల్ ట్యాక్స్ శాఖ అధికారులు తమ విధుల నిర్వహణలో గంజాయి లేదా మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం లభిస్తే తప్పనిసరిగా పోలీసు శాఖకు తెలియజేయాలన్నారు. విద్యాసంస్థల 500 మీటర్ల పరిధిలో నిషేధిత విక్రయాలు విద్యాసంస్థల 500 మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తులు, గంజాయి, మాదకద్రవ్యాలు మరియు ఇతర నిషేధిత పదార్థాల విక్రయాలను పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే దుకాణాలపై తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధించాలని సంబంధిత శాఖలకు సూచించారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి సాగుకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే అన్ని శాఖలు, ముఖ్యంగా అటవీ శాఖ అధికారులు, పోలీసు శాఖ మరియు ఈగల్ సెల్‌కు వెంటనే సమాచారం అందించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ పోలీసు శాఖ మరియు ఈగల్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించే డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సులు, సెమినార్లు, ర్యాలీలు, ఇతర కార్యక్రమాలకు పూర్తి సహకారం అందించాలని పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలను ఆదేశించారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడడం విద్యాసంస్థలు, పోలీసు శాఖ, ఈగల్ సెల్ మరియు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి విద్యార్థుల్లో మాదకద్రవ్యాల పట్ల అవగాహన పెంచి, డ్రగ్-ఫ్రీ క్యాంపస్‌లుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ వలి భాష, ఈగల్ నోడల్ ఆఫీసర్ జయపాల్ రెడ్డి, ఈగల్ సబ్-ఇన్‌స్పెక్టర్ బి. హనుమంతు, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహారాజ్ శ్రీశ్రీ ఏకలవ్య జయంతి ఉత్సవాలు



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం
ఎస్టీ, ఎస్సీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సాకే ముసలయ్య, గిరిజన నాయకులు సాకే వీరాంజనేయులు వారి ఆధ్వర్యంలో స్థానిక అనంతపురం పాతూరు గిరిజన భవనంలో ఘనంగా మహారాజ్ శ్రీశ్రీ ఏకలవ్య జయంతి ఉత్సవాలు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ సభ్యులు పి. వెంకటప్ప, ఆర్ ఎం ఓ హేమలత ఫైర్ స్టేషన్ డిఎస్పి లింగమయ్య విచ్చేసారు. మహారాజ్ శ్రీశ్రీ ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులు అర్పించి జై ఏకలవ్య జై గిరిజన నినాదాలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వెంకటప్ప మాట్లాడుతూ రాష్ట్ర కూటమి ప్రభుత్వం నుంచి గిరిజనులకు రావాల్సిన సంక్షేమ పథకాలు అధికారులు సక్రమంగా అందజేయాలని తెలియజేశారు అదేవిధంగా ఏకలవ్య జయంతి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రకటించే విధంగా, అలాగే అనంతపురంలో ఏకలవ్య విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తానని తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా గిరిజన నాయకులు సాకే వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆషాడమాసం తొలి ఏకాదశి రోజున ఆదిమూలపురుషుడు, ఎరుకల జాతి ఆరాధ్య దైవం, విలువిద్యలో మేటి గొప్ప త్యాగశీలి యోధుడు అయినటువంటి శ్రీశ్రీ మహారాజ్ ఏకలవ్య జయంతి కార్యక్రమాన్ని జరుపుకోవడం ఆనవాయితుగా వస్తుంది, దేశవ్యాప్తంగా ఉన్నటువంటి కులస్తులందరూ ఒక తాటిపైకి వచ్చి ప్రతి గ్రామాల్లోనూ ప్రతి మండల స్థాయి జిల్లా స్థాయిలోనూ ఈ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకుంటారు ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఎరుకుల కులస్తులందరూ లక్షలాదిగా జనాభా ఉన్నారు. ప్రతి కులంలోనూ ఒక దైవమున్నట్టుగా మా కులానికి ఏకలవ్యుడే ఆరాధ్య దైవం అలాంటి యోధుడు జయంతి కార్యక్రమాన్ని వచ్చే సంవత్సరం నుంచి అధికారికంగా జరుపుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వాలు అవకాశం కల్పించాలని అదేవిధంగా అనంతపురం నడిబొడ్డున ఏకలవ్యుని విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించి విగ్రహం ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నారా చంద్రబాబు నాయుడు మా గిరిజనులను పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు, గురుకుల పాఠశాల ద్వారా మెరుగైన మంచి విద్యను అందిస్తూ, మంచి బోధన సిబ్బందిని ఇచ్చి, హాస్టల్లో మౌలిక వసతులు పెంచి, నాణ్యమైన భోజనం అందిస్తూ, గిరిజన విద్యార్థిని విద్యార్థులను అన్ని విధాలుగా అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారు. అదేవిధంగా గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయి, తల్లికి వందనం పథకం ద్వారా ఎంతో మంది గిరిజనుల విద్యార్థిని విద్యార్థులకు చదువుకునే అవకాశం కల్పించారు, అదేవిధంగా కుల వృత్తులు చేసుకునే వారికి సబ్సిడీ రుణాల ద్వారా రుణాలు అందించాలని కోరుచున్నాము. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు సాకే చిరంజీవిగారు, సాకే ఉమామహేశ్వరి, గాయత్రి, ఆనంద్, శ్రీరాములు, నాగరాజు, గుజ్జల శివ, గుజ్జల ముత్యాలమ్మ, సాకే గోవిందు హరి శివ శంకర్ నాయక్, మల్లికార్జున నాయక్ గిరిజన మహిళలు ఎరుకల కులస్తులు గిరిజన విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రైతులు ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటలు సాగు చేయాలి

### -పంటల బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం
ఖరీఫ్-2026 లో రైతులు ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటలు సాగు చేసే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ వ్యవసాయ అధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ తో కలిసి కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లాలో ఎల్ నినో ప్రభావం, క్రాప్ ఇన్సూరెన్స్, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎల్ నినో ప్రభావం వల్ల తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. కావున రైతులు వరి పంట మినహా ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలన్నారు. 2026 ఖరీఫ్ సీజన్లో రైతులు వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తమ పంటలకు తప్పకుండా క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. పంటల బీమా పథకానికి సంబంధించి 31వ తేదీ లోపు రైతులందరికీ తెలిసే విధంగా అవగాహన కల్పించి పంటలు సాగు చేసిన ప్రతి రైతు పంటల బీమా చేయించుకునే విధంగా అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా జిల్లా నందు తాగునీటికి మాత్రమే ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందన్నారు. పంటల సాగుకు నీటిని విడుదల చేయడం సాధ్యం కాదన్నారు. కావున రైతులు వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలైన మొక్కజొన్న, జొన్న, కంది, ఉలవలు పెసలు, మినుములు, కొర్ర వంటి పంటలను సాగు చేసే విధంగా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పిఎండిఎస్ పద్ధతిలో వివిధ రకాల పంటల విత్తనాలను గుళికలుగా తయారుచేసి పంటలు వేసుకుంటే బెట్ట పరిస్థితులను తట్టుకొని పంట దిగుబడి రావడానికి అవకాశం ఉందని తెలియజేశారు. అలాగే పాడి పశువులకు కూడా మేత కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జెడి ని ఆదేశించారు. ఉద్యాన పంటలలో కూడా పిఎండిఎస్ విధానాన్ని రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారులకు సూచించారు. అలాగే సూక్ష్మ నీటిపారుదల శాఖ ద్వారా డ్రిప్పు, స్ప్రింక్లర్లు ఈ సంవత్సర లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయాలని మరియు ఆటోమేషన్ ఉ ఫర్టిగేషన్ పద్ధతులను రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా పిడిని ఆదేశించారు. జిల్లా నందు పట్టు పరిశ్రమ విస్తీర్ణాన్ని పెంచే విధంగా ప్రకృతి వ్యవసాయం పద్ధతులను అవలంబించేలా రైతులకు అవగాహన కల్పించాలని పట్టు పరిశ్రమ శాఖ ఏడిని కోరారు. అలాగే ఆత్మ పథకం ద్వారా రైతులకు శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేసి అన్ని శాఖల ద్వారా అమలయ్యే పథకాలను చేరవేసేలా చర్యలు తీసుకోవాలని, అగ్రి స్టార్ట్ అప్ కంపెనీలను గుర్తించి రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ఆత్మ పిడిని ఆదేశించారు. మార్కెటింగ్ శాఖ పరిధిలో ఉన్న గోదాములను సద్వినియోగపరచుకునేలా బాడుగలకు ఇచ్చి ఉపయోగంలోకి తీసుకురావాలని మార్కెటింగ్ శాఖ వారిని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎల్ నినో ప్రభావంతో రైతులు ఏ ఏ పంటలు సాగు చేయాలి, ఎల్ నినో అంటే ఏమిటి అనే బుక్ లెట్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఎన్. సాలు రెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి, ఏపీఎంఐపీ పిడి రఘునాథ్ రెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ప్రేమ్ చంద్, పట్టు పరిశ్రమ, మార్కెటింగ్, మత్స్యశాఖ, పిడి డిఆర్డిఏ, బ్యాంకు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్‌కు స్వస్తి పలికితేనే భావితరాలకు భద్రత

- పర్యావరణహిత ఉత్పత్తుల వినియోగాన్ని అలవాటు చేసుకోవాలి
- హరిత విప్లవానికి హిందూపురం నాంది..
- ఎకో షాప్ ప్రారంభంలో జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్






ప్రజాభూమి, హిందూపురం టౌన్
ప్లాస్టిక్ నిషేధం ద్వారానే భావితరాల భవిష్యత్తుకు భద్రత ఉంటుందని జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం హిందూపురం పట్టణంలోని లేపాక్షి రోడ్డులోని మినీ మార్కెట్‌లో పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎకో షాపు ను జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ ప్రారంభించారు. అనంతరం షాపులో ఏర్పాటు చేసిన క్లాత్ బ్యాగులు, జూట్ బ్యాగులు, పేపర్ బ్యాగులు, ఆకు ప్లేట్లు, పర్యావరణహిత గ్లాసులు, గృహోపకరణాలు, సహజ పదార్థాలతో తయారైన ఇతర ఉత్పత్తులను పరిశీలించారు. ఉత్పత్తుల నాణ్యత, ధరలు, ప్రజలకు అందుబాటులో ఉండే విధానంపై అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రపంచాన్ని వేధిస్తున్న ప్రధాన పర్యావరణ సమస్యల్లో ప్లాస్టిక్ కాలుష్యం ఒకటిగా మారిందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కారణంగా నేల సారం దెబ్బతింటోందని, నీటి వనరులు కలుషితం అవుతున్నాయని, పశువులు, పక్షులు, జలచరాల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలు పూర్తిగా కరిగిపోవడానికి వందల సంవత్సరాలు పడుతుండటంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్లాస్టిక్ నిషేధాన్ని విజయవంతం చేయాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమన్నారు. ప్రతి కుటుంబం మార్కెట్‌కు వెళ్లేటప్పుడు క్లాత్ బ్యాగ్ తీసుకెళ్లడం, ప్లాస్టిక్ కవర్లను తిరస్కరించడం, పర్యావరణహిత వస్తువులనే కొనుగోలు చేయడం వంటి చిన్నచిన్న చర్యలు సమాజంలో పెద్ద మార్పుకు దారి తీస్తాయని చెప్పారు. ఎకో షాప్ కేవలం వస్తువుల విక్రయ కేంద్రం మాత్రమే కాదని, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచే వేదికగా కూడా పని చేస్తుందని కలెక్టర్ తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు ఈ షాప్‌ను నిర్వహించడం ద్వారా వారికి స్థిరమైన ఆదాయం లభించడంతో పాటు మహిళా సాధికారతకు మరింత బలం చేకూరుతుందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత, స్వయం ఉపాధి అనే మూడు లక్ష్యాలను ఒకే కార్యక్రమం ద్వారా సాధించే ప్రయత్నమే ఎకో షాప్ అని వివరించారు. మున్సిపల్ కమిషనర్ వి. మల్లికార్జున మాట్లాడుతూ, హిందూపురాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు పురపాలక సంఘం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందన్నారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలపై నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నామని, ప్రజలకు ప్రత్యామ్నాయంగా పర్యావరణహిత ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా ఈకో షాప్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పౌరుడు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి హరిత హిందూపురం నిర్మాణంలో భాగస్వామి కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజు, మండల తహసీల్దార్ వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షులు వెంకటేష్, డీఎంసీ గంగులయ్య, టీఎల్ఎఫ్ విజయలక్ష్మి, సరస్వతి భారతి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు (సీఓలు), స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మొన్న రైతు..నేడు విద్యార్థి....చివరికి ఉద్యమమే గెలుపు

## సిపిఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్ ఉద్ఘటన

### ప్రజా, విద్యార్థి పోరాటాల దాడికి తలవంచిన మోదీ సర్కార్




ప్రజాభూమి పోరుమామిళ్ల : నీట్ పరీక్షల పేపర్ లీకేజీతో లక్షలాది మంది నిరుపేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా సాగిన పోరాటం నెగ్గిందని సిపిఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్ అన్నారు. ఈ సందర్భంగా వారు పోరుమామిళ్ల విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థి, యువజన సంఘాలు చేపట్టిన ఉక్కుపిడికిలి లాంటి ఉద్యమాల తాకిడికి తలొగ్గి, బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయక తప్పలేదు. ఎంతటి నియంత ప్రభుత్వాలైనా ప్రజా పోరాటాల ముందర మోకరిల్లక తప్పదని మరోసారి నిరూపిత మైందన్నారు. లక్షలాది విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే ఊరుకునేది లేదు. విద్యారంగాన్ని కార్పొరేట్ శక్తులకు కుదవపెట్టే కుట్రలను తిప్పికొడతామని భవిష్యత్తులో కూడా విద్యార్థి, నిరుద్యోగ సమస్యలపై సిపిఐ పోరాటం ఆగదని తెలిపారు. మొన్న రైతు ఉద్యమం, నేడు విద్యార్థుల ఉద్యమానికి, రేపు కార్మిక సంఘాల ఉద్యమాలకు తలగ్గాల్సిందే అని అన్నారు.

## తొలి ఏకాదశికి భక్తుల తో నిండిన ఏకశిలా నగరం

### సీతారాముల దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు, ఉచిత అన్నప్రసాదం స్వీకరించిన భక్తులు



ప్రజాభూమి, ఒంటిమిట్ట: తొలి ఏకాదశి సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రవైన ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. తొలి ఏకాదశి, శనివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఏకశిలా నగరానికి తరలివచ్చి శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారులు అందజేసిన తీర్థప్రసాదాలు స్వీకరించిన భక్తులు, దేవస్థానం ఏర్పాటు చేసిన ఉచిత అన్నప్రసాదాన్ని ఆరగించి తమ భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. ఆలయ ప్రాంగణం రోజంతా భక్తుల రాకపోకలతో సందడిగా కనిపించింది.

## ఘనంగా శ్రీ సత్యనారాయణ స్వామి కళ్యాణోత్సవం

### తొలి ఏకాదశి పురస్కరించుకొని వేదమంత్రాల నడుమ వైభవం



ప్రజాభూమి,పులివెందుల తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని పులివెందుల పట్టణంలోని మిట్టమల్లేశ్వర స్వామి ఆలయంలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం కళ్యాణోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మఠం రుద్రాస్వామి ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు ముందుగా గణపతి పూజ, నవగ్రహ పూజ సత్యనారాయణ స్వామి వ్రతం, అభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీ మిట్టమల్లేశ్వరునికి రుద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు అనంతరం శ్రీ సత్యనారాయణ స్వామి కళ్యాణోత్సవాన్ని జూటూరు వంశస్థుల చేతుల మీదుగా అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపించారు. నూతన వస్త్రాలు, పుష్పాలతో స్వామివారిని అలంకరించి, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. కళ్యాణోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కళ్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ ను సందర్శించిన జూనియర్ సివిల్ జడ్జి



ప్రజాభూమి,పులివెందుల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవా సంస్థ, అమరావతి ఆదేశాల మేరకు, జిల్లా న్యాయ సేవా సంస్థ, కడప చైర్మన్ కమ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ యామిని సూచనలతో పులివెందుల సబ్ జైల్‌లోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జ్ చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ క్లినిక్ రిజిస్టర్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం జైలులో ఉన్న ఖైదీలతో నేరుగా మాట్లాడి వారికి ఉచిత న్యాయ సలహాలు, ఉచిత న్యాయ సహాయం సక్రమంగా అందుతున్నాయా అని ఆరా తీశారు. అలాగే ఖైదీల కేసుల పురోగతి, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలు ప్రభుత్వం కల్పించిన ఉచిత న్యాయ సహాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జడ్జ్ సూచించారు. ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే 15100ఉచిత హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం మండల లీగల్ సర్వీస్ కమిటీ, పులివెందుల, జిల్లా న్యాయ సేవా సంస్థ, కడపను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ అడ్వకేట్ శివరాజ్ పాల్గొన్నారు.

## ఇంటర్ నుంచే జీవిత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

### - లక్ష్య సాధనకు ప్రణాళికాబద్ధంగా చదువులు కొనసాగించాలి - తహసీల్దార్ శివశంకర్ రెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె విద్యార్థులు ఇంటర్ స్థాయి నుంచే తమ జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని, లక్ష్య సాధనకు ప్రణాళికాబద్ధంగా చదువులు కొనసాగించాలని వేంపల్లి తహసీల్దార్ శివశంకర్ రెడ్డి సూచించారు. స్థానిక అక్షర బాలికల జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ స్పష్టమైన లక్ష్యం, క్రమశిక్షణ, పట్టుదల ఉంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై తిరుపాల్ నాయక్ మాట్లాడుతూ, క్రమశిక్షణతో కూడిన విద్యే విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చే మార్గమని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు మంచి నడవడి, సమయపాలన అలవర్చుకుని భవిష్యత్తులో సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ భూమిరెడ్డి విజయభారతి మాట్లాడుతూ, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే కళాశాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి భూమిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీలో అక్రమాలు - మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలి

### డీఎస్సీ వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించాలి

### వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు రామ్ లక్ష్మణ్ రెడ్డి




ప్రజాభూమి, పులివెందుల ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ ఉద్యోగాలను అమ్ముకుని, నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు రామ్ లక్ష్మణ్ రెడ్డి,విద్యార్థి విభాగం జిల్లా కోశాధికారి రాఘవేంద్ర రెడ్డి తీవ్రంగా డిమాండ్ చేశారు. శనివారం వైయస్ఆర్సీపీ కార్యాలయంలో పత్రిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఏవిధంగా నిలదీసి రాజీనామా దిశగా ఒత్తిడి తెచ్చారో,అదే రీతిలో ఆంధ్రప్రదేశ్ యువత కూడా ఐక్యంగా ముందడుగు వేసి లోకేష్‌కి తగిన బుద్ధి చెప్పాలని వారు పిలుపునిచ్చారు.?ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీఎస్సీ నిర్వహణలో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపించారు. వీటిపై ప్రశ్నించిన వారిపై అన్యాయంగా దాడులకు పాల్పడుతున్నా రని మండిపడ్డారు. డీఎస్సీ వ్యవహారంపై మంత్రి లోకేష్ రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని,ఈ మొత్తం అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) ద్వారా నిష్పాక్షిక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## జాతీయ తెలుగు సారస్వత పరిషత్ దేశ రాజధానిలో తెలుగు వెలుగు సంబరాలకు ఆహ్వానం



ప్రజాభూమి పోరుమామిళ్ల : తెలుగు భాష సాహిత్యం సాంస్కృతి వైభవాన్ని జాతీయస్థాయిలో చాటి చెప్పే లక్ష్యంతో జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జాతీయ తెలుగు వెలుగు సంబరాలు 2026 కార్యక్రమానికి పోరుమామిళ్ళకు చెందిన రచయిత బొల్లు రామ్మోహన్ కు ఆహ్వానం అందింది ఈ కార్యక్రమం న్యూఢిల్లీలోని ఆంధ్ర భవన్ లో 28 సాయంత్రం నాలుగు గంటలకు కేంద్ర ఉక్కుగనుల శాఖ మంత్రి భూపతి రాజు, శ్రీనివాస్ వర్మ అధ్యక్షతన, జి కిషన్ రెడ్డి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రివర్యులు, కింజారపు రామ్మోహన్ నాయుడు కేంద్ర పౌర విమాన శాఖ మంత్రివర్యులు, డాక్టర్ బ్రహ్మోసాని చంద్రశేఖర్ కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్ శాఖ మంత్రి, బండి సంజయ్ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రివర్యులు, అలాగే రాజ్యసభ సభ్యులు లోక్సభ సభ్యులు అందరూ హాజరై డాక్టర్ సి నారాయణ రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జాతీయ విశేష ప్రతిభ వాగ్దేవి పురస్కారాన్ని బొల్లు రామమోహన్ కు అందజేయనున్నారని జాతీయ తెలుగు సారస్వత పరిషత్ డాక్టర్ కేశరాజు రాంప్రసాద్ తెలిపారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం సరికాదు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, మాజీ ఆప్కాస్ స్టేట్ బోర్డు మెంబర్



ప్రజాభూమి పోరుమామిళ్ల : నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన కలిగించిందని మాజీ ఆప్కాస్ స్టేట్ బోర్డు మెంబర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. నీట్ పరీక్ష కోసం సంవత్సరాల తరబడి కష్టపడి చదివిన విద్యార్థుల భవిష్యత్తుతో ఎవరైనా చెలగాటమాడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పేపర్ లీక్‌కు పాల్పడిన వారిని గుర్తించి, ఈ వ్యవహారం వెనుక ఉన్న మొత్తం నెట్‌వర్క్‌పై సమగ్ర దర్యాప్తు జరపాలని కోరారు. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, నిజాయితీగా పరీక్ష రాసిన విద్యార్థులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యా వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రులకు నమ్మకం కలిగించే విధంగా పారదర్శకమైన విధానాలను అమలు చేయాలని డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రశ్నాపత్రాల భద్రత, పరీక్షల నిర్వహణలో మరింత కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.

## 1వ వార్డులో 93 శాతం ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పూర్తి

### వైకాపా బిఎల్ఏ లను అభినందించిన వైఎస్ మనోహర్ రెడ్డి



ప్రజాభూమి,పులివెందుల పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని ఒకటవ వార్డు 74వ బూతులో 93 శాతం ఓట్ల ప్రక్రియను పూర్తి చేసిన రామ లక్ష్మణ రెడ్డిని మున్సిపల్ వైకాపా ఇన్చార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు పెద్ద రంగాపురం గ్రామంలో మొత్తం 931 ఓట్లు ఉండగా 88 ఓట్లు అప్లోడ్ చేయడం జరిగిందన్నారు. మరణించిన వారు 19 మంది ఉన్నట్లు ఆయన తెలిపారు. డబల్ ఎంట్రీ ఓట్లు ఏడున్నట్లు ఆయన తెలిపారు. ఇతరులు 17 మంది ఉన్నారని మొత్తం 93% ప్రక్రియ పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. వైకాపా బి ఎల్ ఏ లు పూర్తిస్థాయిలో ఇంటింటికి తిరిగి ఓట్ల ప్రక్రియ పూర్తి చేయడం అభినందనీయమన్నారు. మిగతా వార్డులలో కూడా ఇదే ప్రక్రియలో వైకాపా బిఎల్ఏ లు పనిచేయడం వారు కూడా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. వైకాపా పార్టీ ఆధ్వర్యంలో ఏ కార్యక్రమం నిర్వహించిన నాయకులు కార్యకర్తలు ముందుండి ఆ పనిని పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రామిరెడ్డి,ప్రశాంత్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

## పులివెందులలో అమరావతి ఛాంపియన్షిప్' క్రీడా పోటీలు ప్రారంభం

### క్రీడాకారులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

### క్రీడాకారులను పరిచయం చేసుకున్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి




ప్రజాభూమి,పులివెందుల పులివెందుల పట్టణంలోని వైయస్సార్ క్రీడా ప్రాంగణంలో అమరావతి ఛాంపియన్షిప్ క్రీడా పోటీలు శనివారం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణం లో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వానికే కాకుండా మానసిక వికాసానికి, క్రమశిక్షణకు ఎంతగానో దోహద పడతాయని ఆయన అన్నారు. ప్రభుత్వం క్రీడా రంగానికి అందిస్తున్న ప్రోత్సాహాన్ని, ఇలాంటి వేదికలను క్రీడాకారులు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.




గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకే ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. అంతకుముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడాకారులతో కలిసి క్రీడను ఆడారు. ఈ కార్యక్రమంలో వివిధ క్రీడల కోచ్‌లు, క్రీడా ప్రాంగణ అధికారులు, క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైల దక్షిణ ముఖద్వారం జ్యోతి ఆలయానికి పూర్వ వైభవం తీసుకొస్తాం

### - త్వరలో పాలకమండలి సమావేశంలో అభివృద్ధి తీర్మానం

### - శ్రీశైలం దేవస్థానం చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు



ప్రజాభూమి, సిద్ధవటం: శ్రీశైల దక్షిణ ముఖద్వారంగా ప్రసిద్ధి చెందిన సిద్ధవటం మండలం జ్యోతి గ్రామంలోని శ్రీ జ్యోతి సిద్ధేశ్వర స్వామి ఆలయాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని శ్రీశైలం దేవస్థానం పాలకమండలి చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు తెలిపారు. శనివారం ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ విశిష్టతపై అధికారులను, అర్చకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జ్యోతి సిద్ధేశ్వర క్షేత్రానికి పూర్వ వైభవం తీసుకురావడానికి త్వరలో శ్రీశైలం దేవస్థానం పాలకమండలి సమావేశంలో ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక తీర్మానం చేయనున్నట్లు వెల్లడించారు. పెన్నా నది తీరంలో ఉన్న ఈ ప్రాచీన పుణ్యక్షేత్రం, సిద్ధవటం ప్రాంతంలోని చారిత్రక కట్టడాలు, శిల్ప సంపద రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, భక్తులు సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి చైర్మన్ రమేష్ నాయుడిని శాలువాతో సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ కుమార్, ఆలయ ఈవో మురళి, బీజేపీ, టీడీపీ నాయకులు, ఆలయ అర్చకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## తిరుమల పాదయాత్రకు సంఘీభావం తెలిపిన పుత్తా రామచంద్రయ్య



ప్రజాభూమి, సిద్ధవటం: కమలాపురం పెద్దచెప్పలి ఎల్లమ్మ తల్లి దేవస్థానం నుంచి తిరుమల శ్రీవారి దర్శనార్థం పాదయాత్రగా బయలుదేరిన టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి, చెప్పలి ఎల్లమ్మ తల్లి దేవస్థానం మాజీ చైర్మన్ శీలం ప్రభాకర్ రెడ్డికి భాకరాపేట సమీపంలో టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంట్ టీడీపీ మాజీ ఉపాధ్యక్షులు పుత్తా రామచంద్రయ్య, పుత్తా సోదరులు, నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి కడితం రామమోహన్ నాయుడు ఆధ్వర్యంలో శీలం ప్రభాకర్ రెడ్డికి శాలువా కప్పి సత్కరించారు. పాదయాత్ర విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ, పాదయాత్రలో పాల్గొన్న భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులు లభించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పుత్తా బాలయ్య, పుత్తా ఎల్లయ్య, పుత్తా గణపతి, మోతకట్ల నరసింహారెడ్డి, సిద్ధవటం టీడీపీ మాజీ యూనిట్ ఇన్‌చార్జి పుత్తా శివానందతో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## సిద్ధవటంలో 'బేటీ బచావో--బేటీ పడావో'పై అవగాహన కార్యక్రమం



ప్రజాభూమి, సిద్ధవటం: కడప ఐసీడీఎస్ అర్బన్ ఇన్‌చార్జి సీడీపీవో సుగుణ ఆధ్వర్యంలో స్థానిక బెటాలియన్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం 'బేటీ బచావో--బేటీ పడావో' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికల సంరక్షణ, విద్య, సాధికారతపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో సుగుణ మాట్లాడుతూ, బాలికల విద్యాభివృద్ధి కుటుంబంతో పాటు సమాజ ప్రగతికి దోహదపడుతుందని పేర్కొన్నారు. బాలికలపై వివక్షను నిర్మూలించి సమాన అవకాశాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, బాలికల అక్రమ రవాణా, మధ్యలోనే చదువు మానివేయడం వంటి ఘటనలు ఎదురైతే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్--1098కు సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు తమ హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకొని ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పోతుల వీరయ్య, అంగన్వాడీ సూపర్వైజర్లు శ్రీవిద్య, దీప, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యకు 24 గంటల్లోనే స్పందించిన బీటెక్ రవి

### నల్లపురెడ్డిపల్లి స్కూల్‌లో బోరు తవ్వకం ప్రారంభం

ప్రజాభూమి,పులివెందుల

విద్యార్థుల సమస్యకు 24 గంటల్లోనే పరిష్కారం చూపించారు పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి. నల్లపురెడ్డిపల్లె జడ్పీ హైస్కూల్‌లో గురువారం జరిగిన మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ సందర్భంగా విద్యార్థులు తాగునీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వేసవిలో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతు న్నామని, పాఠశాలలో కొత్త బోర్‌వెల్ ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థుల విజ్ఞప్తికి వెంటనే స్పందించిన బీటెక్ రవి తన సొంత నిధులతో బోరుబావి వేయించాలని ఆదేశించారు. ఆదేశాలు జారీ చేసిన 24 గంటలు కూడా గడవకముందే బోరు బండి పాఠశాలకు చేరుకుని తవ్వకం పనులు ప్రారంభిం చింది. ఇన్ని రోజులుగా ఉన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో తక్షణం స్పందించిన బీటెక్ రవికి తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లపురెడ్డిపల్లె టీడీపీ నాయకులు యోగానంద రెడ్డి, కొత్తపల్లి ఈశ్వర్ రెడ్డి, బాబురెడ్డి, జయరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 8
ఆదివారం 26 జూలై 2026

## చెన్నూరు పీహెచ్సీని తనిఖీ చేసిన డిఎంహెచ్ఓ




ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,
చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ సుజాత చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఉద్యోగుల హాజరు పట్టిక ఓపి మరియు ఐపి సిబ్బంది పనితీరు సిబ్బంది హాస్పిటల్కు వచ్చు సమయాలు మరియు రికార్డులు పరిశీలించి ప్రశంసించారు. ఇంకా పేదవారికి మంచి ఆరోగ్యాన్ని అందించాలని ఆమె ఉద్యోగ లను ఆదేశించారు. ఫీల్డ్ లో పనిచేస్తున్న ఏఎన్ఎంలు హెల్త్ అసిస్టెంట్లు ఎం ఎల్ హెచ్ పి లు పనితీరు డాక్టర్ లీలా కృష్ణ మరియు సల్మా ను అడిగి తెలుసుకున్నారు. వారి టార్గెట్లు సకాలంలో పూర్తి చేయాలని డాక్టర్ ఆదేశించారు. మరియు కచ్చితంగా పని వేళలు పాటించాలని డాక్టర్ ద్వారా వారికి తెలపాలని ఆమె కోరారు మరియు హాస్పిటల్ సీనియర్ అసిస్టెంట్ శేఖర్ రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు ఈ కార్యక్రమంలో డి ఎం హెచ్ ఓ గారి వెంట సిసి రామకృష్ణారెడ్డి చెన్నూర్ ఎం పి హెచ్ ఎస్ మస్తానయ్య సిహెచ్ సంపూర్ణమ్మ పిహెచ్ఎన్ కత్తి అరుణ సీనియర్ అసిస్టెంట్ శేఖర్ తత్తర్లు ఉన్నారు

## నిఖిల్ కుమార్ రెడ్డి మృతికి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి నివాళి..!



ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:
చంద్రగిరి మండలం కొత్తశానంబట్ల గ్రామానికి చెందిన నిఖిల్ కుమార్ రెడ్డి ఆకస్మిక మృతి పట్ల చంద్రగిరి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. శనివారం ఆయన కొత్తశానంబట్ల గ్రామానికి వెళ్లి నిఖిల్ కుమార్ రెడ్డి పార్థివ దేహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు.హౌఅనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి,హౌఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని దేవుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.హౌనివాళులు అర్పించిన వారిలో చెవిరెడ్డి మోహిత్ రెడ్డితో పాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,హౌ గ్రామస్తులు వున్నారు.

## రైఫిల్ షూటింగ్ లో గోల్డ్ మెడల్ సాధించిన దువ్వూరు మనస్వి




ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,
చిల్లకూరు మండలం కృష్ణపట్నం అదాని ఫౌండేషన్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న కోట మండలం దొరువుకట్ట గ్రామానికి చెందిన దువ్వూరు మనస్వి కేరళ రాష్ట్రంలోని తిరుచ్చిలో జరుగుతున్న అండర్ 14 రైఫిల్ షూటింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి పాఠశాలకు ఘర్వకారణంగా నిలిచింది.అలాగే జాతీయస్థాయిలో జరగనున్న రైఫిల్ షూటింగ్ కు ఎంపిక అవడంతో అక్కడి కేరళ ప్రభుత్వం మరియు ఎయిర్ రైఫిల్డఎయిర్ పిస్టోల్ గేమ్స్ అథారిటీ మనస్వికి గోల్డ్ మెడల్ అందజేసి అభినందించారు.

## చంద్రగిరి నియోజకవర్గంలో 2.63 లక్షల ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ..!

**ప్రత్యేక ఓటరు జాబితా నవరణలో 50,273 మంది డిలీషన్ కేటగిరీలోకి..**

ప్రజా భూమి ప్రతినిధి చంద్రగిరి:
భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 166-చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతంగా పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. జూన్ 15 నుంచి జూలై 24 వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను ధృవీకరించి ఎన్యుమరేషన్ ఫారాలను సేకరించారు. నియోజకవర్గంలో మొత్తం 3,13,795 మంది ఓటర్లలో 2,63,522 మంది నుంచి ఎన్యుమరేషన్ ఫారాలు సేకరించినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా 7,598 మంది మరణించినవారు, 16,738 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు, 6,246 మంది డూప్లికేట్ ఓటర్లు, 19,309 మంది ఇంటి వద్ద అందుబాటులో లేని వారు, 382 మంది ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని వారుగా గుర్తించినట్లు తెలిపారు. దీంతో మొత్తం 50,273 మంది డిలీషన్ కేటగిరీలోకి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. మండలాల వారీగా పరిశీలిస్తే, తిరుపతి గ్రామీణ మండలంలో అత్యధికంగా 29,130 మంది, తిరుపతి అర్బన్ మండలంలో 6,705 మంది, చంద్రగిరి మండలంలో 5,198 మంది, పాకాల మండలంలో 3,802 మంది, రామచంద్రపురం మండలంలో 2,162 మంది, ఎర్ర వారి పాలెం మండలంలో 1,961 మంది, చిన్న గోట్టిగల్లు మండలంలో 1,315 మంది డిలీషన్ కేటగిరీలో ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ద్వారా ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించే లక్ష్యంతో ఈ ప్రక్రియ చేపట్టినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రజాస్వామిక శక్తుల విజయం - కందారపు మురళి



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
కేంద్ర విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రజాస్వామిక శక్తుల విజయమని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి అభివర్ణించారు. శనివారం ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అప్రజాస్వామిక వైఖరికి పరాకాష్ట నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారం అని, ఇందులో విద్యార్థి సంఘాలు, విద్యార్థులు నిర్వహించిన పోరాటం దేశంలో సరికొత్త మార్పుకు నాంది పలికిందని పేర్కొన్నారు. ఎలాంటి అక్రమాలకు పాల్పడినా తమను ప్రశ్నించేవారు ఎవరూ లేరన్న ధీమాతో ఉన్న బిజెపికి, కాక్రోచ్ జనతా పార్టీ ఇచ్చిన షాక్ మామూలు షాక్ కాదని కందారపు మురళి ఆ ప్రకటనలో పేర్కొన్నారు. సగటు భారతీయ విద్యార్థుల ఆకాంక్షలు ఏమిటో ఈ ఉద్యమం ద్వారా వెల్లడి అయిందని, కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తన దుర్మార్గపు విధానాలు విడనాడి భారత దేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన చేయాలని, ధరల తగ్గింపుకు పూనుకోవాలని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలుకు కృషి చేయాలని కందారపు మురళి ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు సాగించిన అపూర్వ పోరాట ఘట్టాన్ని ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

## ఆరోగ్యకరమైన పదార్థాలను విక్రయించకుంటే కఠినచర్యలు -హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్





ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
తిరుపతి నగరంలో ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు విక్రయించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ హెచ్చరించారు. శనివారం తిరుపతి నగరంలోని వివిధ ప్రదేశాలలో గల క్విక్ కామర్స్, డార్క్ స్టోర్స్ తదితరాల్లో ప్రజావినియోగానికి సరఫరా చేయు ఆహార పదార్థాల నిలువచేయు స్టోర్లను వెటర్నరీ ఆఫీసర్, తదితరులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారి, కమిషనర్ ఆదేశాల మేరకు ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు అందుతున్నందున వైకుంఠపురం రోడ్డులోని బ్లింక్ ఇట్, కరకంబాడి రోడ్డు భూపాల్ హౌసింగ్ కాలనీ నందుగల బ్లింక్ ఇట్, క్విక్ కామర్స్, డార్క్ స్టోర్ ను, తిరుమల బైపాస్ రోడ్డు ప్రక్కన గల ఇన్ స్టా మార్ట్, క్విక్ కామర్స్ డార్క్ స్టోర్, ఆర్. సి. రోడ్డు, అవిలాల వద్ద గల ఇన్ స్టా మార్ట్ కామర్స్ డార్క్ స్టోర్ ను మరియు ఇతర గ్రాసరీ షాపులను తనిఖీ చేశామని తెలిపారు. ఇందులో భూపాల్ హౌసింగ్ కాలనీ వద్ద గల బ్లింకిట్ కామర్స్, డార్క్ స్టోర్ పరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహిస్తున్నారని తెలిపారు. వైకుంఠపురం రోడ్డు నందు గల స్టోర్ అపరిశుభ్రమైన వాతావరణంలో కుళ్ళిపోయిన, చెడిపోయిన కూరగాయలు ఉండడాన్ని గుర్తించామని తెలిపారు. ఇందులో ప్రజా వినియోగానికి మంచిగా ఉన్న కూరగాయలతో పాటుగా స్టోర్ చేసి క్రాస్ కంటామినేషన్ అయ్యే విదంగా ఉన్నాయని తెలిపారు. చెత్తాచెదారంతో స్టోర్ లోపల, బయట అపరిశుభ్రంగా ఉందని తెలిపారు. రెండు ఇంస్టా మార్ట్, కామర్స్ డార్క్ స్టోర్స్ నందు ఎక్కువ శాతం లో గడువు ముగిసిన ఆహార పదార్థాలను ప్రజల వినియోగార్థం నిలువ ఉంచి వ్యాపారం చేయడాన్ని గుర్తించామని తెలిపారు. ఇందులో అనేక రకాల గ్రాసరి, బ్రెడ్ పాకెట్స్, మిల్క్ ప్రొడక్ట్స్, వాటర్ బాటిల్స్, ఫ్రూట్ జ్యుస్, టేట్రా ప్యాకింగ్ జ్యుస్ పాకెట్స్,చేపలు మొదలైన పదార్థాలను మామూలుగా అమ్మే పదార్థాలతో కలిపి ఉంచారని, దీనివలన గడువు ముగిసిన ఆహార పదార్థాలను మంచి ఆహార పదార్థాలతో పాటుగా కలిపి నిలువ చేసి వ్యాపారం చేయడం వలన క్రాస్ కంటామినేషన్ జరిగి మంచి పదార్థాలు కూడా పాడవడానికి తద్వారా ప్రజారోగ్యానికి భంగం కలగడానికి అవకాశం ఉందని తెలిపారు. గడువు ముగిసిన పదార్థాలను తొలగించి దాదాపు 600 కిలోల సరుకును స్వాధీనం చేసుకుని స్టోర్స్ వారి ముందే నాశనం చేశామని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానాలు విధించామని తెలిపారు. ఇకపై మంచి స్టాకును మాత్రమే నిర్ణీత గడువు లోపలలోనే ప్రజల వినియోగార్థం ఉంచాలని గడువు ముగిసిన ఆహార పదార్థాలను వెంటనే తొలగించాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలను మాత్రమే అమ్మకం నకు వినియోగించాలని లేనిచో ట్రేడ్ లైసెన్స్ రద్దుచేసి నగరపాలక సంస్థ లోని చట్టముల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో వెటర్నరీ ఆఫీసర్ గుణ శేఖర్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థి-యువత హక్కుల కోసం జూలై 28న పోరాట ర్యాలీ

**-డీఎస్సీ అక్రమాలు, నీట్ పేపర్ లీకేజీ, ఫీజు రీయింబర్స్మెంట్ వైఫల్యాలపై నిరసన**

**-తుమ్మలగుంటలో పోస్టర్ ఆవిష్కరించిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి**



ప్రజాభూమి ప్రతినిధి, తిరుపతి రూరల్
రాష్ట్రంలో విద్యార్థులు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై జూలై 28న జిల్లా ప్రధాన కేంద్రాల్లో నిర్వహించే విద్యార్థి--యువత ర్యాలీని విజయవంతం చేయాలని చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పిలుపునిచ్చారు. డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలు, నీట్ పరీక్ష పేపర్ లీకేజీ, ఫీజు రీయింబర్స్మెంట్ అమలులో వైఫల్యం, నిరుద్యోగ భృతి ఇవ్వకపోవడం వంటి అంశాలపై విద్యార్థులు, యువత తమ గళాన్ని వినిపించాల్సిన సమయం వచ్చిందన్నారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని పార్టీ కార్యాలయంలో శనివారం రాష్ట్ర వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్ రెడ్డితో కలిసి ర్యాలీ పోస్టర్ను చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను విస్మరించిందని విమర్శించారు. ఉద్యోగాల కల్పన, ఫీజు రీయింబర్స్మెంట్, నిరుద్యోగ భృతి వంటి కీలక అంశాల్లో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. విద్యార్థులు, యువత సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లే వేదికగా ఈ ర్యాలీ నిలుస్తుందని పేర్కొన్నారు. చంద్రగిరి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు, నిరుద్యోగ యువత స్వచ్ఛందంగా పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన పిలుపు ఇచ్చారు. విద్యార్థుల భవిష్యత్తు, యువత హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. రాష్ట్ర వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు, నిరుద్యోగ యువత ఆవేదనను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడమే ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడే పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు దామినేటి కేశవులు, చిన్నియాదవ్తో పాటు వైఎస్సార్సీపీ విద్యార్థి, యువజన విభాగం నాయకులు ఓబుల్రెడ్డి, శశిధర్రెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్రెడ్డి, సాయిరాయల్, భానుప్రకాశ్రెడ్డి, నరేష్కుమార్, యశ్వంత్రెడ్డి, వినోద్కుమార్, గూడూరు రఫి, శేషారెడ్డి, నక్కా హరినాథ్, ప్రదీప్కుమార్, నవీన్కుమార్రెడ్డి, శెంథిల్కుమార్, అవిలాల శివ, మునిరెడ్డి, తనూజ్కుమార్, రామ్తేజ, లోకేష్రెడ్డి, శంకర్, మనోహర్, ఎ.నాధముని, ఇ.నాధముని, మధు, వినయ్రెడ్డిలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ అధికారుల పనితీరు మార్చుకోవాలి -ఎమ్మెల్యే సునీల్ కుమార్




ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,
గూడూరు నియోజకవర్గంలో రెవెన్యూ పోలీసు శాఖ పనితీరు కొంత ఇబ్బందికరంగా ఉందని దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా గూడూరు నియోజకవర్గానికి బి గ్రేడ్ వచ్చిందని అధికారులు ప్రజాప్రతినిధులు కలిసి ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చి నియోజకవర్గానికి ఎ గ్రేడ్ గుర్తింపు తీసుకురావాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు . గూడూరు పట్టణంలోనే నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లానింగ్ యూనిట్ కార్యాలయంలో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆర్టీవో అరుణ కుమారి నియోజ కవర్గంలోని అన్ని మండలాల పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు శాఖల వారీగా పెండింగులో ఉన్న సమస్యలు పూర్తయిన పనులు వాటిపై చర్చించారు ఎమ్మెల్యే అధికారులకు పలు సూచనలు తెలియజేశారు ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ నియోజక వర్గంలో కొన్ని శాఖల అధికారుల పనితీరు బాగాలే దని దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గానికి ర్యాంకు తగ్గుతూ వస్తుందని అన్నారు అధికారులు సక్రమంగా పనిచేసే ప్రజా సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి అప్పుడే మంచి పేరు వస్తుందని అన్నారు ప్రధానంగా రెవిన్యూ పోలీసు శాఖలో అనేక ఫిర్యాదులు వస్తున్నాయని అధికారులు తమ సమస్యలపై కార్యాలయానికి వచ్చే ప్రజలను పలుమార్లు తిప్పుకోకుండా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు ప్రజా ప్రతినిధులు అధికారులు కలిసి బాగా పనిచేసి నియోజకవర్గానికి మంచి గుర్తింపు తీసుకురావాలని అన్నారు ఈ సమావేశంలో వలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల విజయం ప్రజాస్వామ్యానికి చారిత్రాత్మక విజయం

- **వంగని విద్యార్థి సంకల్పం.... గెలిచిన న్యాయం**
- **ప్రశ్నించిన యువత గెలిచింది ప్రజాస్వామ్యం నిలిచింది....**
- **కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా మైనారిటీ అధ్యక్షులు షేక్ నాయకుల ఫయాజ్**



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,
కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నేపథ్యంలో, దేశవ్యాప్తంగా పరీక్షల వ్యవస్థలో పారదర్శకత కోసం, విద్యార్థుల న్యాయం కోసం శాంతియుతంగా పోరాడిన ప్రతి విద్యార్థికి నా హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు. ఈ ఉద్యమంలో ధైర్యంగా స్వరం వినిపించిన విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సామాజిక సంస్థలు, ప్రజాస్వామ్యవాదులు, అలాగే ప్రతి దశలో విద్యార్థులకు అండగా నిలిచిన వారి తల్లిదండ్రులకు ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు. ఈ పోరాటానికి బలమైన రాజకీయ మద్దతు అందిస్తూ, పార్లమెంట్ నుంచి ప్రజా ఉద్యమాల వరకు విద్యార్థుల తరఫున నిరంతరం గళమెత్తిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముఖ్యంగా శ్రీ రాహుల్ గాంధీ గారికి, కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వానికి, దేశవ్యాప్తంగా ఉద్యమించిన కాంగ్రెస్ కార్యకర్తలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు.ఇది ఎవరి ఓటమి కాదు... న్యాయం సాధించిన విద్యార్థుల విజయం.ఇది ఎవరి రాజకీయ గెలుపు కాదు... ప్రజాస్వామ్యం సాధించిన విజయం. ఇకపై కూడా పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత, పేపర్ లీక్లకు శాశ్వత అడ్డుకట్ట, బాధ్యులపై కఠిన చర్యలు, విద్యార్థుల భవిష్యత్తును రక్షించే సమగ్ర సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని మేము డిమాండ్ చేస్తున్నాం. "విద్యార్థి స్వరం వినిపిస్తే ప్రజాస్వామ్యం బలపడుతుంది." "ప్రశ్నించిన యువతే దేశ భవిష్యత్తును కాపాడుతుంది." "న్యాయం కోసం పోరాటం ఎప్పుడూ వృథా కాదు." కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా మైనారిటీ అధ్యక్షులు షేక్ నాయకుల ఫయాజ్.


## 31న జరగనున్న బీజేపీ

**ఎస్ ఐ ఆర్ వర్క్ షాప్... హాజరు కానున్న జాతీయ నేతలు**



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్
శ్రీకాళహస్తి నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఎస్ ఐ ఆర్ వర్క్ షాప్ కు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ వర్క్ షాప్ కి ముఖ్యాతిధులుగా బీజేపీ నేషనల్ సెక్రటరీ మరియు సార్ స్టేట్ అబ్జర్వర్ రితురాజ్ సిన్హా, తిరుపతి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి, ఎస్ ఐ ఆర్ స్టేట్ కన్వీనర్ నాగోతు రమేష్ నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షులు, సార్ అసెంబ్లీ కన్వీనర్ కోలా ఆనంద్, తిరుపతి జిల్లా పార్టీ ఇంచార్జి పులి వెంకట కృష్ణారెడ్డి ముఖ్యాతిధులుగా పాల్గొన్నారు. శ్రీకాళహస్తి అసెంబ్లీ పరిధిలోని మొత్తం 294 పోలింగ్ బూతుల బిఎల్ఎ -2 కార్యకర్తలు తప్పనిసరిగా ఈ వర్క్ షాప్ కు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకత్వం కోరింది. అలాగే మండల అధ్యక్షులు, ఇంచార్జిలు, ముఖ్య నాయకులు సమన్వయం చేసుకుని 294 మంది బిఎల్ఎ -2 కార్యకర్తల హాజరును నిర్ధారించాలని ప్రత్యకంగా వారికీ సూచించారు. ఈ వర్క్ షాప్ లో పార్టీ సంస్థాగత బలోపేతం, ఎస్ ఐ ఆర్ కార్యక్రమాలు అమలు, బూత్ స్థాయి కార్యాచరణపై మార్గదర్శకాలు ఇవ్వడం జరుగుతుందని పార్టీ నాయకులు తెలిపారు. కార్యక్రమాలు అమలు, బూత్ స్థాయి కార్యాచరణపై మార్గదర్శకాలు ఇవ్వడం జరుగుతుందని పార్టీ నాయకులు తెలిపారు. అసెంబ్లీ కన్వీనర్ కోలా ఆనంద్, తిరుపతి జిల్లా పార్టీ ఇంచార్జి పులి వెంకట కృష్ణారెడ్డి ముఖ్యాతిధులుగా పాల్గొన్నారు. శ్రీకాళహస్తి అసెంబ్లీ పరిధిలోని మొత్తం 294 పోలింగ్ బూతుల బిఎల్ఎ -2 కార్యకర్తలు తప్పనిసరిగా ఈ వర్క్ షాప్ కు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకత్వం కోరింది. అలాగే మండల అధ్యక్షులు, ఇంచార్జిలు, ముఖ్య నాయకులు సమన్వయం చేసుకుని 294 మంది బిఎల్ఎ -2 కార్యకర్తల హాజరును నిర్ధారించాలని ప్రత్యకంగా వారికీ సూచించారు. ఈ వర్క్ షాప్ లో పార్టీ సంస్థాగత బలోపేతం, సార్ కార్యక్రమాలు అమలు, బూత్ స్థాయి కార్యాచరణపై మార్గదర్శకాలు ఇవ్వడం జరుగుతుందని పార్టీ నాయకులు తెలిపారు.

## బాలయ్య బాబు త్వరగా కోలుకోవాలని తొలి ఏకాదశి వేళ ప్రత్యేక పూజలు



ప్రజాభూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ
తిరుపతి జిల్లా బి ఎన్ కండ్రిగ మండలంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బుచ్చినాయుడు కండ్రిగ గ్రామంలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల షూటింగ్ సమయంలో కాలికి గాయపడి శస్త్రచికిత్స చేయించుకున్న బాలకృష్ణ ఆరోగ్యంగా కోలుకోవాలని మాజీ మండల అధ్యక్షుడు ఎం. సుధాకర్ నాయుడు, సముద్రాల శేఖర్ నాయుడు ఆధ్వర్యంలో నందమూరి అభిమానులు స్వామివారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా బాలయ్య బాబు త్వరగా కోలుకుని ప్రజాసేవతో పాటు సినీ సేవను మరింత విజయవంతంగా కొనసాగించాలని ఆకాంక్షించారుఅలాగే ఆయన పూర్తిగా కోలుకున్న అనంతరం కాలినడకన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకుంటామని అభిమానులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు ఎం. సుధాకర్ నాయుడు, సముద్రాల శేఖర్ నాయుడు, నందమూరి అభిమానులు, యువత, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏకాదశి పర్వదినం । పూర్వ విద్యార్థుల సమ్మేళనం

## వ్యాసాశ్రమం, :ఏర్పేడు -వ్యాసాశ్రమం - శతాబ్ద సేవలకు సమగ్ర ఆడిట్ అవసరం: జనసేన నాయకులు దండి నరేంద్ర

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు

నిలిచిపోయిన సేవలను పునరుద్ధరించి శ్రీ మలయాళ స్వామి ఆశయాలు, ఆశ్రమ పవిత్రతను శాశ్వతంగా పరిరక్షించాలి. పవిత్రమైన ఏకాదశి సందర్భంగా, పూజ్య శ్రీ శ్రీ శ్రీ మలయాళ స్వామి స్థాపించిన ఏర్పేడు వ్యాసాశ్రమాన్ని సందర్శించే అవకాశం లభించింది. సనాతన ధర్మ పరిరక్షణ, హిందూ సంస్కృతి వికాసం, పేద విద్యార్థులకు విద్య, అనాథలకు ఆశ్రయం, వృద్ధులకు సేవ, గోసంరక్షణ, మానవతా విలువల ప్రచారం వంటి అనేక విశిష్ట సేవల ద్వారా ఈ ఆశ్రమం గత 100 సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా ఆదర్శప్రాయమైన సేవలను అందించింది. అయితే, ఒకప్పుడు మహోన్నతంగా కొనసాగిన పలు సేవా కార్యక్రమాలు ప్రస్తుతం ఆశించిన స్థాయిలో కనిపించకపోవడం బాధాకరం. ఈ పరిస్థితి ఆశ్రమ పవిత్రత, వారసత్వం, వ్యవస్థాపకుల మహోన్నత ఆశయాలపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలకు పారదర్శకంగా సమాధానాలు ఇవ్వాల్సిన ముఖ్యమైన అంశాలు: దేశవ్యాప్తంగా ఆశ్రమానికి చెందిన అన్ని స్థిరాస్తుల పూర్తి వివరాలు, వాటి ప్రస్తుత మార్కెట్ విలువ, నిర్వహణ స్థితి. ఆశ్రమ భూములపై ఏవైనా ఆక్రమణలు జరిగి ఉంటే వాటి వివరాలు, బాధ్యులపై తీసుకున్న చర్యలు, భూముల పునరుద్ధరణకు చేపట్టిన ప్రక్రియ. కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన భవనాలు, మౌలిక వసతులు ప్రస్తుతం ఎందుకు వినియోగంలో లేవు? నిర్వహణ ఎందుకు లోపించింది? బాలుర విద్య, వేదపాఠశాల, బ్రహ్మవిద్యాశాల తదితర విద్యాసేవల ప్రస్తుత పరిస్థితి ఏమిటి? వృద్ధాశ్రమం, వానప్రస్థాశ్రమం, వృద్ధ సాధువులు--సన్యాసులకు ఆశ్రయం కల్పించే సేవలు ఎందుకు పరిమితమయ్యాయి?





గోశాల ప్రస్తుత పరిస్థితి, గోసంరక్షణ కార్యక్రమాల స్థితి ఏమిటి?

గతంలో ఉన్న సేవా వైభవంతో పోలిస్తే ప్రస్తుతం సేవల్లో ఈ మార్పుకు గల అసలు కారణాలు ఏమిటి? ఆశ్రమ నిర్వహణలో రాజకీయ జోక్యం ఉందనే ఆరోపణలు నిజమైతే వాటిని పూర్తిగా తొలగించి, పూజ్య శ్రీ మలయాళ స్వామి ఆశయాలకు కట్టుబడి ఉన్న ఆధ్యాత్మిక వారసులు, నిష్పక్షపాతంగా వ్యవహరించే సాధువులకే నిర్వహణ బాధ్యతలు అప్పగించేలా చర్యలు తీసుకోవాలి. ప్రజల్లో నెలకొన్న అనుమానాలు, ఆరోపణలను దృష్టిలో ఉంచుకుని, స్వతంత్ర నిపుణుల కమిటీతో సమగ్ర ఆడిట్ నిర్వహించి, వాస్తవాలను ప్రజలకు వెల్లడించడం అవసరం. అలాగే నిలిచిపోయిన సేవా కార్యక్రమాలను పునరుద్ధరించి, పూజ్య శ్రీ మలయాళ స్వామి మహోన్నత ఆశయాలు, వ్యాసాశ్రమ పవిత్రత, సేవా సంప్రదాయాన్ని శాశ్వతంగా పరిరక్షించే దిశగా చర్యలు చేపట్టాలి. కార్యక్రమంలో నాతో పాటు జనసేన సీనియర్ నాయకులు, శ్రీ కాళహస్తి టెంపుల్ బోర్డు సభ్యులు దండి రాఘవయ్య, బొక్కిసం వెంకట్రామయ్య, జయ శంకర్, దివాకర్, రాఘవ , జనసైనికులు పాల్గొన్నారు.

# పెళ్లకూరు మండలం రోసనూరు (రాజుపాలెం)లో 104 మెడికల్ క్యాంపులో సిబ్బంది గైర్హాజరు.. గ్రామస్తుల ఆగ్రహం

ప్రజా భూమి ప్రతినిధి పెళ్లకూరు

తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం రోసనూరు (రాజుపాలెం) గ్రామంలో నిర్వహించిన 104 మెడికల్ క్యాంపులో వైద్య సేవలు అందకపోవడంతో గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. క్యాంపు కోసం 104 వైద్య వాహనం గ్రామానికి వచ్చినప్పటికీ, ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన మెడికల్ ఆఫీసర్-2 అందుబాటులో లేకపోవడం వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిపారు. గ్రామస్తుల కథనం ప్రకారం, సంబంధిత మెడికల్ అధికారి ఉదయం క్యాంపుకు వచ్చి హాజరు నమోదు చేసి, కేవలం అరగంట మాత్రమే ఉండి వెళ్లిపోయారని ఆరోపించారు. అనంతరం సాయంత్రం 4:10 గంటలు దాటినా ఆయన తిరిగి క్యాంపుకు రాకపోవడంతో వైద్యం కోసం వచ్చిన ప్రజలు నిరాశతో వెనుదిరగాల్సి వచ్చిందని వాపోయారు. గ్రామంలో ఎప్పుడు 104 మెడికల్ క్యాంపు నిర్వహించినా ఇదే పరిస్థితి నెలకొంటోందని, వాహనం మాత్రమే వస్తుందని, కానీ వైద్య అధికారులు, సిబ్బంది పూర్తి సమయం అందుబాటులో ఉండరని గ్రామస్తులు ఆరోపించారు. ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన 104 సేవలు క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తిరుపతి జిల్లాలోని



ఇతర మండలాల్లో కూడా ఇదే పరిస్థితి ఉందా? 104 మెడికల్ క్యాంపుల్లో వైద్య అధికారులు పూర్తి సమయం విధులు నిర్వర్తించడం లేదా? అనే ప్రశ్నలు స్థానిక ప్రజలు లేవనెత్తుతున్నారు. ఈ ఘటనపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విచారణ చేపట్టి, విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించిన సంబంధిత మెడికల్ అధికారులపై తగిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని రోసనూరు (రాజుపాలెం) గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే ఇకపై 104 మెడికల్ క్యాంపుల్లో వైద్యులు, సిబ్బంది పూర్తి సమయం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

# శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో వైభవంగా కవచ ప్రతిష్ఠ

### జ్యేష్ఠాభిషేకాల్లో రెండో రోజు శాస్త్రోక్తంగా విశేష పూజలు

### భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తిన తిరుచ్చి ఉత్సవం

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి

తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో జరుగుతున్న వార్షిక జ్యేష్ఠాభిషేక మహోత్సవాల్లో రెండో రోజు శనివారం కవచ ప్రతిష్ఠా మహోత్సవం అత్యంత వైభవంగా, వేదఘోషలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం శతకలశ స్నపనం,





మహాశాంతి హోమం వైదిక పద్ధతిలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీరు, పసుపు, చందనంతో అభిషేకాలు జరిపి విశేషారాధనలు సమర్పించారు. తదనంతరం ప్రత్యేక పూజల అనంతరం కవచ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామివారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు దివ్య దర్శనం ప్రసాదించారు. స్వామివారి దర్శనార్థం తరలివచ్చిన భక్తులు "గోవింద... గోవింద..." నామస్మరణతో ఆధ్యాత్మిక ఆనందాన్ని ఆస్వాదించారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో ఎ.బి. నారాయణ చౌదరి, సూపరింటెండెంట్లు శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయులు, ఆలయ అర్చకులు, అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# తిరుపతిలో ప్రజాభిమాని దినపత్రిక కార్యాలయం ప్రారంభం

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్

తిరుపతిలో ప్రజాభిమాని దినపత్రిక నూతన కార్యాలయాన్ని జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారి పి. గురుస్వామి శెట్టి శుభప్రారంభం చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు నిష్పాక్షికమైన, విశ్వసనీయమైన సమాచారాన్ని అందించడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. సమాజ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యతను మీడియా సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రజాభిమాని దినపత్రిక మరింత అభివృద్ధి చెందుతూ ప్రజల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. ప్రజాభిమాని దినపత్రిక సంపాదకులు ఎన్. వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు నిష్పాక్షిక వార్తలకు ప్రాధాన్యత ఇస్తూ దినపత్రికను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్, ప్రజాభిమాని జిల్లా రిపోర్టర్ లోకేష్, శ్రీనిలయం శ్రీనివాస్, జర్నలిస్టులు బుజ్జిబాబు, భానుప్రియ, మహేష్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొని నూతన కార్యాలయ ప్రారంభోత్సవానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు పాత్రికేయులు, ఆహ్వానితులు పాల్గొన్నారు.




# పెంచలకోన క్షేత్రంలో తొలి ఏకాదశి పూజలు

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

రాపూరు మండలం... ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం పెంచలకోనలో తొలి ఏకాదశి వేడుకలు అత్యంత వైభవంగా, కన్నులపండువగా జరుగుతున్నాయి! శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రం... 'గోవిందా.. నరసింహా..' అనే భక్తజన నామస్మరణతో, హరినామ స్మరణతో మారుమోగిపోతోంది. పవిత్రమైన ఈ శయన ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ పెంచల లక్ష్మీనరసింహస్వామివారికి, అమ్మవార్లకు ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ విశేష అభిషేకాలు, దివ్యాంబరాల అలంకరణలు నిర్వహించారు. ?రకరకాల అరుదైన సుగంధ పరిమళ పుష్పాలతో స్వామి, అమ్మవార్లను గాజుల, పూల అలంకరణలో దివ్యమంగళ రూపంలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ దివ్య రూపాన్ని తిలకించిన భక్తులు మైమరచిపోతున్నారు. ఇక పవిత్ర పర్వదినం సందర్భంగా ఆలయ ఈవో కోవూరు జనార్దన్ రెడ్డి భక్తులకు ఎలాంటి లోటూ రాకుండా సకల ఏర్పాట్లు పక్కాగా చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాదిమంది భక్తజనానికి ప్రత్యేక క్యూలైన్లు, మంచినీటి వసతి, అన్నప్రసాద వితరణ సౌకర్యాలను అత్యంత శ్రద్ధతో ఏర్పాటు చేశారు. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తజనంతో పెంచలకోన గిరులు భక్తిపారవశ్యంలో మునిగితేలుతున్నాయి! కొండల నడుమ ప్రకృతి ఒడిలో కాసుల పెంచలయ్య నామస్మరణ ఆధ్యాత్మిక ఉత్తేజాన్ని నింపుతోంది!"



# జీ.ఓ నెం.396 రద్దు పరిచే వరకు మా పోరాటం కొనసాగిస్తాం: అధ్యక్షుడు మురళి..!

### పాకాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా నిరసన తెలియజేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు..

### జీవో రద్దు పరచకపోతే మాకు చావే శరణ్యం: సెక్రటరీ వెంకట ముని..


ప్రజా భూమి ప్రతినిధి, పాకాల:

తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండలం, పాకాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట జీవో నెం.396 ను రద్దు చేయాలని శనివారం డాక్యుమెంట్ రైటర్ల,స్టాంప్ వెండర్ల,టైపిస్టులు నిరసన కార్యక్రమం 6వ రోజు కొనసాగించారు. ప్రభుత్వం తెచ్చిన జీ.ఓ నెం.396 వల్ల ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని,ఈ జీ.ఓ రద్దు పరిచే వరకు మా పోరాటం కొనసాగిస్తాం మని పాకాల దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మురళి పేర్కొన్నారు. ఈ వృత్తినే నమ్ముకున్న మా కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నారని, ప్రభుత్వం జీవో రద్దు పరచకపోతే మా కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని,మాకు చావే శరణ్యం అని పాకాల దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం సెక్రటరీ వెంకట ముని ఆవేదన వ్యక్తం చేశారు. దయవుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని



సత్యప్రసాద్,చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని'లు చొరవ చూపి జీ.వో 396ని రద్దుపరిచి, డాక్యుమెంట్ రైటర్ల వృత్తికి చట్టబద్ధత కల్పించి, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలోజాయింట్ సెక్రెటరీ యశ్వంత్ కుమార్,ఉపాధ్యక్షుడు అన్సర్,డాక్యుమెంట్ రైటర్లు మదన్ మోహన్, కె.రెడ్డిహరీష, పూజిత, రాంబాబు, చంద్రబాబు, లత, విజయ్ కాంత్, బాలరెడ్డప్ప, బాలాజీ, హరి,శ్రీనివాసులు, తివేణి,రజిని, ధరణి,లత, మిధున్, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యాసామాగ్రి పంపిణీ




ప్రజా భూమి ప్రతినిధి శ్రీ కాళహస్తి.

శ్రీకాళహస్తి పట్టణం శ్రీరాంనగర్ కాలనీలో ప్రాథమిక పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలకలు పుస్తకాలు ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ప్రమీల మాట్లాడుతూ విద్యార్థుల విద్యా కొరకు తమ వంతు చేస్తున్నామని తెలిపారు సెక్రటరీ డాక్టర్ మ్యాగీ క్లారా మాట్లాడుతూ విద్యార్థులు విద్యుత్ తో పాటు ఆరోగ్య సూత్రాలు పాటించి సకాలంలో పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు ఉమా డాక్టర్ వెంకట్రామన్ చెంగారెడ్డి తరుణ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుర్రప్ప మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థుల కొరకు విద్యా సామాగ్రి పంపిణీ చేయడం ఎంతో అభినందనీయమని తెలిపారు.

# విజన్ యాక్షన్ ప్లాన్ పై ఎమ్మెల్యే సమీక్ష

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు



నియోజకవర్గం విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయంనందు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన.....డాక్టర్ శ్రీ పాశిం సునీల్ కుమార్ శాసన సభ్యులు మరియు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ.కూటమి ప్రభుత్వం ఏర్పడిన 2 సంవత్సరాలలో నియోజకవర్గం నందు జరిగిన అభివృద్ధి పై సమావేశం ఏర్పాటు చేసాం. 27 తేదీ నుండి కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి తెలిపే కార్యక్రమం ఉన్నదని అన్నారు. అధికారులతో డిపార్ట్మెంట్ వారీగా 2 సంవత్సరాలలో చేసిన అభివృద్ధి ని తెలుసుకుని ప్రజలనుండి వచ్చిన అర్జీల పరిష్కారించడంలో వారికి వచ్చిన ర్యాకింగ్ లను తెలిపారు. తక్కువ ర్యాంక్ వచ్చిన డిపార్ట్మెంట్ లు మెరుగైన స్థితికి రావాలని , మెరుగ్గా పనిచేస్తున్న డిపార్ట్మెంట్ వారికి శుభాకాంక్షలు తెలిపి ఇంకా మెరుగ్గా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. అధికారులను కోరుతున్న ఏదైనా సమస్యతో వచ్చిన అర్జీదారులను కూర్చోబెట్టి సమాధానాలు ఇవ్వండని సమస్య పరిష్కారం అయ్యే వాటికి అవుతుందని కానీ వాటిని పరిష్కరించలేమని తెలపండని అంతే గాని మీ కార్యాలయాల చుట్టూ తిప్పుకునే విధముగా చేయొద్దని కోరుతున్న అని అన్నారు

# పేట శాంతి పార్థివ దేహానికి నివాళులు అర్పించిన తలపా దామోదరం రెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి శ్రీ కాళహస్తి టౌన్



మీడియా మిత్రులు పేట శేఖర్ మాతృమూర్తి పేట శాంతి పార్థివ దేహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించిన శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, శ్రీకాళహస్తి మండలం అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, నాగరాజు,నిజాముద్దీన్, మహేష్, అరుణ్, చరణ్, మాస్ తదితరులు పాల్గొన్నారు.

# మురుగు కాలువలు లేక రోడ్డుపై పారుతున్న మురుగునీరు - ప్రజల ఆందోళన

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.



ఏర్పేడు మండలం మర్రి మంద దళిత వాడ మురుగు కాలువల నిర్మాణం లేకపోవడంతో రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తూ స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై నిల్వ ఉండే మురుగునీటి కారణంగా దుర్వాసన వ్యాపించడంతో పాటు దోమలు అధికంగా పెరిగి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు, మహిళలు ప్రతిరోజూ ఈ మురుగునీటిని దాటుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షం పడినప్పుడు సమస్య మరింత తీవ్రమై రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే మురుగు కాలువల నిర్మాణం చేపట్టి రోడ్డుపై పారుతున్న మురుగునీటిని తొలగించి ప్రజల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు ప్రభుత్వాన్ని, స్థానిక అధికారులను కోరుతున్నారు.



# మామండూరులో పద్మ మహిళా మండలి ఆధ్వర్యంలో నూతన తాగునీటి బోరు



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

రేణిగుంట మండలం మామండూరు లో శనివారం కడప జిల్లా ఖాజీపేట లోని పద్మ మహిళా మండలి ఆధ్వర్యంలో తాగునీటి బోరును వేశారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉండడంతో గ్రామస్తులు పద్మ మహిళా మండలి ప్రాజెక్ట్ ఆఫీసర్ జూలియన్ రాజు దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. శనివారం గ్రామంలో మహిళల ఆధ్వర్యంలో బోర్వెల్ కు ప్రత్యేక పూజలు చేసి నూతన బోరును వేశారు. ఈ సందర్భంగా జూలియన్ రాజు మాట్లాడుతూ మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో, గిరిజన కాలనీలో ప్రజల దాహార్తి ఇచ్చేందుకు తాగు నీటి బోర్లు వేసమని అన్నారు. గ్రామాల్లో తాగునీటి బోర్లు వేసేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్థురాలు రాజేశ్వరి మాట్లాడుతూ తాగునీటి సమస్యను జూలియన్ రాజు దృష్టికి తీసుకుని వెళ్తే ఆయన వెంటనే తమ సమస్యను గుర్తించి పద్మ మహిళా మండలి సహకారంతో గ్రామంలో బోరువేస్తున్నందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మామండూరు ఎకో టూరిజం ప్రాజెక్ట్ చైర్మన్ కుమారస్వామి ముదిరాజ్, అమ్ములు రాజు, గీతా, శ్యామల, మల్లీశ్వరి, దేవిక తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి బాలికల వసతి గృహంలో సౌకర్యాలపై ఆరా తీసిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్



శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి సందర్శించి విద్యార్థినులతో స్వయంగా మాట్లాడారు. కూటమి ప్రభుత్వం తరఫున విద్యార్థినులకు ఉచితంగా బ్లాంకెట్లు (దుప్పట్లు), షూస్ పంపిణీ చేశామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అనంతరం వసతి గృహంలో అందుతున్న సౌకర్యాలు,భోజన నాణ్యతపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో ఫ్యాన్లు, బ్లాక్ బోర్డుల కొరత ఉందని విద్యార్థినులు తెలపడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, అప్పటికప్పుడే ఫ్యాన్లు, బ్లాక్ బోర్డును అందజేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ఖాదర్ ప్రసాద్ గారు పాల్గొన్నారు. విద్యార్థినులకు ఫ్యాన్లను అందజేసే కార్యక్రమంలో ఆయన పాల్గొని సహకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన వసతి గృహాల్లో ఉండే పేద విద్యార్థినులకు ఎలాంటి లోటు లేకుండా,వారి చదువుకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే మన ప్రాధాన్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ వార్డెన్, ఖాదర్, ప్రసాద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# శక్తి టీం ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారులకు అవగాహన కార్యక్రమం

- మహిళలు, చిన్నారుల భద్రతపై అవగాహన.
- బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, మహిళలపై నేరాలపై చైతన్యం.
- శక్తి యాప్, డయల్-112 వినియోగంపై సూచనలు.
- సోషల్ మీడియా, డిజిటల్ మోసాలపై జాగ్రత్తలు.





ప్రజాభూమి ప్రతినిధి,తిరుపతి

తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఆదేశాల మేరకు, మహిళా పోలీస్ స్టేషన్ అదనపు ఎస్పీ శ్రీమతి శ్రీలత ఆధ్వర్యంలో శక్తి టీం పోలీసులు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నారాయణపురం సమీపంలోని శ్రీనివాస కళ్యాణ మండపం వద్ద మహిళలు, చిన్నారులతో సమావేశం నిర్వహించి మహిళలపై నేరాలు, బాల్య వివాహాలు, చైల్డ్ అబ్యూజ్, చైల్డ్ లేబర్, మహిళల అక్రమ రవాణా, కార్యాలయాల్లో వేధింపులు, గుడ్ టచ్--బ్యాడ్ టచ్, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్ట్, ఓటిపి మోసాలు, చైన్ స్నాచింగ్, రాపిడో/ఆటో ప్రయాణాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం, అత్యవసర పరిస్థితుల్లో డయల్-112 సేవలను వినియోగించడం, గుర్తు తెలియని వ్యక్తులు, లింకులు, వీడియో కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., సందేశం ఇస్తూ... మహిళలు, చిన్నారుల భద్రతకు తిరుపతి జిల్లా పోలీసులు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని ఎస్పీ తెలిపారు. వేధింపులు లేదా అనుమానాస్పద ఘటనలు ఎదురైతే వెంటనే డయల్-112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని, ప్రజల భాగస్వామ్యంతోనే నేరాల నివారణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

## స్థానిక ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సన్నద్ధం కావాలి- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు..!



ప్రజాభూమి ప్రతినిధి,చంద్రగిరి:

చంద్రగిరి మండలంలోని నారాయణాద్రి కళ్యాణ మండపం లో చంద్రగిరి అసెంబ్లీ సంస్థాగత సమావేశం జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగినది. ఈ ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికలలో దృష్టిలో పెట్టుకొని ప్రతి కార్యకర్త తన వంతుగా పూర్తి సామర్థ్యంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ సంస్థాగతంగా బలపడాలి. తిరుపతి జిల్లాలో చంద్రగిరి అసెంబ్లీ చాలా కీలకమైనదని, అసెంబ్లీ పరిధిలోపార్టీని బలోపేతం చేసే దిశగా అన్ని మండలాలలోనూ కమిటీల నిర్మాణం పూర్తిస్థాయిలో జరగాలి అని దిశ నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ గాలి పుష్పలత, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నరేష్ బాబు, అసెంబ్లీ స్థాయిలో బి ఎల్ ఎ -1 గా వ్యవహరిస్తున్న మధు బాబు, జిల్లా ఉపాధ్యక్షులు అనుష రామకృష్ణ, బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరినాగోతు, జిల్లా కార్యదర్శులు హరినాథ్ రెడ్డి మరియు శ్రీధర్ బాబు, సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్య యాదవ్, కె. వెంకట ముని, చంద్రగిరి మండల అధ్యక్షులు కాకి మాను ముని రాజా టు పాటు చంద్రగిరి అసెంబ్లీలోని మండల అధ్యక్షులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 1008 విశిష్ట ద్రవ్యములతో ఘనంగా మహా పూర్ణాహుతి

### శ్రీ వారాహి దేవి దీక్ష విరమణ చేసిన భక్తులు



ప్రజా భూమి ప్రతినిధి, రామచంద్రపురం

ప్రపంచంలోని అత్యంత మహిమాన్వితమైన ఏకైక శ్రీ పాతాళ శ్వేత వారాహీ మహాక్షేత్రమైన తిరుపతి జిల్లా రామచంద్రపురం మండలం రాయలచెరువు కట్ట దగ్గర ఉన్న శ్రీ శక్తిపీఠంలో శ్రీ వారాహీ నవరాత్రి మహోత్సవముల చివరి రోజున 1008 విశిష్ట ద్రవ్యములతో మహాపూర్ణాహుతి అత్యంత వైభవంగా నిర్వహించబడినవి. ఈ సందర్భంగా పరమపూజ్య శ్రీ మాతాజీ వారి సమక్షంలో వారాహి దీక్ష విరమణ కార్యక్రమం నిర్వహించారు, ఈకార్యక్రమంలో సుమారు 15,000 మందికి పైగా భక్తులు క్షేత్రాన్ని సందర్శించి అమ్మవారి దివ్య దర్శన భాగ్యాన్ని పొందారు. వచ్చిన భక్తులందరికీ అన్నప్రసాద వితరణ సమృద్ధిగా జరిగినది, ఇది గురు-దైవానుగ్రహానికి, పీఠం సేవాతత్పరతకు నిదర్శనంగా నిలిచింది.

## తొలి ఏకాదశి సందర్భంగా మన తిరుపతి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మన తిరుపతి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో తిరుపతి తీర్థకట్ట వీధిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని శ్రీ కే రూపేంద్ర నాయుడు గారి సహకారంతో శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు



ప్రేమతో అన్నప్రసాదాన్ని పంపిణీ చేసి ఆధ్యాత్మిక సేవలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా మన తిరుపతి ప్రెస్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు తపసి మురళి రెడ్డి మాట్లాడుతూ, తొలి ఏకాదశి వంటి పవిత్రమైన రోజున అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో శుభసూచకమని, భక్తులకు సేవ చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. సమాజ సేవే లక్ష్యంగా మన తిరుపతి ప్రెస్ క్లబ్ వివిధ సేవా కార్యక్రమాలను చేపడుతోందని, అదే స్ఫూర్తితో ప్రతి శనివారం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిరంతరంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సామాజిక సేవలో పాత్రికేయులు కూడా ముందుండాలని, ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి మరింత చేరువ కావాలన్నదే ప్రెస్ క్లబ్ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు పొన్నా రవికుమార్, రమేష్ కుమార్, మధుసూదన్, నాగబాల, గౌరవాధ్యక్షులు సుకుమార్ రాజు, అనిల్ మరియు ఆలయ ధర్మకర్త వినోద్ రాయల్ అభిసారికతో పాటు ప్రెస్ క్లబ్ సభ్యులు, పాత్రికేయులు మరియు భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమం భక్తిపూర్వక వాతావరణంలో విజయవంతంగా జరిగింది.

## నంది విగ్రహాల బహూకరణ

ప్రజాభూమి,

హిందూపురం టౌన్

తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం హిం దూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కార్యాలయంలో లేపాక్షి నంది విగ్రహాలను బహూకరిం చారు. లేపాక్షి శ్రీ దుర్గా వీరభద్రస్వామి దేవాలయ చైర్మన్, దివ్య ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, బీజేపీ నాయకులు పరిగి వేణుగోపాల్ రావు ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు శ్రీనివాసరావు, వీరయ్య, బాలాజీలను మర్యాదపూర్వకంగా కలిసి తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లేపాక్షి క్షేత్ర వైభవానికి ప్రతీకగా నిలిచే నంది విగ్రహాలను వారికి జ్ఞాపికగా అందజేశారు. తొలి ఏకాదశి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు నింపాలని వేణుగోపాల్ రావు ఆకాంక్షించారు. లేపాక్షి క్షేత్రం ఆధ్యాత్మిక విశిష్టతను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.




## తొలి ఏకాదశి సందర్భంగా శ్రీ వాసవి దేవస్థానంలో ప్రత్యేక పూజలు

### - సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహణ



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ నేతృత్వంలో శ్రీ వాసవి మాతకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తోటంశెట్టి చంద్రశేఖర్, మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగ్యేశ్వరమ్మ తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారిశాలలో సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. తొలి ఏకాదశి రోజున సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరించడం వలన విశేష ఫలితాలతో పాటు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సౌభాగ్యం కలుగుతాయని మహిళా మండలి అధ్యక్షురాలు తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బు, ఆలయ నిర్వాహకులు మిట్టా ప్రవీణ్ కుమార్, మహిళా మండలి కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## గ్రామ సంఘ సహాయకులకు ఆన్‌లైన్ నమోదు యాప్‌పై శిక్షణ



ప్రజాభూమి లింగాల

మండల సమాఖ్య పరిధిలోని గ్రామ సంఘ సహాయకులకు ప్రత్యేక యాప్ నిర్వహణపై శనివారం స్థానిక స్త్రీ శక్తి కార్యాలయంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రాజెక్టు మేనేజర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పొదుపు సంఘాల సమాచారాన్ని, ఆర్థిక లావాదేవీలను కంప్యూటీకరణ చేయడంలో ఈ సాంకేతికత అత్యంత కీలకమైనదని తెలిపారు. సంఘ సహాయకులు ఈ యాప్ వినియోగంపై పూర్తి అవగాహన పెంచుకుని, సంఘాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పక్కాగా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు మేనేజర్, ల్యాండ్ కోఆర్డినేటర్, క్లస్టర్ కోఆర్డినేటర్లు మరియు మండల వ్యాప్తంగా ఉన్న గ్రామ సంఘ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రచందనం అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తే ఎవరినైనా ఉపేక్షించం

**-అంతరాష్ట్ర స్మగ్లర్లకు సహకరించిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పాత్రపై లోతుగా దర్యాప్తు**
**-ఎర్ర చందనం అక్రమ రవాణాని అరికట్టేందుకు మరింత కఠిన చర్యలు**
**- 'ఆపరేషన్ అరణ్య'పై ఎప్పటికప్పుడు సమీక్షిస్తా**
**-ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:

ఎర్రచందనం అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ హెచ్చరించారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌ను నిరోధించేందుకు మరింత కఠినమైన ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆపరేషన్ అరణ్య ద్వారా ఎర్ర చందనం స్మగ్లింగ్ ను ఏ విధంగా అరికడుతున్నదీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తానని తెలిపారు. శనివారం, కడప జిల్లా అవధూత కాశినాయన మండల పరిధిలోని వరికుంట్ల గ్రామ సమీపంలోని జ్యోతి గుడి వద్ద రూ. 1.5 కోట్ల విలువైన 78 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న ఘటనపై ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం అధికారులతో మాట్లాడారు. ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లతోపాటు వారికి సహకరిస్తున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌ను అరెస్టు చేసిన విషయాన్ని ఉప ముఖ్యమంత్రివర్యులకు అధికారులు తెలియచేశారు. ఈ ఘటన పూర్వాపరాలను వివరించారు. శనివారం తెల్లవారుజామున ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం, స్టేట్ ఇంటెలిజెన్స్ బృందానికి అందిన కచ్చితమైన సమాచారం ఆధారంగా వరికుంట్ల గ్రామ సమీపంలో వాహనాల తనిఖీలు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా బొలెరో మ్యాక్స్ ట్రక్కులో ఇంటి సామగ్రి ముసుగులో ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న హర్యానాకు చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 1.5 కోట్ల విలువైన 78 ఎర్రచందనం దుంగలు, వాహనాన్ని స్వాధీనం చేసుకుని, సన్నీ, రమేష్ అనే ఇద్దరిని అరెస్టు చేసినట్లు వివరించారు. విచారణలో జ్యోతి ఫారెస్ట్ బీట్‌లో బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న మల్లికార్జునుడు అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తున్నట్లు గుర్తించామని, వెంటనే అతడిని కూడా అరెస్టు చేసి విచారిస్తున్నట్టు వెల్లడించారు. బెంగళూరు, హర్యానా, కోల్‌కతా ప్రాంతాల్లో వీరికి సహకరిస్తున్న మరికొందరు ప్రధాన సూత్రధారులను గుర్తించినట్లు తెలిపారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఆ ప్రధాన సూత్రధారులను పట్టుకోవాలని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ ఆదేశించారు. బీట్ ఆఫీసర్ పాత్రపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలన్నారు.

## బంగారుపాళ్యం మండలంలోని రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చిన సిఐ కత్తి శ్రీనివాసులు



ప్రజా భూమి ప్రతినిధి

బంగారు పాళ్యం.

బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లను స్టేషన్కు పిలిపించి సీఐ కత్తి శ్రీనివాసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. గతంలో చేసిన నేరాలపైన ఆరాదీసి, అవి పునరావతం కాకుండా, భవిష్యత్తులో మళ్లీ నేరాలకు పాల్పడకుండా పరివర్తన చెంది మంచి పనులతో జీవితాన్ని గడపాలని సూచించారు. ఎవరైనా ఏదైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు.

## నరసింగాపురం సహకార సంఘం బ్యాంక్ బోర్డు సమావేశం..!



ప్రజా భూమి ప్రతినిధి,చంద్రగిరి:

నరసింగాపురం సహకార సంఘం బ్యాంక్‌లో శనివారం నిర్వహించిన బోర్డు సమావేశంలో బ్యాంకు అధ్యక్షుడు రాజులు గారి వినోద్ కుమార్ రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బ్యాంకు అభివృద్ధి, సేవల మెరుగుదల, ఆర్థిక నిర్వహణకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించి ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో నూతన డిజిటల్ గోల్డ్ వెయింగ్ మెషిన్, ప్రింటర్లు తదితర అవసరమైన పరికరాల కొనుగోలుకు ఆమోదం తెలిపారు. బకాయి రుణాల వసూళ్లను వేగవంతం చేసేందుకు చట్టపరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. కొత్త సభ్యత్వాలు, వ్యాపార రుణాల వివరాలను ధృవీకరించడంతో పాటు ఉద్యోగుల హెచ్ఆర్ విధానం, పెండింగ్ బకాయిల అంశాలపై డివిజనల్ ఆఫీసర్‌తో చర్చించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని నిర్ణయించారు. అదేవిధంగా ఉద్యోగులకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, ఆదాయపు పన్ను దాఖలు సహా చట్టబద్ధ ఆర్థిక వ్యవహారాల పురోగతిని సమీక్షించారు. బ్యాంకు అభివృద్ధి, సభ్యులకు మరింత మెరుగైన సేవలు అందించడం, పారదర్శకత మరియు ఆర్థిక క్రమశిక్షణను బలోపేతం చేయడమే ఈ నిర్ణయాల ప్రధాన ఉద్దేశమని బోర్డు సభ్యులు తెలిపారు.

## స్వర్ణముఖి నదిని దోచేస్తున్న ఇసుక బకాసురులు పట్టించుకోని అధికారులు



ప్రజా భూమి ప్రతినిధి పెళ్ళకూరు.

పెళ్లకూరు మండలంలోని పెన్నేపల్లి గ్రామ సరిహద్దులో ఉన్న స్వర్ణముఖి నది ఇసుక నిలవలకు ప్రతీకగా ఉండేది, ప్రస్తుతం నిరంతరం రాత్రి పగలు ట్రాక్టర్లతో తరలించడం ద్వారా స్వర్ణముఖి గుంటల మయమై గడ్డి,ధర్బలతో దర్శనమిస్తుంది. ఈ ప్రాంతంలో సుమారు 65 పైన బోర్ వెల్స్ ద్వారా వ్యవసాయ భూమికి రైతులు నీటిని ఉపయోగించుకుంటున్నారు, ఈ ఇసుక తరలించే ప్రాంతానికి కూసంత దూరంలో మూడు మండలాలకి తాగునీటి సరఫరా



అయ్యే నీటి పంపు బావులు ఇక్కడే ఉన్నాయి, ఇసుకను తరలించేయడం వల్ల తాగునీరుకి వ్యవసాయననీటి కి ఇబ్బంది అవుతుందని2022 సంవత్సరం పెన్నేపల్లి,తాల్వాయిపాడు కు సంబంధించిన స్వరముఖి నుండి ఇసుక తరలించుటను అడ్డుకొనుటకు రైతులు హైకోర్టును ఆశ్రయించి స్టే తేవడం జరిగినది, ఈ స్టే వలన అప్పుడు రీచ్ ని తెచ్చుకున్న వారు వెను తిరగడం జరిగినది కానీ, స్థానికంగా ఇసుకను తరలించే ట్రాక్టర్ల వారు మాత్రం ఏదేచ్ఛగా రాత్రి పగలు ఇసుకను తరలించి స్వర్ణముఖిని బీడు భూమిగా మార్చేసినారు. సంబంధిత అధికారులకు రైతులు మొర పెట్టుకున్న, మీడియా పరంగా సమాచారం వెళ్లిన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వలన ఇసుక తరలించే వారికి హద్దు పొద్దు లేకుండా పోయింది, ప్రకృతి సంపదను కాపాడవలసిన నాయకులు, సంబంధిత అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టి రైతులకు న్యాయం చేసి తాగునీరు, సాగునీరు అందేలా చూడగలరని రైతులు గ్రామాల ప్రజలు కోరుచున్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు

### - ప్రత్యేక పూజల్లో పాల్గొన్న రఘునాథ్ రెడ్డి దంపతులు



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో టీడీపీ మండల పరిశీలకులు రఘునాథ్ రెడ్డి సతీమణి పద్మావతమ్మ లు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ప్రాకారోత్సవంలో పాల్గొని గోవింద నామస్మరణ చేస్తూ స్వామివారి పల్లకీ సేవలో భాగస్వాములయ్యారు. అనంతరం ఆలయ అర్చకులు రఘునాథ్ రెడ్డి దంపతులను దుశ్శాలువతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ కె. సుభాష్, ఆలయ పాలకమండలి ఛైర్మన్ పీవీ రమణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, ఆలయ పాలకమండలి సభ్యులు సుబ్రమణ్యం, జ్యోతి, రామయ్య, రాజమ్మ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా నేత సిద్ధారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ వై యస్ అవినాష్ రెడ్డి



ప్రజాభూమి, పులివెందుల

వేముల మండలం నల్లచెరువుపల్లి గ్రామానికి చెందిన వైకాపా పార్టీ సీనియర్ నాయకుడు రామిరెడ్డి సిద్ధారెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి శనివారం వారి గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు. ఎంపీ అవినాష్ రెడ్డి సిద్ధారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కష్టంలో అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సిద్ధారెడ్డి కుటుంబం పార్టీ కోసం, గ్రామ అభివృద్ధి కోసం అవిశ్రాంతంగా కృషి చేశారని కొనియాడారు. ఆయన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయని అన్నారు. సిద్ధారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు నాగెళ్ళ సాంబశివారెడ్డి, జడ్పీటీసీ బయపరెడ్డి, సుదర్శన్,గ్రామ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్థిక స్వావలంభనతోనే మహిళా సాధికారత

- 'మన లెక్కలు'తో ప్రతి మహిళ ఆర్థికంగా చైతన్యం కావాలి
- డిజిటల్ లావాదేవీల అవగాహన పెంపొందించుకోవాలి -జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

ప్రజాభూమి, హిందూపురం టౌన్

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలంటే ప్రతి రూపాయి ఆదాయం, ఖర్చు, పొదుపు, రుణాల వినియోగంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, మహిళా సంఘాల సభ్యులందరూ కచ్చితమైన ఆర్థిక లెక్కలు నిర్వహించే అలవాటు పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. మహిళల ఆర్థిక సాధికారతే కుటుంబ, సమాజ, రాష్ట్ర అభివృద్ధికి పునాది అని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'మన లెక్కలు' కార్యక్రమాన్ని ప్రతి మహిళ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మన లెక్కలు కార్యక్రమంలో భాగంగా శనివారం హిందూపురం పట్టణంలోని మినీ మార్కెట్ వద్ద జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. మినీ మార్కెట్ నుంచి ప్రారంభమైన ర్యాలీ శ్రీకంఠపురం సర్కిల్ వరకు సాగి తిరిగి మినీ మార్కెట్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ ప్రజలకు ఆర్థిక క్రమశిక్షణ,



పొదుపు, డిజిటల్ చెల్లింపులు, రుణాల సక్రమ వినియోగంపై చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళలు కుటుంబ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ఆధారమని, ఇంటి ఆదాయం-వ్యయాలను క్రమబద్ధంగా నమోదు చేసుకోవడం ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితి మరింత మెరుగు పడుతుందన్నారు. మహిళా సంఘాలు తీసుకునే రుణాలను ఉత్పాదక రంగాల్లో వినియోగించి ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. చిన్న మొత్తంలోనైనా క్రమం తప్పకుండా పొదుపు చేసే అలవాటు భవిష్యత్తులో పెద్ద ఆర్థిక భరోసాగా మారుతుందని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, బ్యాంకింగ్ సేవలు, డిజిటల్ చెల్లింపుల విధానాలపై ప్రతి మహిళకు పూర్తి అవగాహన ఉండాలని, ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత పాటించడం ద్వారా మహిళా సంఘాల విశ్వసనీయత మరింత పెరుగుతుందని వివరించారు. మన లెక్కలు కార్యక్రమం కేవలం లెక్కలు రాసుకోవడానికి మాత్రమే కాదు... మహిళల్లో ఆర్థిక క్రమశిక్షణ, స్వీయ విశ్వాసం, ఆర్థిక స్వావలంబన పెంపొందించేందుకు ప్రభుత్వం రూపొందించిన చైతన్య కార్యక్రమం అని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని చిన్న వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలని, ప్రభుత్వం అందించే రుణాలు, శిక్షణా కార్యక్రమాలను వినియోగించుకుని ఆర్థికంగా మరింత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

**డిజిటల్ సేవలకు మరో అడుగు -బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య**

మేళాపురంలోని రాముల ఆలయం సమీపంలో నస్రీన్ తాజ్ ఏర్పాటు చేసిన డీజీ లక్ష్మీ సీఎస్‌సీ (కామన్ సర్వీస్ సెంటర్)ను ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రజలకు ఒకే వేదికపై ప్రభుత్వ ధ్రువపత్రాలు, ఆన్‌లైన్ సేవలు, డిజిటల్ చెల్లింపులు, బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు సమయం, ఖర్చు ఆదా అవుతుందని తెలిపారు. ఇలాంటి సేవా కేంద్రాలు డిజిటల్ ఇండియా లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, మాజీ మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంకటేష్, మెప్మా పీడీ నాగరాజు, డీఎంసీ గంగులయ్య, డీఈవో ఇబ్రహీం ఖాన్, సీఎంఓలు నాగేంద్ర, సదానంద, వరలక్ష్మి, గంగరత్న, నరసింహులు, పట్టణ సమాఖ్య నాయకులు ఓబిలు, విజయలక్ష్మి, సరస్వతి, సుజాత, దుర్గా, నవీన్, అంజి, మెప్మా ఆర్‌పీలు, మహిళా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## చేయి చేయి కలుపుదాం శ్యాంసుందర్ కు కొత్త జీవితాన్ని ఇద్దాం

**ఒక ఇంజక్షన్ ఖర్చు 17 కోట్లు**

**రేపు జరిగే ర్యాలీని విజయవంతం చేద్దాం**

ప్రజాభూమి,పులివెందుల

బాబు శ్యాంసుందర్ కు వచ్చిన వ్యాధి ఎస్,ఎం,ఎ టైప్ 1 వ్యాధితో బాధపడుతున్న బాబు శ్యాంసుందర్ ను కాపాడేందుకు ప్రతి ఒక్కరం చేయి చేయి కలిపి తోచిన కాడికి సాయం చేద్దామని తపస్య జూనియర్ కాలేజ్ కరస్పాండెంట్ చంద్ర ప్రసాద్ రెడ్డి, పులివెందుల హరి యూట్యూబ్ ఛానల్ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూసోమవారం పులివెందుల పట్టణంలోని తపస్య జూనియర్ కాలేజ్ నుండి పూలంగల సర్కిల్ వరకు,




పూల అంగళ్ల సర్కిల్ నుండి పడగొట్టిన ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ ర్యాలీలో బాబు శ్యాం ప్రసాద్ కు అండగా నిలిచేందుకు ప్రతి ఒక్కరు తోషినంత సహాయం చేయాలన్నారు. శ్యాంసుందర్ కు వచ్చిన వ్యాధికి ఇంజక్షన్ ఖర్చు 17 కోట్ల రూపాయలు అవుతుందన్నారు. శ్యాంసుందర్ ఊరు కదిరిగుంటపల్లి, పెద్దమడుగూరు మండలం, రావులచెరువు దగ్గర అనంతపురం జిల్లా వాసి అన్నారు. వారి తల్లిదండ్రులు పేదవారు కావడంతో మన వంతు సహాయ సహకారాల కింద మనకు తోసినంత సాయాన్ని అందిస్తామన్నారు. ఏదైనా చేయి చేయి కలిపితేనే ఎంతటి కష్టాన్నైనా సులువుగా సాధించవచ్చు అన్నారు. సోమవారం జరిగే ర్యాలీలో పులివెందుల పట్టణంలోని యూట్యూబర్లు, స్వచ్ఛంద సంస్థ వారు, పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

## ఘనంగా మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోటూరు చిన్నప్ప జన్మదిన వేడుకలు

ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోటూరు చిన్నప్ప జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో



కోడి రమణ,పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్ లు పాల్గొని చిన్నప్పకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చిన్నప్ప సేవలను కొనియాడిన నాయకులు, ఆయన పార్టీకి చేసిన సేవలు మరువలేనివని, సామాన్య ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సహాయం చేస్తున్నారని ప్రశంసించారు. అనంతరం అభిమానులు చిన్నప్పకు పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం అంతా సందడిగా సాగింది. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు మస్తాన్ వల్లి,సర్వేశ్వరులు, అభిమానులు పాల్గొన్నారు

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా హర్షనీయం: తులసి రెడ్డి

**నీట్ లీకేజీపై కేంద్ర మంత్రి రాజీనామా.. స్వీట్లు పంచిన కాంగ్రెస్ -ఇది విద్యార్థుల విజయం: తులసి రెడ్డి**

ప్రజాభూమి,వేంపల్లి

నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం, దానిని ప్రధానమంత్రి ఆమోదించడం హర్షనీయమని రాజ్యసభ మాజీ సభ్యులు డా. నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు.శనివారం వేంపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ రాజీనామా ఎప్పుడో జరిగి ఉండాల్సిందని, అయినా కనీసం ఇప్పటికైనా జరగడం శుభపరిణామమన్నారు. దీనిని ప్రజాస్వామ్య విజయంగా, యువత విజయంగా, విద్యార్థుల విజయంగా అభివర్ణించారు.నీట్ లీకేజీపై విద్యార్థులు చేసిన ఉద్యమానికి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే సంపూర్ణ మద్దతు తెలిపారని, ప్రధాని నివాసం ముందు ధర్నా కూడా నిర్వహించారని గుర్తు చేశారు. "తాము ఏమి చేసినా చెల్లుతుంది" అన్న భ్రమల నుండి మోడీ ప్రభుత్వం బయటకు రావాలని హితవు పలికారు. బలవంతమైన సర్పము చలిచీమల చేత చిక్కి చావదె సుమతీ అన్న సుమతి శతక పద్యమే దీనికి నిదర్శనమన్నారు.భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. అనంతరం వేంపల్లి కాంగ్రెస్ నాయకులు స్వీట్లు పంచి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు డా. సుబ్రహ్మణ్యం, పులివెందుల అసెంబ్లీ సమన్వయకర్త ధ్రువకుమార్ రెడ్డి, సీనియర్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, వేమయ్య, బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



## మెగా యూత్ ఫోర్స్ రాయలసీమ కన్వీనర్ గా చక్రవర్తి

**-నియామక ఉత్తర్వులు అందచేసిన సుస్మిత**

ప్రజాభూమి, హిందూపురం టౌన్

మెగా యూత్ ఫోర్స్ రాయలసీమ కన్వీనర్ గా హిందూపురం పట్టణానికి చెందిన చక్రవర్తి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు సంబంధిత సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు కొణిదెల సుస్మిత నియామక ఉత్తర్వులను అందజేశారు. మెగా కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ, సినిమాలతో పాటు వివిధ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ తమ అభిమానాన్ని, సేవా భావాన్ని చాటుకుంటున్నట్లు




ఆమె పేర్కొన్నారు. అంకితభావం, సామాజిక సేవ పట్ల ఉన్న నిబద్ధత, అభిమానులను ఏకతాటిపై నడిపించే నాయకత్వ లక్షణాలను గుర్తించి, చక్రవర్తిని మెగా యూత్ ఫోర్స్ కమిటీ రాయలసీమ కన్వీనర్ అనంతపురం, కడప, కర్నూల్, చిత్తూరు జిల్లాలకు నియమించడం జరిగిందని తెలిపారు. ఈ నియామకం ఏడాది కాలం పాటు అమలులో ఉంటుందన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తూ, రాయలసీమ లోని మెగా అభిమానులందరిని సమన్వయం చేస్తూ, మెగా హీరోల ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని సూచించారు.

## సమ్మెకు సహకరించాలి

**-గార్మెంట్స్ యాజమాన్యాలకు సీఐటీయూ నోటీసులు**

ప్రజాభూమి, హిందూపురం టౌన్

రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 30వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి సహకరించాలని కోరుతూ హిందూపురంలోని టెక్స్ ఫోర్ట్ గార్మెంట్స్ యాజ మాన్యాలకు సీఐటీయూ నాయకులు శనివారం నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి వి.ఆర్.



రాము మాట్లాడుతూ, గార్మెంట్స్ పరిశ్రమల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులు తక్కువ వేతనాలతో తీవ్ర శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కర్ణాటకలో అదే పనికి రూ.17 వేల నుంచి రూ.22 వేల వరకు వేతనాలు చెల్లిస్తుండగా, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం రూ.8 వేల నుంచి రూ.11 వేల వరకు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాల బోర్డు కమిటీని నియమించకపోవడంతో యాజమాన్యాలు కార్మికులకు న్యాయమైన వేతనాలు ఇవ్వడం లేదని విమర్శించారు. కనీస వేతనాల అమలు, కార్మిక హక్కుల పరిరక్షణ, మహిళా కార్మికుల శ్రమ దోపిడీకి అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30వ తేదీన సత్యసాయి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో గార్మెంట్స్ మహిళా కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఆర్‌ఎల్‌ఎఫ్‌సీ మెడిసిన్ ఫ్యాక్టరీ యూనియన్ ప్రధాన కార్యదర్శి జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## తొలి ఏకాదశి సందర్భంగా శ్రీ వృషభాచలేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు


- **వైభవంగా అష్టోత్తర శత కలశాభిషేక మహోత్సవం**
- **ఈవో కె. సుభాష్, చైర్మన్ పీవీ. రమణ ఆధ్వర్యంలో భక్తులకు విస్తృత ఏర్పాట్లు**

ప్రజాభూమి, వేంపల్లె

తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు లోకకల్యాణం, సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ



ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ వృషభాచలేశ్వర స్వామివారికి రెండు రోజులపాటు అష్టోత్తర శత కలశాభిషేక మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె. సుభాష్, ఆలయ చైర్మన్ పీవీ. రమణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు హరి



ప్రవీణ్, తిరుమల వేణు ఆధ్వర్యంలో అర్చక బృందంచే గణపతి పూజ, పుణ్యాహవాచనం, అష్టోత్తర శత కలశ ఆరాధన, ప్రధాన కుంభ ఆరాధన, శాంతి హోమం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించింది. అనంతరం విశేష ద్రవ్యాలతో నింపిన 108 కలశాలతో స్వామివారికి అష్టోత్తర శత కలశాభిషేకం వైభవంగా నిర్వహించారు. పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి), టీడీపీ మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేపట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, ఇతర సౌకర్యాలను ఈవో కె. సుభాష్, చైర్మన్ పీవీ. రమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నియంత్రణలో ఎస్సై తిరుపాల్ నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు జ్యోతి, రాజమ్మ, సునీల్, రామయ్య, వరాలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## చైతన్య పాఠశాలలో కంటి పరీక్షలు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

జాతీయ అంధత్వ నివారణ, దృష్టి లోప నివారణ కార్యక్రమంలో భాగంగా శనివారం సత్యనారాయణ పేట లో ఉన్న శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఆప్తాల్మిక అసిస్టెంట్ సుబ్బారావు 260 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 20 మందికి దృష్టి



లోపం ఉన్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఏజీఎం సుబ్బారెడ్డి డాక్టర్ అభినందిస్తూ ఇలాంటి కార్యక్రమం వల్ల పిల్లల్లో ఉన్న లోపాలను గుర్తించి వారికి చికిత్స చేసుకొనే అవకాశం ఉందన్నారు. చిన్న పిల్లలు కంటి సమస్యలు కూడా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు గుర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఏఓ ప్రభాకర్ రెడ్డి, ప్రైమరీ ఇంచార్జి కాత్యాయని తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ కమిటీ స్టేట్ డైరెక్టర్ నియమితులైన మురళీకృష్ణ ను సత్కరించిన బద్వేల్ మార్కెట్ యార్డ్ చైర్మన్ సుప్రజ

ప్రజాభూమి పోరుమామిళ్ల :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ కమిటీ స్టేట్ డైరెక్టర్ గా నియమితులైనటువంటి జనసేన పార్టీ సీనియర్ నాయకుడు తుడిమల్ల మురళీ కృష్ణని శాలువాతో సన్మానించిన మార్కెట్





యార్డ్ చైర్మన్ నారిశెట్టి సుప్రజ, జిల్లా అధికార ప్రతినిధి నారోజు రమణాచారి, పోరుమామిళ్ల మండల అధ్యక్షుడు నారిసెట్టి నాగేంద్ర, బద్వేల్ పట్టణ అధ్యక్షుడు ధర్మిశెట్టి వెంకటసుబ్బయ్య రాయల్, బద్వేల్ రూరల్ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, పోరుమామిళ్ల మండల ప్రధాన కార్యదర్శి దూళ్ళ శ్రీనివాసులరెడ్డి, పోరుమామిళ్ల మండలం ఉపాధ్యక్షుడు కందుకూరు చెన్నయ్య, పోరుమామిళ్ల కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు తమ్మిశెట్టి రమణయ్య, మండల కార్యవర్గ సభ్యుడు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## వాతావరణ బీమా నమోదు చేసుకునేందుకు 31 వ తేదీ వరకు పొడగింపు



**గడువులోపు నమోదు చేసుకోవాలి**

**మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి**

ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల మండలంలోని రైతులకు పంటల భీమన్న మోదుచేసుకునేందుకు ఈనెల 31వ తేదీ వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఏవో చెన్నారెడ్డి తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రైతులు సాగు చేసిన అరటి,బత్తాయి,చీనీ,వేరుశనగ,పత్తి పంటలకు సంబంధించిన వాతావరణ బీమా నమోదు గడువును ప్రభుత్వం జూలై 24 నుంచి జూలై 31 వరకు పొడిగించినట్లు ఆయన తెలిపారు .రైతులు వాతావరణ బీమా పథకం కింద వేరుశనగ పంటకు ఎకరాకు రూ.562,బత్తాయి,చీనీ పంటకు రూ.2,782,పత్తి పంటకు రూ.2,023,అరటి పంటకు రూ.3,061 చెల్లించి బీమా నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు . ఎన్సీఐపీ బీమా పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ భూములతో పాటు డీకేటీ,ఇనాం భూములకు కూడా వాతావరణ బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు.పంట రుణం తీసుకోని రైతులు తమ భూమి పాసుబుక్,ఆధార్ కార్డు,సెల్ఫ్ డిక్లరేషన్ ఫారంతో మీసేవ లేదా కామన్ సర్వీస్ సెంటర్లలో బీమా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.ఇప్పటికే బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందిన రైతులు తమ సంబంధిత బ్యాంకు అధికారులను సంప్రదించి బీమా నమోదును ధృవీకరించుకోవాలని తెలిపారు.గడువు ముగిసేలోపు అర్హులైన రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

## అంధులకు అన్నదానం

ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పట్టణంలోని శ్రీనివాస థియేటర్ సమీపంలో ఉన్న శ్రీ వీర నారాయణ స్వామి అంధుల ఆశ్రమంలో సింహాద్రిపురం మండలం వైకాపా అధ్యక్షుడు దేవిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, దేవిరెడ్డి శ్రీవాణి ల కుమారుడు సాయి ప్రణవ్



రెడ్డి జన్మదినని పురస్కరించుకొని శుక్రవారం అంధుల ఆశ్రమంలో అంధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంధుల ఆశ్రమంలో అంధులో మధ్య పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి సంవత్సరం సాయి ప్రణవ్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఏదో ఒక కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. అంతకుముందుగా అందులో మధ్య జన్మదిన కేకును కట్ చేసి వారికి పంపిణీ చేసి, అనంతరం వారికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, ఆశ్రమం నిర్వాహకులు రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా రుక్మిణి పాండురంగ స్వామి కళ్యాణోత్సవం

ప్రజాభూమి, హిందూపురం టౌన్ హిందూపురం పట్టణంలో పాండురంగ నగర్ లో వెలసిన రుక్మిణి, పాండురంగ స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని రుక్మిణి పాండురంగ స్వామి కల్యాణోత్సవం భక్తుల కోలాహలం మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. శనివా



రం ఉదయం నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి పోటెత్తారు. ఉదయం 10 గంటలకు పూజా కార్యక్రమంతో మొదలై హోమాలు నిర్వహించారు. అనంతరం అంగరంగ వైభవంగా శ్రీరుక్మిణి పాండురంగ స్వామి కళ్యాణోత్సవం నిర్వహించారు. మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయం వద్ద ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గిరిధర్, శ్రీనివాసులు, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, మురళి, సునీల్ తదితరులు వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

# గుడివాడలో మాజీ ఎంపీ మాగంటి మురళీమోహన్ పర్యటన

**ఐ లవ్ గుడివాడ సింబల్ వద్ద... విక్టరీ చూపిస్తూ హర్షం వ్యక్తం చేసిన మురళీమోహన్**
**కూటమి నాయకులతో ప్రజా వేదిక కార్యాలయంలో... భేటీ**
**కృష్ణాజిల్లా నీతివంతులకు, నిజాయితీపరులకు మారుపేరు**
**గుడివాడకు రాము లాంటి మంచి అభ్యర్థి వచ్చారు..అందరి మన్ననలతో విజయం సాధించారు**
**నీట్ లీకేజీని సరిదిద్దేందుకు ప్రధాని మోడీ సిద్ధం:మురళీమోహన్**
**గొప్ప వ్యక్తి మురళీమోహన్ కు పద్మశ్రీ రావడం గర్వకారణం: ఎమ్మెల్యే రాము**
**మురళీమోహన్ మా తరానికి ఆదర్శప్రాయుడు, స్ఫూర్తి దాత: ఎమ్మెల్యే రాము**

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

కృష్ణాజిల్లా అంటే నీతిమంతులు, నిజాయితీపరులైన నాయకులకు నిలయంగా ఉండేదని మాజీ పార్లమెంట్ సభ్యుడు పద్మశ్రీ మాగంటి మురళీ మోహన్ పేర్కొన్నారు. తెలుగుజాతికి రెండు కళ్ళు లాంటి ఎన్టీఆర్, ఏఎన్నార్ నడయాడిన గుడివాడ గడ్డ రావడం సంతోషకరమని ఆయన హర్షం వ్యక్తం చేశారు.గుడివాడ పర్యటనలో భాగంగా ఏలూరు రోడ్డులోని టీడీపీ కార్యాలయం ప్రజావేదికకు మాజీ పార్లమెంట్ సభ్యులు, పద్మశ్రీ మాగంటి మురళీమోహన్ శనివారం విచ్చేశారు. ముందుగా ఏజికె స్కూల్ సెంటర్లోని ఐ లవ్ గుడివాడ వద్ద ఎమ్మెల్యే రాముతో కలిసి ఫోటోలు దిగిన మురళీమోహన్.... విక్టరీ సింబల్ చూపిస్తూ ఐ లవ్ గుడివాడ అన్నారు.

గుడివాడను ప్రేమించే రాము లాంటి మంచి వ్యక్తి ఎమ్మెల్యేగా ఉండడం మంచి విషయం అన్నారు.వైసీపీ ప్రభుత్వంలో ప్రజావేదికను కూల్చివేయడంతో దానికి గుర్తుగా గుడివాడలో ప్రజావేదిక ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మురళీమోహన్ కు వివరించారు. నాటి విధ్వంసం, ఘోరాలను ఇప్పటికీ మర్చిపోలేకపోతున్నామని మురళీమోహన్ ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం ఎమ్మెల్యే రాము కార్యాలయంలో కూటమి నాయకులతో మురళీ మోహన్ కొద్దిసేపు ముఖాముఖి మాట్లా డారు. ఈ సందర్భంగా కూటమి శ్రేణులు మురళీమోహన్ తో ఫోటోలు దిగి పలకరించారు. జన సేన యువతతో మాట్లాడుతూ రాష్ట్రంలో పవన్ కళ్యాణ్ కు చంద్రబాబు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో, గుడివాడలో మీకు ఎమ్మెల్యే రాము అంతే ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఇప్పుడు వచ్చిన మెజార్టీ కంటే ఎక్కువ రావడానికి కృషి చేయాలని వారికి సూచిం చారు.ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లా డుతూ... కృష్ణా జిల్లా నీతివంతులు, నిజాయితీపరులు, స్వచ్ఛమైన రాజకీయ నాయకులకు మారు పేరని, సొంత డబ్బు ఖర్చు చేసే పిన్నమనేని కోటే శ్వ రరావు లాంటి నాయకులు ఎందరో ఇక్కడ ఉన్నారని పేర్కొ న్నారు. రాష్ట్రంలో గుడి వాడ అసెంబ్లీ నియోజ కవర్గం ఎంతో ముఖ్యమైనదని, గుడివాడలో ఎవరు గెలిస్తే అదే పార్టీ రాష్ట్రంలో గెలుస్తుందనే నానుడి ఉందని తెలిపారు. అలాంటి నియోజకవర్గానికి మంచి అభ్యర్థిని పార్టీ ఎంపిక చేస్తుందని అందరూ ఎదురుచూశామని, ఆ ప్రయత్నంలోనే ఎన్నారై అయిన రాము లాంటి మంచి వ్యక్తికి టికెట్ ఇచ్చిందని అన్నారు.

టికెట్ ఇవ్వగానే తాను ఫోన్ చేసి అభినందించానని, ప్రెస్టేజ్ సీటు గెలవాలని శుభాకాంక్షలు చెప్పానని గుర్తుచేశా రు. ఎంతో కష్టపడి పనిచేసిన రాము అందరి మన్ననలతో గెలిచారని కొనియా డారు. ఎన్టీఆర్, ఏఎన్నార్ నడయాడిన గుడివాడకు రావడం ఆనందంగా ఉందని చెప్పారు. నీట్ పేపర్ లీకేజీపై స్పందిస్తూ విద్యార్థులకు అన్యా యం జరిగినప్పుడు అందరం ఖండించాల్సిందేనని అన్నారు. కష్టపడి చదివిన విద్యార్థులు పేపర్ లీక్ వల్ల నష్టపోవడం దారుణమని పేర్కొన్నారు. జరిగిన పొరపాట్లను సరిదిద్దుకోవడానికి ప్రధాని మోడీ సిద్ధంగా ఉన్నారని, ఈ విషయాన్ని ఆయన వీడియో సందేశం ద్వారా ఇప్పటికే తెలిపారని వివరించారు. పార్లమెంట్ లో కఠిన చట్టాలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. విద్యార్థుల ఉద్యమాన్ని రాజకీయం చేయడం సరికాదని, సమస్యను సామరస్యంగా పరిష్కరించుకొని విద్యార్థులు ముందుకు వెళ్లాలని సూచించారు. రాజకీయ ఉచ్చులో పడితే విద్యా ర్థులే నష్టపోతారని హెచ్చరించారు. రాజకీయాల్లో బిజీగా ఉండటంతో జయభేరి బ్యానర్ పై సినిమాలు చేయడం లేదని, అయితే ఇప్పుడు ట్రెండ్, సినిమాలు తీసే పద్ధతులు మారిపోయాయని తెలిపారు. తనకు పద్మశ్రీ అవార్డు రావడం సంతోషకరమని, భారత ప్రభుత్వానికి కృత జ్ఞతలు తెలిపారు.

ఎందరో రాజకీయ ఉద్దండులకు కృష్ణాజిల్లా నిలయమని ముగించారు.ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూచంద్రబాబు వచ్చిన అయిదు రోజుల తర్వాత ఆంధ్రులు అభిమానించే మురళీమోహన్ గుడివాడ రావడం సంతోషంగా ఉందని అన్నారు. ఆయనకు పద్మశ్రీ రావడం తెలుగువారికి గర్వకారణమని పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచి సినిమాల్లో చూసిన మహనీయుడు మురళీమోహన్ అని, నటుడిగా మాత్రమే కాకుండా రాజకీయ, వ్యాపార, నిర్మాణ రంగాల్లో సక్సెస్ అయ్యారని కొనియాడారు. మురళీమోహన్ తమ అందరికీ ఆదర్శప్రాయుడు, స్ఫూర్తి దాత అని ఎమ్మెల్యే రాము అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, సీనియర్ టిడిపి నాయకులు లింగం ప్రసాద్, పిన్నమనేని బాబ్జి, చేకూరు జగన్ మోహన్ రావు, పట్టణ టిడిపి అధ్యక్షుడు పంద్రాజు సాంబయ్య, కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.








## మచిలీపట్నం రోడ్డు ప్రమాద బాధితులకు మంత్రి కొల్లు రవీంద్ర ఆర్థిక సాయం

**బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 2 లక్షల ఆర్థిక సాయం అందించిన మంత్రి**

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

రోడ్డు ప్రమాదంలో మరణించిన నిరుపేద కుటుంబాలకు రాష్ట్ర గనుల, అబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కొండంత అండగా నిలిచారు. మచిలీపట్నానికి చెందిన ఒడుగు నరేంద్ర, వనమాడి కుమార్ జరిగిన రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడం పట్ల మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి, విచారాన్ని వ్యక్తం చేశారు.ఉదయమే బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి కొల్లు రవీంద్ర, వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ప్రభుత్వం తరఫున ఒక్కో కుటుంబానికి రూ. 2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ...తీరని లోటు: సంధ్య ఆక్వాలో రోజువారీ పనుల కోసం వెళ్తుండగా లారీ ఢీకొని ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని, వారి కుటుంబాల ఆవేదన తీర్చలేనిదని వాపోయారు.వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి: ప్రయాణ సమయంలో వాహనదారులు వేగ పరిమితి పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు.అధికారులకు కఠిన ఆదేశాలు: రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్స్ (Black Spots) ని గుర్తించి, అక్కడ వెంటనే స్పీడ్ బ్రేకర్లు, వార్నింగ్ లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## సాగునీరు సరఫరా నిలుపుదల చేస్తే..పాదయాత్ర చేస్తాం

**కృష్ణా డెల్టాకు సాగునీరు సరఫరా నిలుపుదల చేస్తే, వందలాది మంది రైతులు తో అవనిగడ్డ నుంచి విజయవాడ ప్రకాశం బ్యారేజీ వరకు పాదయాత్ర చేస్తాం**



ప్రజాభూమి ప్రతినిధి / అవనిగడ్డ


అవనిగడ్డ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు మాట్లాడుతూ,,,సాగు నీరు సరఫరా చేస్తున్నట్లు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ హంగులు ఆర్భాటాలు చేయటం వల్ల, రైతులు, నారుమడులు, వెదజల్లిన వరిసాగు పై రైతులు ఆసక్తి చూపటం జరిగిందని, తీరా ప్రాజెక్ట్ లలో నీరు లేదు,, ప్రస్తుతం తాగునీటికి మాత్రమే అంటూ,, అధికారులు ప్రకటన చేయించడం, సరైన పద్ధతి కాదు?..సాగునీరు సరఫరా చేయకపోతే,, రైతులు నష్టాలు భారిన పడవలసిన పరిస్థితి ఏర్పడిందని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ తెలిపారు..ప్రస్తుతం, పట్టిసీమ నుంచి ఐదు వేల క్యూసెక్కుల నీరు ప్రకాశం బ్యారేజీ సరఫరా చేస్తున్న,, మరల పులిచింతలలో ఉన్నటీటి కలిసి పదిహేను వేల క్యూసెక్కుల నీటిని సరఫరా చేయవచ్చునీ,, అన్నారు..రైతులు ఎటు వంటి ఇబ్బందులూ కలిగిన, రైతాంగం పక్షాన పోరాటం చేయటానికి సిద్ధం గా ఉన్నానని హెచ్చరించారు...ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేస్తున్న అవినీతి పై ఎండగట్టానికి సిద్ధంగా ఉన్నాని అన్నారు...ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మతిస్థిమితం లేక,, ప్రతిపక్ష పార్టీలు నాయ కులు విమర్శిస్తున్నారని అన్నారు, మండలి బుద్ధప్రసాద్ పై, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ తీవ్రంగా విరుచుకు పడ్డారు...ఈ సమావేశంలో అవనిగడ్డ జెడ్పిటీసీ చింతలపూడి లక్ష్మీనా రాయణ(లచ్చి), కృష్ణాజిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు సింహాద్రి వెంకటేశ్వరరావు, అవనిగడ్డ మం డలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేపల్లె శ్రీనివాసరావు, అవనిగడ్డ నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కల్చరల్ విభాగం అధ్యక్షులు యాసం శివ, కృష్ణాజిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం కార్యదర్శి సామర్ల రాముడు మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## పీ-4ద్వారా పేదలకు దాతల సహాయం అభినందనీయం

ప్రజాభూమి ప్రతినిధి / అవనిగడ్డ



ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టిన పీ-4 కార్యక్రమం ద్వారా పేదలకు దాతల సహాయం అభినందనీయం అని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. శనివారం మోపిదేవి మండలం మెరకనపల్లిలో పీఏసీఎస్ వద్ద పీ-4 కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని మూడు నిరుపేద కుటుం బాలకు పీఏసీఎస్ చైర్మన్ యర్రంశెట్టి సుబ్బారావు చొరవతో దాతలు గుత్తికొండ కళ్యాణ్, డాక్టర్ వంగల నారాయణరావు ఆర్థిక సహకారంతో నిత్యావసర సరుకులు, బియ్యం, కూర గా యలను వెంకట్రామ్ చేతులమీదుగా అందచేశారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ మాట్లాడుతూ పీఏసీఎస్ చైర్మన్ యర్రంశెట్టి సుబ్బారావు చొరవతో టీడీపీ నేత, గుత్తికొండ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తికొండ కళ్యాణ్, కేబీఎన్ కాలేజ్ ఏఓ డాక్టర్ వంగల నారాయణరావు ఆర్థిక సహకారంతో గ్రామం లోని పేదలకు ప్రతి నెలా నిత్యావసర సరుకులు, కూరగాయలు, బియ్యం సహాయంగా అందచే యటం అభినందనీయం అన్నారు. ముఖ్యమంత్రి పిలుపునిచ్చిన జన్మభూమి కార్యక్రమం స్ఫూర్తితో నాలు గేళ్ళ నుంచి పేదలకు సహాయం చేసే కార్యక్రమం నిర్వహిస్తూ, కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్ర బాబు ప్రకటించిన పీ-4 కార్యక్రమం ద్వారా నిత్యావసర సరుకులు, బియ్యం, కూరగాయలు అంద చేయటం ఆదర్శనీయమన్నారు.అనంతరం అవనిగడ్డలో పశువుల చావిడి, వరిగడ్డి వామి దగ్ధ మైన ఘటనలో బాధిత పశు పోషకుడు దామెర్ల రాంబాబుకు సొసైటీ చైర్మన్ సుబ్బారావు చొరవతో టీడీ పీ గ్రామ పార్టీ అధ్యక్షులు మెరకనపల్లి సుబ్బారావు, మెరకనపల్లి శ్రీనివాస రావు, సోమిశెట్టి రమణ, ఆకుల సుధాకర్, సోమిశెట్టి సాంబశివరావు, బొందలపాటి బసవయ్య సమకూర్చిన 50కట్టల వరిగ డ్డిని మండలి వెంకట్రామ్ సమక్షంలో పశు పోషకుడు రాంబాబుకు అందచేశారు. కార్యక్రమంలో కొత్తపేట పీఏసీఎస్ చైర్మన్ యలవర్తి రాజ నాగ మునేశ్వరరావు (చిన్నా), సొసైటీ పర్సన్ కర్రా వెంకటేశ్వరరావు, జనసేన గ్రామ పార్టీ అధ్యక్షులు యర్రంశెట్టి సునీల్, యర్రంశెట్టి నాగబాబు, పూర్ణచంద్రరావు, సొసైటీ సీఈఓ తలుపుల రంగా, వీఆర్వో మోపిదేవి వెంకటేశ్వరరావు, గుడివాక నరహరి, తండు గంగాధర్, బండి ప్రసాద్, చిన సుబ్బారావు, వెంకటేశ్వరరావు, చెరుకూరి రంగారావు తదితరులు పాల్గొన్నారు.





## గుడివాడలో కైకాల సత్యనారాయణ 91వ జయంతి వేడుకలు

### నివాళులర్పించిన పద్మశ్రీ మురళీమోహన్,ఎమ్మెల్యే రాము

**కాపు సేవా సమితి, కళాకారుల ఆధ్వర్యంలో వేడుకలు...మురళీమోహన్ కు కాపు సేవా సమితి, కళాకారుల సన్మానం...తొలి ఏకాదశి రోజు కైకాలకు నివాళి అర్పించడం సంతోషం:మురళీమోహన్ కైకాలతో కుటుంబ, స్నేహ బంధం ఉంది: మురళీమోహన్ అన్ని పాత్రలకు జీవం పోసిన ఆల్రౌండర్ కైకాల: మురళీమోహన్ కైకాల లాంటి మహానటుడు గుడివాడలో పుట్టడం గర్వకారణం:ఎమ్మెల్యే రాము**

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

తెలుగు సినీ రంగంలో అన్ని పాత్రలకు జీవం పోసిన ఆల్ రౌండర్ లాంటి నటుడు స్వర్గీయ కైకాల సత్యనారాయణ అని మాజీ పార్లమెంట్ సభ్యుడు పద్మశ్రీ మాగంటి మురళీమోహన్ కొనియాడారు. కైకాల పుట్టిన గుడివాడ గడ్డపై ఆయన జయంతి వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని మురళీ మోహన్ హర్షం వ్యక్తం చేశారు.నవ నట సార్వభౌముడు స్వర్గీయ కైకాల సత్యనారాయణ 91వ జయంతి వేడుకలు గుడివాడ కాపు సేవా సమితి మరియు పట్టణ కళాకారుల శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో మాజీ పార్లమెంట్ సభ్యుడు, పద్మశ్రీ మాగంటి మురళీమోహన్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొన్నారు.ఓల్డ్ మున్సిపల్ కార్యాలయ సెంటర్లో గల కైకాల సత్యనారాయణ విగ్రహానికి మురళీమోహన్, ఎమ్మెల్యే రాము మరియు కూటమి నాయకులు పూలమాలలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జోహార్ కైకాల అంటూ మురళీమోహన్ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సేవాసమితి పెద్దలు,కళాకారులు , మరియు గుడివాడ టిడిపి అధ్యక్షుడు పంద్రాజు సాంబయ్య మురళీమోహన్ కు సన్మానం చేశారు. అనంతరం మురళీమోహన్ మీడియాతో మాట్లాడుతూ...పవిత్రమైన తొలి ఏకాదశి రోజు గుడివాడకు రావడం, తనకు ఎంతో ఆప్తుడైన కైకాల సత్యనారాయణకు నివాళి అర్పించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. కైకాలతో తనకు కుటుంబ బంధాలు, స్నేహ సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. కైకాల తాత, తన తాత కౌతవరంలో మంచి స్నేహితులని గుర్తుచేశారు. షూటింగ్ లేని సమయంలో కైకాలతో తాను అనేకసార్లు కలుసుకునేవాడినని చెప్పారు.సినీ రంగంలో బాగా రాణిస్తున్నావని అభినందిస్తూ కైకాల తనకు మూడు ముఖ్యమైన సూత్రాలు నేర్పారని వివరించారు. షూటింగ్ సమయంలో వేషాలు లేక వచ్చే సీనియర్ నటులను గౌరవించి, మర్యాద చేయాలని,షూటింగ్ విరామ సమయంలో విహారయాత్రలకు వెళ్లకుండా, ప్రొడ్యూసర్లకు టచ్ లో ఉండి డబ్బింగ్ ఉందా, షూటింగ్ ప్యాచ్ వర్క్ ఉందా అని అడగాలని చెప్పారని తెలిపారు. మూడవ సూత్రం డబ్బు ఇస్తే గానీ షూటింగ్ కు రాను అని ప్రొడ్యూసర్ తో ఎప్పుడూ అనవద్దని కైకాల హితవు పలికారని పేర్కొన్నారు. కొందరు ప్రొడ్యూసర్లు భార్య మెడలో పుస్తెలు అమ్మి మరీ సినిమాలు తీస్తారని, అలాంటి వారిని గౌరవించాలని కైకాల తనకు చెప్పారని గుర్తుచేశారు.ఎన్నో సినిమాల్లో కలిసి నటించిన కైకాల తనకు ఎంతో మంచి మిత్రుడని, ఆయన పుట్టిన గుడివాడలో నేడు ఆయన విగ్రహానికి నివాళులర్పించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. చివరి దశలో అనారోగ్యంతో ఉన్నప్పుడు కైకాలను కలిసినప్పుడు ఆయన పేరుపేరునా ప్రతి ఒక్కరి గురించి అడిగారని నాటి రోజులను గుర్తుచేసుకున్నారు.అన్న ఎన్టీఆర్ అంటే తనకు, కైకాలకు ఎన్నలేని ప్రేమ ఉండేదని పేర్కొన్నారు. అన్ని పాత్రలకు జీవం పోసిన కైకాల ఆల్రౌండర్ లాంటి నటుడని, యముడు పాత్ర పేటెంట్ కైకాలదే అని మురళీమోహన్ కొనియాడారు.ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూకైకాల సత్యనారాయణ లాంటి మహానటుడు గుడివాడ గడ్డపై పుట్టడం మాకు గర్వకారణమని అన్నారు. ఆయన సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఎమ్మెల్యే రాము కోరారు.జయంతి వేడుకల్లో మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, స్వర్గీయ కైకాల సత్యనారాయణ జయంతి సభలో పాల్గొన్న ముఖ్యులు.శ్రీ ప్రభాకర నాట్యమండలి ప్రధాన కార్యదర్శి మట్టా రాజా, చార్లీ చాప్లిన్ కామెడి క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు నరహరిశెట్టి ప్రసాద్, కార్యదర్శి వంగా శ్రీనివాస్,(వంశీ), కాపు సేవా సమితి వ్యవస్థాపకులు పొన్నూరు రామకృష్ణ, సేవా సమితి కార్యదర్శి ఆత్మూరి మల్లేశ్వరరావు, మాజీ అధ్యక్షులు సుంకర గాంధీ,సనకా సుబ్బారావు, K V రమణారావు, టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి, పంద్రాజు సాంబయ్య,లింగం ప్రసాద్, చేకూరు జగన్మోహన్రావు, పైడిముక్కల వంశీ, సయ్యద్ గఫార్, జనసేన నాయకులు సాయన రాజేష్,పేర్ని జగన్, పలువురు కూటమి నాయకులు , కళాకారులు పాల్గొన్నారు.

## జగ్గయ్యపేటలో శ్రీ కృష్ణదేవరాయ కళ్యాణ మండపం నిర్మాణానికి ప్రభుత్వ స్థలం మంజూరు చేయించాలని వినతి

**ఎన్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షులు సామినేని ఉదయభాను ను వినతి పత్రంలో కోరిన సంఘ నేతలు**



జగ్గయ్యపేట, ప్రజాభూమి

జగ్గయ్యపేట పట్టణంలో కాపు సామాజికవర్గానికి శ్రీ కృష్ణదేవరాయ కళ్యాణ మండపం నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని మంజూరు చేయాలని కోరుతూ శ్రీకృష్ణదేవరాయ సేవాసమితి ప్రతినిధులు ఎన్టీ ఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను ని కలిసి వినతిపత్రం అందజేశారు.శనివారం పట్టణంలోని సామినేని ఉదయభాను నివాసంలో కలిసిన నేతలు వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా సేవాసమితి ప్రతినిధులు కళ్యాణ మండపం అవసరాన్ని వివరించగా, సంబంధిత ప్రజాప్రతినిధులు మరియు ప్రభుత్వం దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి, సానుకూల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని సామినేని ఉదయభాను హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షులు కామిశెట్టి అమర్నాథ్, జనరల్ సెక్రటరీ గుంటక లక్ష్మీనారాయణ, కోశాధికారి యర్రపోతు వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు గోగుశెట్టి వెంకట మహేశ్వరరావు, చిట్టిపోతుల సత్యనారాయణ, గుత్తి విజయభాస్కర్, కాపు ప్రముఖులు కఠారి హరిబాబు, బెంబవరపు మహీధర్ తదితరులు పాల్గొన్నారు.

## జగ్గయ్యపేటలో నగర వనం పనులు వచ్చే నెలలో ప్రారంభం

**అధికారులు, నేతలతో కలిసి నగర వనం ప్రాంతాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే రాజగోపాల్**



జగ్గయ్యపేట,ప్రజాభూమి

జగ్గయ్యపేట మండలం, వేదాద్రి రోడ్డులో జయంతిపురం సమీపంలోని ఫారెస్ట్ భూమిలో సెంట్రల్ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ నగరవనం మంజూరు చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) తెలిపారు. జయంతిపురం సమీపంలో 50 హెక్టార్లలో ఈ నగరవనం ఏర్పాటు కానుందని ఆయన వివరిం చారు.ఈ నగరవనంలో భాగంగా వివిధ రకాల వృక్షజాతులతో పాటు, ప్రజలు వాకింగ్ చేసేం దుకు వాకింగ్ ట్రాక్, సైక్లింగ్ చేసేందుకు ప్రత్యేక సైక్లింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నారు. చిన్నారుల కోసం వివిధ రకాల ఆట వస్తువులు, పిల్లలకు ఇష్టమైన యంత్రాలతో పాటు ఓపెన్ జిమ్ కూడా అందుబాటులోకి రానుంది.నగరవనం ప్రవేశ ద్వారం వద్ద అటవీ వాతావరణం ప్రతిబింబించేలా స్వాగత ఆర్చ్ ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు.జగ్గయ్యపేట ప్రాంతంలో సహజంగా కనిపించే పక్షు లు, జంతువులను కూడా ఇందులో పొందుపరచనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలందరికీ అన్ని విధాలుగా ఉపయోగపడేలా ఈ నగరవనాన్ని తీర్చిదిద్దుతున్నామని, వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని ఆయన వెల్లడించారు. జగ్గయ్యపేట నియోజకవర్గానికి నగరవనం మంజూరు చేయించినందుకు ముఖ్య మంత్రి కి మరియు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాసులు రెడ్డి, తెదేపా నాయకులు బండ్ల జాన్ ప్రకాష్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఇస్లావత్ శీను నాయక్, ఫారెస్ట్ ఆఫీసర్ వర్మ పాల్గొన్నారు.

## స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**ఆపరేషన్ క్లీన్ స్వీప్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజి**



మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాన్ని ప్రజా ఉద్యమంగా విజయవంతం చేయడానికి ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి పిలుపునిచ్చారు.శనివారం నిర్వహించిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ కలెక్టర్ బంగ్లా నుంచి పరాసపేట వెళ్లే ప్రధాన రహ దారిపై స్వయంగా పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. రహదారుల వెంట పేరుకుపోయిన చెత్త ను తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన అవసరంపై ప్రజలకు అవగాహన కల్పిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యవంతమైన సమా జానికి బలమైన పునాదిగా నిలుస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, వ్యాపార సంస్థలు, కార్యాల యాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయ కుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్ర మం విజయవంతం కావాలంటే ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ నిరంతర ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టి పరిశుభ్రమైన జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో నగర పాలక సంస్థ అధికారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at and published at DOOR NO. 19-4-378, S T V NAGAR, NEAR OLD TVS SHOW ROOM, OPPOSITE TIRUPATHI (URBAN) editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .PRGINo. "APTEL/25/A2316,Phone No. Cell : 9502116677

# కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభానికి ఘన నివాళి

## రావులపాలెంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సంస్మరణ సభ - సేవలను స్మరించుకున్న నేతలు.


**ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట**

కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని రావులపాలెంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో సీఆర్సీ (సి ర్ సి ) వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ ముఖ్య నాయకులు పాల్గొని ముద్రగడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ, పీఏసీ సభ్యుడు తోట త్రిమూర్తులు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, అమలాపురం పార్లమెంటరీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముద్రగడ పద్మనాభం చేసిన పోరాటాలు, సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన అంకితభావం చిరస్మరణీయమని కొనియాడారు. విలువలతో కూడిన రాజకీయాలకు ఆయన నిలువెత్తు నిదర్శనమని, సమాజానికి అందించిన సేవలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. అనంతరం ముద్రగడ పద్మనాభం మృతికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ సభలో పాల్గొన్న నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, రామచంద్రపురం నియోజకవర్గ పరిశీలకుడు కర్రి నాగిరెడ్డి, కొత్తపేట నియోజకవర్గ పరిశీలకుడు పాటి శివకుమార్, రాష్ట్ర కార్యదర్శి గొల్లపల్లి డేవిడ్ రాజ్‌తో పాటు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ముద్రగడ పద్మనాభానికి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు.




# రైతులకు పంటల బీమా నమోదు చేయాలి

**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా**



ఏలూరు, జిల్లాలో అర్హులైన ప్రతి రైతు ని పంటల బీమా పథకంలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుండి శనివారం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన మరియు వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం అమలుపై వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన మరియు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అందిస్తున్న వాతావరణ ఆధారిత పంటల భీమా పథకాలలో రైతుల నమోదు శాతం చాలా తక్కువగా ఉండడంతో అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ పంటల భీమాలో ప్రతీ రైతుని సోమవారం లోగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత పంటల భీమా పథకం వాతావరణంలో వచ్చే ప్రతికూల మార్పులతో పంట నష్టం కలిగే ఆర్థిక ఇబ్బందుల నుండి రైతులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత పంటల భీమా పథకంను అమలు చేస్తున్నాయన్నారు. పత్తి పంటకు ఎకరానికి 1900 రూపాయలు, నిమ్మ పంటకు 2500 రూపాయలు చొప్పున జూలై , 31 వతేదీ లోగా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. అకాల, అధిక వర్షపాతం, చీడపీడల వాతావరణం, అధిక ఉష్ణోగ్రత, గాలివేగం, గాలిలో తేమశాతం, తదితర కారణాలతో జిల్లాలో పత్తి , నిమ్మ పంటలకు వాతావరణ ఆధారిత పంటల భీమా పథకం వర్తిస్తుందని, పత్తి పంటకు ఎకరానికి 38 వేలు, నిమ్మ పంటకు 50 వేల రూపాయలు చొప్పున పరిహారం అందించడం జరుగుతుందన్నారు. వ్యవసాయ భూమి కలిగిన రైతులు, కౌలుదారులు ఈ పథకానికి అర్హులని, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, భూమి పాస్ బుక్ నకళ్ళు, పంటవేసినట్లు ధృవీకరించిన ధ్రువీకరణ పత్రం లేదా స్వీయ ధ్రువీకరణ ఆధార్ అనుసంధానమైన బ్యాంకు ఖాతా, భూ వివరాలు మరియు ఇతర అవసరమైన పత్రాలతో సమీప కామన్ సర్వీస్/ పంటల భీమా పోర్టల్ లో ఆన్లైన్ ద్వారా/ పంటల భీమా యాప్/ అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ ప్రతినిధి ద్వారా నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన, పునరవ్యవస్థికరించబడిన వాతావరణ ఆధారిత పంటల భీమా పథకాలపై పథకంపై రైతులకు విస్తృతమైన అవగాహన కలిగించి, అర్హత కలిగిన ప్రతీ రైతు నమోదయ్యేలా చూడాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం జరిగినప్పుడు రైతులు నష్టపోకుండా ప్రతీ రైతు పంటల భీమా ప్రీమియం చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పథకంలో పంటలు సాగుచేసే రైతులకు (బ్యాంకులో రుణం పొందు రైతులు, రుణాలు పొందని రైతులు, సొంతభూమి మరియు కౌలుదారులు, రుణ అర్హత పొందిన గుర్తింపు కార్డు కలిగిన రైతులు) నమోదయ్యేలా చూడాలన్నారు. గడువు తేదీలోగా పంటల భీమా లో నమోదయ్యేలా చూడాలని, గడువు తేదీ అనంతరం పంటల బీమా నమోదుకు అవకాశం ఉండదని, అందువల్ల రైతులు చివరి రోజు వరకు వేచి ఉండకుండా ముందుగానే నమోదు చేసుకొని ఎల్నినో, ప్రకృతి వైపరీత్యాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు మరియు పథకం నిబంధనల ప్రకారం అర్హత కలిగిన నష్టాల నుంచి రైతులు ఆర్థిక రక్షణ పొందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వరి పంటకు ఎకరాకు 840 రూపాయలు చొప్పున ప్రీమియం ను ఆగష్టు , 15వ తేదీ లోగా, మినుములు పంటకు 300 రూపాయలు చొప్పున , పత్తి పంటకు 1900 చొప్పున, నిమ్మ పంటకు 2500 రూపాయలు చొప్పున జులై, 31వ తేదీలోగా రైతులు చెల్లించాలన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకొని రైతులు ఆధార్ కార్డు, ఆధార్ అనుసంధానమైన బ్యాంకు ఖాతా, భూ వివరాలు మరియు ఇతర అవసరమైన పత్రాలతో సమీప రైతు సేవా కేంద్రం, కామన్ సర్వీస్ సెంటర్, తపాలా కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయం లేదా సంబంధిత బీమా సంస్థ ప్రతినిధులను సంప్రదించి గడువు తేదీలలోపు రైతులు పంటల బీమా పథకాలలో నమోదయ్యేలా క్షేత్ర స్థాయిలోని వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందిన రైతులు, కౌలు రైతులు తప్పనిసరిగా పంటల భీమా పథకం ప్రీమియం చెల్లించేలా బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా, ఉద్యానవన అధికారి షాజా నాయక్, డిసిఓ ఆరిమిల్లి శ్రీనివాస్, ఎల్ డి ఎం, వివిధ బ్యాంకుల అధికారులు, వ్యవసాయ, అనుబంధ రంగాల శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పెదపాడు గ్రామంలో రూ.37 లక్షలతో పంట కాలువ అభివృద్ధి పనులు.

**ప్రజాభూమి ప్రతినిధి-పెదపాడు**

పెదపాడు గ్రామంలో గ్రామస్థులకు, రైతులకు సాగు,త్రాగు నీటి సౌకర్యాన్ని మరింత మెరుగుపరిచే లక్ష్యంతో రూ.37 లక్షల వ్యయంతో పుడుకుపోయిన పంట కాలువ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వెల్లడించారు.పంట బోదే పూడిక తీత పనులను శనివారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సాగునీరు సకాలంలో అందేలా పంట కాలువలను అభివృద్ధి చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ పనులు పూర్తయిన అనంతరం రైతులకు సాగునీటి సమస్యలు గణనీయంగా తగ్గడంతో పాటు గ్రామస్తులకు డ్రైన్ సమస్య కూడా తీరుతుందని తెలిపారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తూ, గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొప్పిడి కాశీ బాబు గుత్తా అనిల్,లావెటి శ్రీనివాసరావు,మాజీ సర్పంచ్ కాకరాల బుజ్జి,కరుకోటి మోహన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, గ్రామ పెద్దలు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.


పెదపాడు గ్రామంలో రూ.37 లక్షలతో పంట కాలువ అభివృద్ధి పనులు.





ప్రజాభూమి ప్రతినిధి-పెదపాడు

పెదపాడు గ్రామంలో గ్రామస్థులకు, రైతులకు సాగు,త్రాగు నీటి సౌకర్యాన్ని మరింత మెరుగుపరిచే లక్ష్యంతో రూ.37 లక్షల వ్యయంతో పుడుకుపోయిన పంట కాలువ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వెల్లడించారు.పంట బోదే పూడిక తీత పనులను శనివారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సాగునీరు సకాలంలో అందేలా పంట కాలువలను అభివృద్ధి చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ పనులు పూర్తయిన అనంతరం రైతులకు సాగునీటి సమస్యలు గణనీయంగా తగ్గడంతో పాటు గ్రామస్తులకు డ్రైన్ సమస్య కూడా తీరుతుందని తెలిపారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తూ, గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొప్పిడి కాశీ బాబు గుత్తా అనిల్,లావెటి శ్రీనివాసరావు,మాజీ సర్పంచ్ కాకరాల బుజ్జి,కరుకోటి మోహన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, గ్రామ పెద్దలు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.


# అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం

## మంత్రి సుభాష్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన రామచంద్రపురం నూతన డీఎస్పీ శేషు.

**ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం.**



రామచంద్రపురం సబ్ డివిజనల్ పోలీసు అధికారిగా బాధ్యతలు స్వీకరించిన మల్లా శేషు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. విశాఖపట్నంలో సీఐడీ విభాగంలో విధులు నిర్వహించిన మల్లా శేషు సాధారణ బదిలీలలో భాగంగా రామచంద్రపురం సబ్ డివిజన్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. గతంలో పలు కీలక విభాగాల్లో సేవలందించి పోలీసు ఉన్నతాధికారుల ప్రశంసలు పొందిన ఆయన, ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)లో స్పెషల్ ఆఫీసర్‌గా కూడా పనిచేసి మంచి గుర్తింపు పొందారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రామచంద్రపురం సబ్ డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రజలకు ప్రశాంతమైన, సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు పోలీసు శాఖ కృషి చేయాలని, నేరాల నియంత్రణలో మరింత సమర్థవంతంగా పనిచేసి సబ్ డివిజన్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

**అసాంఘిక కార్యకలాపాలుపై ఉక్కు పాదం: డిఎస్పీ**

డీఎస్పీ మల్లా శేషు మాట్లాడుతూ గంజాయి, జూదం, పేకాట, కోడిపందాలు వంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు. తన పరిధిలో నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామని, క్రైమ్ రేట్‌ను తగ్గించేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, గంజాయి రవాణా మరియు విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.అదేవిధంగా జూదం, పేకాట, కోడిపందాలు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠినంగా వ్యవహరిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే శక్తులను అణచివేస్తామని తెలిపారు. ప్రజల సహకారంతో నేరరహిత, ప్రశాంత రామచంద్రపురం నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈయన పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటనారాయణ, పట్టణ ఎస్ఐ నాగేశ్వరరావు, పామర్రు ఎస్ఐ సోమేంద్ర తదితరులు ఉన్నారు.

## మొక్కలు నాటిన ఎంపీటీసీ సభ్యులు.



**ప్రజా భూమి ప్రతినిధి-చాట్రాయి.**

ఉద్యానవనం శాఖ ఆధ్వర్యంలో రైతు పొలాల్లో పండ్లతోటల పెంపకంలో భాగంగా కృష్ణారావు పాలెం గ్రామంలో శనివారం రైతు నరసింగు చెన్నారావు పొలంలో పామాయిల్ మొక్కలు నాటుతున్న కృష్ణారావు పాలెం ఎంపీటీసీ చింత గుంట్ల వెంకటేశ్వరరావు ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ తార, రైతులు పాల్గొన్నారు

# సాగునీటిపై గొడ్డల పార్టీ దుష్ప్రచారం-రైతులు, సాగునీటి సంఘాల నాయకులు

## ప్రతి ఎకరానికి నీరు అందేలా మంత్రి నిమ్మల కృషి

**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**

పాలకొల్లు నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేని గొడ్డలి పార్టీ నాయకులు సాగునీటి విషయంలో అవాస్తవాలు మాట్లాడుతున్నారని, రైతులు మాత్రం నమ్మే స్థితిలో లేరని వారికి వాస్తవాలు తెలుసునని సాగునీటి సంఘాల నాయకులు, రైతు నాయకులు స్పష్టం చేశారు. మంత్రి ఇలాకాలో నారుమడులకు సాగునీటి ఇబ్బందులంటూ గొడ్డలి పార్టీ నాయకుడు గుడాల గోపి చేసిన ఆరోపణలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పాలకొల్లు నియోజకవర్గంలో ఆయన రోజంతా తిరిగితే గాని యలమంచిలి మండలం మేడపాడు గ్రామ పంట కాలువ శివారు ప్రాంతంలో గల మెరక చేను కనిపించలేదన్నారు. ఈ చేనుకు మరో పూట గడిస్తే కాలువ నీరు వచ్చేదని, ఈలోగా గోపి అక్కడికి వెళ్లి చేను లో సైకిల్ తొక్కుతూ ఆకుమళ్ళకు నీరందక చేను బీటలు తీసిందంటూ డ్రామా ఆడారన్నారు. ఆ చేనుకు ఉన్న పరిసర ప్రాంతాల్లో చేలు పచ్చగా కనిపిస్తుంటే ఈ ఒక్కటి ఎందుకు ఇలా ఉందో ఆలోచన చేయలేదని, ఇది వైసీపీ వ్యక్తికి చెందిందని అందువల్లనే కావాలనే రాద్ధాంతం చేశారన్నారు. అక్కడ నుంచి వెళ్లిన కొద్దిసేపటికి చేనుకు నీరు చేరిందన్నారు. రొయ్యలు పట్టుకోవడం, అమ్ముకోవడం తప్ప వ్యవసాయం, రైతుల గురించి గోపి కి ఏం తెలుసని మాట్లాడుతున్నారన్నారు. పాలకొల్లు డిస్ట్రిబ్యూటర్ కమిటీ అధ్యక్షుడు పి రాంబద్ర రాజు, యలమంచిలి సాగునీటి సంఘ అధ్యక్షుడు ఆరిమిల్లి రామ శ్రీనివాస్, ఎలమంచిలి మండల టిడిపి అధ్యక్షుడు మామిడి శెట్టి పెద్ది రాజు, ఎలమంచిలి జడ్పిటిసి బోనం నాని, నాయకులు బొప్పన హరి కిషోర్, కడలి గోపి, చల్లా నరేంద్ర పీతల శ్రీనివాస్, రైతులు ఉగాది కంచి వరదరాజులు, వీరవల్లి రాంబాబు తదితరులు మాట్లాడారు. దేశమంతటా లేనివో, వర్షాభావ పరిస్థితులు వలన నీటి ఇబ్బందులు తలెత్తిన విషయమై కనీస



పరిజ్ఞానం గొడ్డలి పార్టీ నాయకులకు లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వంలో ముఖ్యంగా రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు రైతు బిడ్డగా, రైతు పక్షపాతిగా ఆలోచనతో రైతులకు సాగునీటి విషయంలో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురుకాకుండా ఎప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలు ఇస్తూ కష్టపడి పనిచేస్తున్నారనే విషయం రైతాంగానికి తెలుసునని, గొడ్డలి పార్టీ నాయకులు అవాస్తవాలు మాట్లాడినంత మాత్రాన నమ్మరని తెలిపారు. ఇటువంటి పరిస్థితిలే గొడ్డలి పార్టీ ప్రభుత్వంలో ఉంటే క్రాఫ్ హాలిడే ప్రకటించి రైతులను గాలికి వదిలేసేవారన్నారు. పాలకొల్లు నియోజకవర్గం లో ముఖ్యంగా ఎలమంచిలి మండలంలో కొన్ని ప్రాంతాల్లో కొద్దిపాటి సాగునీటి ఇబ్బందులు ఉన్న మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాలతో అధిగమించేలా ఎప్పటికప్పుడు సాగునీటి సంఘాల ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారన్నారు. మంత్రి రామానాయుడు కూడా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్నారని, అవసరమైన సూచనలు ఇస్తున్నారన్నారు. సాగునీటి విషయంలో రైతాంగం ఆందోళన చెందనవసరం లేదని , అన్ని శివారు ప్రాంతాల్లోని ప్రతి ఎకరం చేనుకు నీరు అందిస్తామని స్పష్టం చేశారు.

# డ్వాక్రా సంఘాలకు రెండు కోట్ల రూపాయల ఉపకరణాలు అందచేత

## శాసనసభ్యులు చిర్రి బాలరాజు

**ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి**

జీలుగుమిల్లు ఎమ్మార్వో కార్యాలయం ముందు డీఆర్డిఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆజీవిక గ్రామీణ ఎక్స్‌ప్రెస్ యోజన యూనిట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు యూనిట్లను పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ చిర్రి బాలరాజు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో స్వయం ఉపాధిని ప్రోత్సహించి, నిరుద్యోగ యువతతో పాటు మహిళలకు స్థిరమైన ఆదాయ వనరులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఆజీవిక గ్రామీణ ఎక్స్‌ప్రెస్ యోజన ద్వారా లబ్ధిదారులు ఆర్థికంగా స్వావలంబన సాధించి, తమ కుటుంబాల అభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండింటికీ సమాన ప్రాధాన్యత ఇస్తూ పేద కుటుంబాల జీవనోపాధి మెరుగుపర్చేందుకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు.అనంతరం ఎమ్మెల్యే లబ్ధిదారులకు ఏజీ ఈ వై యూనిట్లను పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి టీవీ విజయలక్ష్మి, ఐటీడీఏ పీవో రాముల నాయక్, ఎంపీడీవో వెంకటలక్ష్మి, డిఆర్డిఏ అడిషనల్ పిడి అనిత, డిపిఎంలు, ఏపీఎంలు జీలుగుమిల్లి ఏపిఎం జిఎల్వి నరసింహారావు, జిల్లా సమైక్య అధ్యక్షులు, ఏడు మండలాల సమాఖ్య అధ్యక్షులు, జీలుగుమిల్లి టిడిపి అధ్యక్షులు సుంకవల్లి సాయి, జనసేన మండల



నాయకులు బండారు అనిల్, రూప సత్యనారాయణ, శాఖమూడి సాయి,రాయి సుబ్బారావు,గారపాటి శ్రీను, సిరిబత్తుల స్వామి, గణేష్, మందపాటి సూర్య, తొమ్మిదేళ్ల దుర్గాప్రసాద్, భీమారెడ్డి, గద్దె సుబ్రమణ్యం, పద్దం వెంకటకృష్ణ, దేవుడు శ్రీను, కొప్పుల శ్రీకాంత్, జట్ల సత్యనారాయణ, చింతలపూడి నవీన్,బరగడ తరుణ్, ఊకే సాయి కిరణ్, ఉండవల్లి అరుణ్ కుమార్, తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

## రేఖపల్లిలోని కేజీబీవీ స్కూల్లో ఘనంగా మెగా పేరెంట్ మీటింగ్ 4.0



ప్రజాభూమి, ప్రతినిధి-వి.ఆర్.పురం.

మండలం రేకపల్లి ,కేజీబీవీ స్కూల్లో మెగాపేరేట్ మీటింగ్ 4,0 కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో రైతులకు సందేశం మీద జరిగినటువంటి ఈ స్కిట్ స్కూల్ టీచర్ల యొక్క వారి పనితనాన్ని, విద్యార్థుల భవిష్యత్తుపై వారికి ఉండే బాధ్యతను చూపించింది. ఈ స్కిట్ల సందేశం రైతులు ఆరుగాలం కష్టపడి వాతావరణం ద్వారా కలిగే మార్పులు ప్రమాదాల వల్ల కలిగే నష్టం గురించి, రైతులు సరే అవగాహన ఉండదు కానీ వారి కుటుంబంలో చదువుకునే పిల్లలు ఉండటంవల్ల వ్యవసాయంలో ఉన్న మెలకువలు గురించి సాగు పనులు స్పాట్ ఫార్మింగ్ ఆధునిక యంత్రాలు గురించి వీటివల్ల ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయం వల్ల వ్యవసాయాన్ని సులభతరం చేస్తుందని డిజిటల్ విధానం వల్ల సరికొత్త మార్పులు వ్యవసాయంలో వస్తుంది అని సాంకేతిక వ్యవసాయం వల్ల రైతులకి పని భారం తగ్గుతుందని ధరలుతగ్గుతాయనీ, దిగుమతులు పెరుగుతాయని రైతులకు కష్టాలు తగ్గుతాయని ఎంతో విలువైన సందేశాన్ని రైతులకు నేటి సమాజానికి అందజేశారు.

## ధర్మేంద్ర రాజీనామా బిజెపికి చెంపపెట్టు : సీపీఐ

ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం.



మండలంలోని సిపిఐ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో నీట్ పేపరు లీక్ విషయం లో యూనియన్ ఎడ్యుకేషన్ మినిస్టర్ ధర్మేంద్ర ప్రధాన్ గత్యంతరం లేని పరిస్థితిలో రాజీనామా చేయడం బిజెపి పార్టీకి చెంపపెట్టు లాంటిదని సిపిఐ డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ గుజ్జా మోహన్ రావు అన్నారు. 22 లక్షల మంది నీట్ విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నారని, ఆడ మగ తేడా లేకుండా దారుణంగా కొట్టారని చివరకు దేశద్రోహులని చిత్రించే ప్రయత్నం కూడా చేసేందుకు దిగజారారని అన్నారు. దేశంలో యువత తిరగబడింది, ఇంతకాలం మతాల మధ్య చిచ్చు పెట్టి, ఆవు పేడ, గోమూత్రం అంటూ మభ్యపెట్టాలని చూస్తే ఇక ఆ పాచికలు పారవని అన్నారు. దేశంలో లీటర్ పెట్రోల్ ధర 117 రూపాయలకు పెరిగింది, డాలర్ తో పోలిస్తే రూపాయి విలువ 96 రూపాయలకు పడిపోయింది, అత్యాచారాలు చేసిన వాళ్ళు జైళ్ళ నుంచి పూలదం డలతో దర్జాగా తిరిగి వస్తున్నారు, ప్రశ్నించేవాళ్లు కఠినమైన చట్టాలతో జైలుకు వెళుతున్నారు, అవినీతిపరులు బిజెపిలో చేరిపోయి క్లీన్ చిట్ తో కేసులు మాఫీ చేసుకుంటున్నారు, దేశంలో ఎన్నడూ లేని విధంగా అవినీతి మత హింస పెరిగిపోయాయి, 200 కోట్ల రూపాయల దొంగత నంతో రామమందిరం కథ ముగిసింది, ఇక బిజెపి పతనాన్ని ఎవరూ ఆపలేరని జోష్యం చెప్పా రు. ప్రశ్నించే యువతని బొద్దింకలతో పోల్చి అవమానించారని, 22 రోజులపాటు ఆందోళనలు చేస్తే తప్ప ప్రధాని మోడీకి విద్యార్థుల బాధ కనపడకపోవడం విచారకరమని అన్నారు. ఇంత జరుగుతున్నా అటు కొంతమంది జాతీయ మీడియా ఇటు ప్రాంతీయ మీడియా పనికిరాని కథనాలను ప్రసారం చేస్తూ కాలయాపన చేయడం దేశానికి పట్టిన అతిపెద్ద దౌర్భాగ్యం అని అన్నారు. ధర్మేంద్ర రాజీనామా పట్ల సిపిఐ హర్షం వ్యక్తం చేసినట్లు తెలిపారు.

## సాలూరు నియోజకవర్గం పరిశీలకునిగా కొత్తపల్లి ఆశీష్ లాల్

ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి



భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రానున్న నేపథ్యంలో, సాలూరు నియోజకవర్గ పరిశీలకుడిగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొత్తపల్లి ఆశీష్ లాల్ నియామకం కావడం పట్ల టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు నామా సురేంద్ర కుమార్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి పర్యటనను విజయవంతం చేసే కీలక బాధ్యతను పార్టీ ఆశీష్ లాల్‌కు అప్పగించడం సంతోషకరమన్నారు. యువ నాయకుడిగా ఆయన పార్టీ అభివృద్ధితో పాటు ప్రజాసేవలో చురుకుగా వ్యవహరిస్తున్న తీరు అందరికీ ఆదర్శప్రాయమని కొనియాడారు.భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభంతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త శకం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పరిశ్రమలు, పర్యాటక రంగం మరింత అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ప్రధానమంత్రి పర్యటన సందర్భంగా సాలూరు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా కొత్తపల్లి ఆశీష్ లాల్ మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి, పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటనను ఘన విజయవంతం చేసేందుకు కృషి చేస్తానని వెల్లడించారు.

## శ్రీ తలుపులమ్మ దేవస్థానంలో రూ. 90 లక్షలతో అభివృద్ధి పనులు

-శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్ యనమల దివ్య..

ప్రజాభూమి ప్రతినిధి-తుని



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ తలుపులమ్మ అమ్మవారి దేవస్థానంలో రూ. 90 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న రిటైనింగ్ వాల్ మరియు రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక శాసన సభ్య రాలు, ప్రభుత్వ విప్ గౌరవ శ్రీమతి యనమల దివ్య శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే గారికి ఆలయ కార్యనిర్వహణాధికారి ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం దేవదాయ శాఖ, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులతో కలసి నిర్మాణ పనుల వివరాలను కార్యనిర్వహణాధికారి ఎమ్మెల్యేకి వివరించారు. భక్తులకు అందుబాటులోకి రానున్న ఎస్కలేటర్ ఏర్పాటు పనులను కూడా ఈ సందర్భంగా ఆమె పరిశీలించారు.ఆలయ వేదపండితులు, అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజ లు నిర్వహించి, శేష వస్త్రంతో ఎమ్మెల్యేని సత్కరించి వేదాశీర్వచనంతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి అధ్యక్షులు పెంటకోట భాస్కర సత్యనారాయణ, ధర్మకర్తల సభ్యులు సీనియర్ టిడిపి నాయకులు యనమల రాజేష్, చింతనీడి అబ్బాయి, అరిగెల నారసింహ మూర్తి, దూలం మాణిక్యం, గొల్లి అచ్చయ్యనాయుడు మరియు మహిళా నాయకులు పాల్గొన్నారు.

## రామవరం గ్రామంలోని 104 పోలవరం నిర్వాసిత ప్రజల సమస్యలపై సీఎం కు వినతిపత్రం

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.



రాష్ట్ర ముఖ్యమంత్రి రంపచోడవరం పర్యటనకు వచ్చిన సందర్భంగా సిపిఎం నాయకులు పులి బొజ్జి, కారం సుందరయ్య లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నీ నేరుగా కలసి పోలవరం ప్రాజెక్టు ముంపు పరిధిలోని వి.ఆర్. పురం మండలం, రామవరం గ్రామానికి చెందిన 104 గిరిజన, గిరిజనేతర కుటుంబాల సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ, రామవరం గ్రామానికి చెందిన 104 అర్హులైన కుటుంబాలను సాంకేతిక/సాటిలైట్ సర్వే లోపాల నెపంతో ఏకపక్షంగా ఆర్ అండ్ ఆర్ ముంపు జాబితా నుండి తొలగించడం తీవ్ర అన్యాయమని ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఒకే కాంటూర్ పరిధిలో ఉన్న గ్రామంలో సగం కుటుంబాలకు ప్యాకేజీ ఇచ్చి, మిగిలిన 104 కుటుంబాలను రోడ్డున పడేయడం సమంజసం కాదని, గోదావరి వరదలు వచ్చిన ప్రతిసారి ఈ ఇళ్లన్నీ నీటమునుగుతాయని వివరించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ముఖ్యమంత్రి ఈ అంశంపై అత్యంత సానుకూలంగా స్పందించి, రామవరం గ్రామంలోని 104 కుటుంబాలకు జరిగిన అన్యాయాన్ని పరిశీలించి, అధికారులతో క్షేత్రస్థాయిలో రీ-సర్వే నిర్వహించి ఖచ్చితంగా 104 కుటుంబాలకు న్యాయం చేస్తామని, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ మంజూరు అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు.

## ఇంటర్లో ఎక్కువ మార్కులు సాధించిన గిరిజన బాలికలకు గాంధీబాబు చేయూత



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

మండలంలోని రేఖపల్లి ఏ ఎస్ డి ఎస్ ఆధ్వర్యంలో ఆదివాసీ గిరిజన బాలికలకు ఇంటర్ ఎక్కువ మార్కులు ర్యాంకులు వచ్చిన విద్యార్థులకు ఆకార్యలయ సమావేశ మందిరం వద్ద శనివారం వారినీ ఏ ఎస్ డి ఎస్ అధినేత ఉండవల్లి గాంధీబాబు ప్రశంసించి, మంచిగా చదువుతున్న విద్యార్థినిలు ఆర్థిక స్తోమత లేని పేద వారికి ఏ ఎస్ డి ఎస్ చేయూత నిస్తుందని ఆయన తెలిపారు. మంచి మార్కులు సాధించిన పై చదువులు రాణించాలంటే ఆర్థిక ఇబ్బందుల ఎదుర్కొంటున్న అమ్మాయిలకు నేనున్నాను అంటూ ఏ ఎస్ డి ఎస్ సంస్థ ముందుకు వచ్చి పి ఫోర్ కార్యక్రమంలో భాగంగా ఆర్థికంగా సపోర్ట్ అందించడం జరుగుతుందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ బాలల హక్కులుపరిరక్షణ కమిషన్ సభ్యులు వి గాంధీ బాబు, స్టూడెంట్స్ ఉద్దేశించి మాట్లాడుతూ చైల్డ్ మ్యారేజెస్ తగ్గించాలని, ఆడపిల్లల చదువుకు అందరూ సహకరించాలని చదువుల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని స్టూడెంట్స్, వారి తల్లిదండ్రులతో ముఖాముఖి చర్చించారు. ఈ కార్యక్రమంలో రేఖపల్లి పంచాయతీ సెక్రెటరీ దుర్గాప్రసాద్, ఏ ఎస్ డి ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

### తొలిఏకాదశి సందర్భంగా ర్యాలి

## శ్రీ జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో భక్తుల రద్దీ



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.



డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలోని శ్రీ జగన్మోహినీ కేశవస్వామి దేవస్థానంలో తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా దేవస్థానంలో నిర్వహించిన నిత్యాన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అలాగే ర్యాలి గ్రామానికి చెందిన లలితా పారాయణదారులు శ్రీ లలితా సహస్రనామ పారాయణం, శ్రీ మణిద్వీప పారాయణం నిర్వహించి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, కార్యనిర్వాహణాధికారి పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. తొలిఏకాదశి సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

# కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి అసలైన ఊపిరి!

- స్థానిక ఎన్నికల్లో కూటమి విజయానికి సమష్టిగా కృషి చేయాలి: జ్యోతుల నవీన్
- కార్యకర్తల అభివృద్ధే మా ధ్యేయం: పిల్లి దంపతులు





ప్రజాభూమి ప్రతినిధి-కాకినాడ రూరల్

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అసలైన బలమని, రాబోయే స్థానిక సంస్థలు, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతీ కార్యకర్త సమష్టిగా పనిచేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పిలుపునిచ్చారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో శనివారం ఇంద్రపాలెంలోని పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పార్టీకి కార్యకర్తలే నిజమైన ఊపిరి అని, నాయకులు పార్టీలు మారినా తెలుగుదేశం పార్టీ జెండాను నమ్ముకుని నిలబడేది కార్యకర్తలేనని జ్యోతుల నవీన్ కొనియాడారు. జగ్గంపేట తర్వాత కాకినాడ రూరల్ నియోజకవర్గంలోనే తనకు అత్యంత ఆదరణ లభించిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న “తల్లికి వందనం”, ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.4 వేల సామాజిక పింఛన్ వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ నెల 27 నుంచి ప్రారంభమయ్యే “కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన - డోర్ టు డోర్” కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రజల సందేహాలకు ధైర్యంగా సమాధానాలు చెబుతూ ప్రభుత్వ పనితీరును వివరించాలని కోరారు. రాబోయే స్థానిక ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని కూటమి జెండా ఎగురవేసేలా ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా శ్రమించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇంచార్జి పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులు మాట్లాడుతూ ...నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తల అభివృద్ధే తమ ప్రధాన ధ్యేయమని అన్నారు. కార్యకర్తల సంక్షేమం, రాజకీయ ఎదుగుదలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఉంటుందని, పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ నెల 27 నుంచి చేపట్టనున్న ప్రచార కార్యక్రమంతో పాటు రానున్న స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అందరినీ కలుపుకుని ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.కార్యకర్తల కృషి వల్లే పార్టీ బలోపేతమై ఎన్నికల్లో విజయాలు సాధిస్తోందన్నారు. స్థానిక ఎన్నికల్లో విజయం కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటరు జాబితా సవరణలు, మై టీడీపీ పార్టీ యాప్‌లలో వివరాల నమోదు వంటి అంశాలపై బూత్ స్థాయి కన్వీనర్లు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేర్చాలని పిలుపునిచ్చారు.దేవాలయ కమిటీలు, వివిధ నామినేటెడ్ పదవుల్లో పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని సమావేశంలో పలువురు నాయకులు కోరారు. తమకు కుల, మత భేదాలు లేవని, పార్టీ కార్యకర్తలందరూ సమానమేనని పిల్లి దంపతులు స్పష్టం చేశారు. ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని, వారి వివరాలను పార్టీ అధిష్ఠానానికి తెలియజేసి నిబంధనల ప్రకారం పార్టీలో చేర్చుకుని సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.అనంతరం నియోజక వర్గంలోని గ్రామ కమిటీ అధ్యక్షులును ప్రకటించి సన్మానించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మేకా లక్ష్మణమూర్తి, కర్రీ వెంకటరాజు, వివిధ రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ డైరెక్టర్ లు,క్లస్టర్, బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్లు , టీడీపీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


కాకినాడ రూరల్ తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అసలైన బలమని, రాబోయే స్థానిక సంస్థలు, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతీ కార్యకర్త సమష్టిగా పనిచేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పిలుపునిచ్చారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో శనివారం ఇంద్రపాలెంలోని పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పార్టీకి కార్యకర్తలే నిజమైన ఊపిరి అని, నాయకులు పార్టీలు మారినా తెలుగుదేశం పార్టీ జెండాను నమ్ముకుని నిలబడేది కార్యకర్తలేనని జ్యోతుల నవీన్ కొనియాడారు. జగ్గంపేట తర్వాత కాకినాడ రూరల్ నియోజకవర్గంలోనే తనకు అత్యంత ఆదరణ లభించిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న “తల్లికి వందనం”, ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.4 వేల సామాజిక పింఛన్ వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ నెల 27 నుంచి ప్రారంభమయ్యే “కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన - డోర్ టు డోర్” కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రజల సందేహాలకు ధైర్యంగా సమాధానాలు చెబుతూ ప్రభుత్వ పనితీరును వివరించాలని కోరారు. రాబోయే స్థానిక ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని కూటమి జెండా ఎగురవేసేలా ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా శ్రమించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇంచార్జి పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులుమాట్లాడుతూ ...నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తల అభివృద్ధే తమ ప్రధాన ధ్యేయమని అన్నారు. కార్యకర్తల సంక్షేమం, రాజకీయ ఎదుగుదలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఉంటుందని, పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ నెల 27 నుంచి చేపట్టనున్న ప్రచార కార్యక్రమంతో పాటు రానున్న స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అందరినీ కలుపుకుని ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.కార్యకర్తల కృషి వల్లే పార్టీ బలోపేతమై ఎన్నికల్లో విజయాలు సాధిస్తోందన్నారు. స్థానిక ఎన్నికల్లో విజయం కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటరు జాబితా సవరణలు, మై టీడీపీ పార్టీ యాప్‌లలో వివరాల నమోదు వంటి అంశాలపై బూత్ స్థాయి కన్వీనర్లు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేర్చాలని పిలుపునిచ్చారు.దేవాలయ కమిటీలు, వివిధ నామినేటెడ్ పదవుల్లో పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని సమావేశంలో పలువురు నాయకులు కోరారు. తమకు కుల, మత భేదాలు లేవని, పార్టీ కార్యకర్తలందరూ సమానమేనని పిల్లి దంపతులు స్పష్టం చేశారు. ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని, వారి వివరాలను పార్టీ అధిష్ఠానానికి తెలియజేసి నిబంధనల ప్రకారం పార్టీలో చేర్చుకుని సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.అనంతరం నియోజక వర్గంలోని గ్రామ కమిటీ అధ్యక్షులును ప్రకటించి సన్మానించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మేకా లక్ష్మణమూర్తి, కర్రీ వెంకటరాజు, వివిధ రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ డైరెక్టర్ లు,క్లస్టర్, బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్లు , టీడీపీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.